మధ్య పేజీల్లో



తాటిపూడి జలాశయం వద్ద సుందర దృశ్యం


ప్రతి జ్ఞాపకం.. 'చిత్రం'గా పదిలం

నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

www.andhrajyothy.com vizianagaram

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY




16

విజయనగరం

శనివారం 19 ఆగస్టు 2017

దారి పొడవునా అక్రమాలు

ఆంధ్రజ్యోతి పరిశీలన



మూడు రోడ్లుగా చూపెడుతున్న లోతువానివలస రహదారి ఇదే

ప్రతి గ్రామానికీ రహదారి సౌకర్యం ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం లింక్ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తుంటే ...కొందరు అధికారులు వాటిలో స్వాహాకార్యానికి దిగుతున్నారు. నచ్చినట్టు ప్రతిపాదనలు పంపి ఇష్టారాజ్యంగా నిధులు డ్రా చేస్తున్నారు. ఉన్నవి లేనట్టు.. లేనివి ఉన్నట్టు సృష్టించి కాగితాల్లో నిర్మాణాలు చూపి ప్రభుత్వ సొమ్మును జేబులో వేసుకుంటున్నారు. ఒకే రహదారిని రెండుమూడుసార్లు నిర్మించినట్టు చూపుతున్నారు. జియ్యమ్మవలస మండలంలో గ్రావెల్ రోడ్ల నిర్మాణాలే ఇందుకు సజీవ సాక్ష్యాలు. ఉపాధి హామీ పథకం నిధులను పెద్దమొత్తంలో మళ్లించారు. ప్రభుత్వ ఆశయానికి తూట్లు పొడిచారు. ఈ తంతులో అధికారులు, నేతలే కీలక పాత్రదారులు.


- లింక్ రోడ్లపై అవినీతి నీడలు
- ఒక్కో రోడ్డుపై రెండు, మూడేసి బిల్లులు
- మెటల్ రోడ్లపైనా గ్రావెల్ పేరుతో నిధుల కైంకర్యం
- రూ.50 లక్షల వరకు పక్కదారి
- చర్యలు శూన్యం

(జియ్యమ్మవలస)

జియ్యమ్మవలస మండలంలోని 31 పంచాయతీల పరిధిలో తామరకండి జమ్ము పంచాయతీ మినహా మిగిలిన 30 చోట్ల ఉపాధి హామీ పథకం ద్వారా గ్రావెల్ రోడ్లు మంజూరయ్యాయి. 205 లింక్ గ్రావెల్ రోడ్లకు గాను అన్‌స్కిల్డ్(కూలి) నిధులు రూ.392.9 లక్షలు, మెటీరియల్ కింద రూ.574.89 లక్షలు కలిపి రూ.967.89 లక్షలతో అంచనాలు వేసి ప్రభుత్వానికి నివేదించారు. ప్రభుత్వం - మిగతా 14లో



మెటల్ రోడ్డుపై గ్రావెల్ వేసిన గంగమ్మపేట-పిప్పలభద్ర రోడ్డు



సాలూరు పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. చివరి శ్రావణ శుక్రవారం కావడంతో భక్తులు ఎక్కువ సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. పంచముఖేశ్వరస్వామి, సంతోషిమాత, దుర్గాదేవి, కామాక్షిదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. - సాలూరు

కరెన్సీతో అమ్మవారి అలంకరణ

బాలల హక్కుల కమిషన్ 7లో

చైర్‌పర్సన్‌గా హైమావతి



- 15ఏళ్లుగా బాలలు, మహిళల సేవలో నిమగ్నం
- హెచ్‌ఐవీ బాధిత కుటుంబాలకు అండదండలు

16లో



ఆదిభట్ల విగ్రహావిష్కరణ

గిరిజన వర్సిటీ పనులు వేగవంతం

భూ సమస్యలకు తొలగిన అడ్డంకులు

తొలి అడుగు

(శృంగవరపుకోట)

కొత్తవలస మండలం రెల్లి వద్ద గిరిజన విశ్వ విద్యాలయ పనులు చేపట్టేందుకు అడ్డంకులన్నీ తొలగిపోయాయి. భూ సమస్యలు కొలిక్కిరావడంతో శుక్రవారం మంత్రి సుజయ్ కృష్ణ రంగారావు వర్సిటీ ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ పరిణామంతో విశ్వ విద్యాలయ ఏర్పాటుకు అవసరమైన అభివృద్ధి పనులకు మార్గం సుగమమైంది. అనేక పరిణామాల - మిగతా 14లో

గిరిజనాభివృద్ధికే వర్సిటీ

భూములిచ్చిన వారంతా సహకరించాలి

చిత్తశుద్ధితో హామీలు నెరవేరుస్తాం

గిరిజన వర్సిటీ ప్రహరీకి మంత్రి సుజయ్ శంకుస్థాపన

(కొత్తవలస రూరల్)

గిరిజనుల అభివృద్ధి కోసమే గిరిజన యూనివర్సిటీని జిల్లాలో ఏర్పాటు చేయాలని కేంద్రం ముందుకొచ్చిందని, వర్సిటీ కోసం భూములిచ్చిన వారందరికీ ప్రభు త్వం న్యాయం చేస్తుందని భూగర్భ, గనుల శాఖ మంత్రి ఆర్‌వీఎస్‌కె రంగారావు అన్నారు. రెల్లి రెవెన్యూ పరిధిలోని అప్పన్నదొరపాలెం - మిగతా 14లో



గిరిజన యూనివర్సిటీ ప్రహరీకి శంకుస్థాపన చేస్తున్న మంత్రి సుజయ్

వంట గ్యాస్‌కూ.. ఉంది బీమా..

వినియోగదారుల్లో అవగాహన లేమి

లబ్ధిదారులకు అందని నష్టపరిహారం

మృతికి రూ.6లక్షలు, గాయాలకు రూ.25 వేల నుంచి రూ.2లక్షల వరకు



(కొత్తవలస)

ప్రమాదాలు జరిగినా సరైన అవగాహన లేకపోవడంతో లబ్ధిదారులు వాటి సౌకర్యాలను పొందలేకపోతున్నారు.వంటగ్యాస్‌కు బీమా సౌకర్యం ఉందని చాలా మందికి తెలియకపోవడం ఉదాహరణగా చెప్పవచ్చు. గ్యాస్ ఏజెన్సీలు కూడా దీనిపై ప్రజలకు అవగాహన కల్పించడం లేదు. దీంతో వంటగ్యాస్ సిలిండర్లు లీకైనా, పేలుడులు సంభవించి ప్రమాదాలు జరిగినా బాధితులు తమ ప్రారబ్ధమని సరిపెట్టుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే కిరోసిన్ సరఫరాను నిలిపివేసి గ్రామాల్లో ప్రతి ఇంటికి దీపం పథకం ద్వారా వంట గ్యాస్‌ను అందిస్తోంది. ఇకపై గ్యాస్ లేని కుటుంబం ఉండకూడదని యోచిస్తోంది. దీనిపై భారీగా ప్రచారాలు సాగిస్తోంది. ఇన్ని చేస్తున్నా వంటగ్యాస్ ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడం లేదు. ప్రమాదాలు జరిగితే గ్యాస్ ఏజెన్సీల నుంచి నష్ట పరిహారాన్ని వినియోగదారులు పొందే వీలుంది.

పబ్లిక్ లయబిలిటీ బీమా సౌకర్యం

ఎల్‌పీజీ గ్యాస్ వినియోగదారులకు ఆయా ఆయిల్ కంపెనీలూ పబ్లిక్ లయబిలిటీ బీమా సౌకర్యం కింద నష్ట పరిహారాన్ని చెల్లిస్తున్నాయి. వినియోగదారుడు ఏ ఆయిల్ కంపెనీకి చెందిన గ్యాస్ వాడుతున్నారో ఆ కంపెనీ నుంచి నష్టపరిహారాన్ని రాబట్టుకునే వీలుంది. ఈ సౌకర్యం గ్యాస్ ఉన్న ప్రతి గ్యాస్ వినియోగదారుడుకు వర్తిస్తుంది. అయితే బినామీ గ్యాస్ వాడుకునే వినియోగదారులకు మాత్రం ఈ సౌకర్యం లేదు. ఈ పాలసీలో థర్డ్ పార్టీ బీమా కూడా పొందే వీలుంది.

పరిహారం పొందడం ఇలా..

గ్యాస్ ప్రమాదంలో వ్యక్తి మృతి చెందితే సుమారు రూ.6లక్షల వరకు నష్టపరిహారం పొందే అవకాశం ఉంది. అలాగే గాయపడితే రూ.25వేల నుంచి ప్రమా దాన్ని బట్టి రూ.రెండు లక్షల వరకు ప్రమాద బీమా పొందే వీలుంటుంది. ప్రమాదం జరిగిన సమయంలో గృహోపకరణాలు, ఇంటికి నష్టం జరిగితే బీమా కంపెనీకి చెందిన సర్వే రిపోర్టు ప్రకారం నష్టపరిహారం చెల్లిస్తారు. అలాగే వినియోగదారుని ఇంట్లో గ్యాస్ లీక్ కావడం వల్ల చుట్టు పక్కల నివాసాలకు నష్టం వాటిల్లినా అందుకు రూ.40లక్షల వరకు పరిహారం పొందే వీలుంటుంది. సిలిండర్ పేలితే డిస్ట్రిబ్యూటర్‌కు వెంటనే సమాచారం ఇవ్వాలి. కంపెనీ పుస్తకం, బుక్ చేసుకున్న రశీదు, ప్రమాదం జరిగిన డోరు నెంబరుతో కూడిన బీమా క్లెయిమ్ దరఖాస్తులను అందించాలి. సిలెండర్ బుక్ చేసుకున్న డోరు నెంబరు కాకుండా వేరే డోరు నెంబరు ఇంట్లో ప్రమాదం జరిగితే నష్ట పరిహారం రాదు. ప్రమా దం జరిగిన ఏడు రోజుల్లో సమాచారం అందిస్తేనే నష్టపరిహారానికి అర్హత పొందుతారు. ఉద్దేశ పూర్వకంగా ప్రమాదం జరిగిందని నివేధిక వస్తే ఎట్టి పరిస్థితులలోను నష్ట పరిహారం ఇవ్వరు.

ప్రమాదాలు జరిగినపుడు అందజేయాల్సిన ధ్రువీకరణ పత్రాలు

మరణాలు చోటు చేసుకుంటే మరణ ధ్రువీకరణ పత్రం, ఎఫ్ఐ ఆర్, పోస్టుమార్టం రిపోర్టు, అగ్నిమాపక అధికారి ధ్రువీకరణ పత్రం జతపర్చాలి. గాయపడిన సందర్భాల్లో వైద్యుని ప్రిస్క్రిప్షన్, మందులు కొనుగోలు చేసుకున్నట్టు రశీదులు. ఆసుపత్రికి నుంచి చికిత్సకు సంబంధించిన ఖర్చులు వివరాలను పొందుపర్చాలి. అలాగే ఆస్తి నష్టానికి సంబంధించి బీమా కంపెనీకి చెందిన సర్వేయర్ ఇచ్చే రిపోర్టు ఆధారంగా నష్ట పరిహారం చెల్లిస్తారు.

గ్యాస్ ఏజెన్సీలు అవగాహన కల్పించాలి..

వంటగ్యాస్ ప్రమాదాలపై పట్టణాలు, గ్రామాల్లో తప్పనిసరిగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలి. వారానికొక రోజు గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు, అగ్నిమాపక శాఖాధికారులు వెళ్లి వంటగ్యాస్ నిర్వహణపై ముందుగా అవగాహన కల్పించాలి. గ్యాస్ లీకైనపుడు ఎటువంటి చర్యలు తీసుకోవాలి? ప్రాథమికంగా ఎవరికి సమాచారం ఇవ్వాలనే విషయమై స్పష్టంగా తెలియజేయాలి.

ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం



వంటగ్యాస్ వాడకంపై గ్యాస్ ఏజెన్సీలు తమ సిబ్బంది ద్వారా ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. వంటగ్యాస్ నిత్యావసరంగా మారింది. గ్యాస్ వల్ల ఎంత సుఖం ఉంటుందో అంతే ప్రమాదం ఉంటుంది. అందుచేత గ్యాస్ లీకైన సమయాల్లో ఎటువంటి చర్యలు తీసుకోవాలి? ఏవి చేయకూడదు తదితర అంశాలపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తాం.

జి.తాతారావు, అగ్నిమాపక కేంద్ర అధికారి, కొత్తవలస





ప్రమాదాల అడ్డుకట్టకు.. కొత్త చట్టం..

లోక్‌సభలో ఆమోదం

త్వరలో రాజ్యసభ ముందుకు బిల్లు

(కొత్తవలస)

రోజురోజుకూ పెరిగిపోతున్న రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం కొత్త మోటార్ వాహనాల చట్టాన్ని అమలులోకి తీసుకొస్తోంది. ఈ చట్టం ఇప్పటికే లోక్‌సభలో ఆమోదం పొందగా త్వరలో రాజ్యసభ ముందుకు వస్తోంది. ఇది అమలులోకి వస్తే కొంత వరకు నేరాలు నియంత్రణ జరిగే అవకాశాలు ఉన్నాయని న్యాయవాదులు చెబుతున్నారు. 2020 నాటికి రోడ్డు ప్రమాదాలను 50 శాతానికి తగ్గించాలనే ప్రణాళికతో కొత్త చట్టాన్ని అమలులోకి తీసుకొస్తున్నారు. ఇంట్లో మోటార్ వాహనం ఉంటే తాళాలు మైనర్లకు అందకుండా జాగ్రత్తపడాలి. ఒకే వేళ మైనర్లు వాహనాలు నడిపితే కొత్త చట్టం ప్రకారం వాహనయజమాని భారీ జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఇక మద్యం తాగి డ్రైవింగ్ చేసినా, లైసెన్సు లేకుండా పోలీసులకు చిక్కినా పోలీసులు వేసే జరిమానాలకు మత్తు వదలాల్సిందే. అలాగే రోడ్డు ప్రమాదాల్లో బాధితులకు ప్రభుత్వం ఇచ్చే రూ.25 వేల నష్ట పరిహారం రెండు లక్షల రూపాయల వరకు పెంచనుంది.

బాధిత కుటుంబాలకు ఊరట..

రానున్న రోజుల్లో రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి సుమారు రూ.రెండు లక్షల నష్టపరిహారం అందించనుంది. ప్రస్తుతం ఈ నష్టపరిహారం కేవలం రూ.25 వేలు మాత్రమే ఉంది. అందుకు మోటార్ వాహనాల చట్టం నిధిని కూడా ఏర్పాటు చేయనున్నారు. ప్రత్యేక అవసరాలు గల వాహనదారులు వారికి అనువుగా వాహనాన్ని మలచుకునేందుకు వీలు కల్పిస్తున్నారు. రోడ్డు ప్రమాదానికి డిజైన్ల లోపాలు కారణమైతే సంబంధిత కాంట్రాక్టర్‌పై కూడా చర్యలు తీసుకోవడానికి రూపకల్పన చేస్తున్నారు. బాధితులు థర్డ్ పార్టీ బీమా కూడా పొందే వీలుంది.

జరిమానాల మోతే!

మద్యం సేవించి వాహనాలు నడిపితే మత్తు దిగడంతోపాటు జరిమానాలు కట్టే వారి దిమ్మతిరగనుంది. కేంద్రం అమలు చేస్తున్న కొత్త చట్టం ప్రకారం ప్రస్తుతం రూ.రెండు వేలు ఉన్నదాన్ని రూ.పది వేల వరకు పెంచే అవకాశం ఉంది. నిర్లక్ష్యంగా వాహనం నడిపేవారికి ప్రస్తుతం విధిస్తున్న జరిమాన వెయ్యి రూపాయలు అయితే దీన్ని రూ.5వేల వరకు పెంచుతున్నారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనం నడిపితే రూ.ఐదు వేలు చెల్లించాల్సి ఉంటుంది. అతివేగంగా నడిపే వాహనదారుడుకు రెండు వేల రూపాయల వరకు జరిమానా ఉంటుంది. అలాగే వాహనం నడుపుతూ సెల్‌ఫోన్‌లో మాట్లాడితే సెల్‌ఫోన్ డ్రైవింగ్ కింద రూ.ఐదు వేలు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. సీటు బెల్ట్ ధరించకుండా కార్లు నడిపితే వంద నుంచి వెయ్యి రూపాయల జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఇవే కాకుండా ప్రమాదాలు చేసిన వారికి తీవ్రమైన శిక్షలు విధించే విధంగా సవరణలు చేశారు.



మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులదే బాధ్యత..

డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా అర్హత లేని బాలల చేతికి వాహనం ఇస్తే వారి తల్లిదండ్రులు చిక్కుల్లో పడినట్టే. మైనర్లు వాహనం నడుపుతూ ట్రాఫిక్ ఉల్లంఘనకు పాల్పడితే యజమానికి శిక్ష తప్పదు. అలాంటి సమయాల్లో తమకు తెలియకుండా వాహనం తీసుకెళ్లారని యజమాని రుజువు చేసుకోవాల్సి ఉంటుంది. ఒక వేళ మైనర్ వాహనాన్ని తల్లిదండ్రులకు తెలిసి తీసుకువెళ్లినట్టు రుజువైతే జువైనెల్ (బాల నేరస్తుల) చట్టం కింద శిక్ష విధిస్తారు.



చట్ట సవరణలు అభినందనీయం..



కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కొత్త చట్టం వల్ల రోడ్డు ప్రమాదాలు సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశాలు ఉన్నాయి. ప్రమాదాలకు కారణమైన వారికి నాన్‌బెయిల్‌బుల్ సెక్షన్ కింద కూడా అరెస్టు చేసే వీలుంది. చట్టం అమలులోకి వచ్చినా, నిఘా ఖచ్చితంగా ఉండాలి. ప్రతి ప్రాంతంలోను సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా నిందితులను సులభంగా గుర్తించే వీలుంటుంది.

గొడుగుల మహేంద్ర, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్

22న మున్సిపల్ కార్మికుల
చలో విజయవాడ



పోస్టర్ విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

సాలూరు: మున్సిపల్ కార్మికులకు అన్యాయం చేసే 279 జీవోను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 22 న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సీఐటీయూ నేత ఎన్‌వై నాయుడు అన్నారు. శుక్రవారం ఈ పోస్టర్‌ను విడుదల చేశారు. అనం తరం మాట్లాడుతూ కార్మికులు సమ్మె సిద్ధపడిన నేపథ్యంలో గతంలో జీవో నిలిపివేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. మళ్లీ జీవో అమలుకు చర్యలు చేపడుతోందన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఈసందర్భంగా వారు డిమాండ్ చేశారు. చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు టి. వెంకటరావు, శంకరరావు పాల్గొన్నారు.

సక్రమంగా అందని వైద్య సేవలు

● మండల సమావేశంలో సభ్యుల ధ్వజం

గుర్ల: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు సక్రమంగాసేవలందించడంలేదని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు తోట తిరుపతిరావు ఆరోపించారు. శుక్రవారం మండలం పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జమ్ము సత్యం అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కిమిడి మృణాళిని హాజరయ్యారు. ముందుగా ఎంపీడీవో రవికుమార్ ఎజెండా అంశాల వారీగా చదివి వినిపించారు. ఈసందర్భంగా గుర్ల, తెట్టంగి పీహెచ్‌సీల్లో డాక్టర్లు అందుబాటులో ఉండటంలేదని తోట తిరుపతిరావు ఆరోపించారు. తెట్టంగిలో రాత్రివేళలో వైద్యులు లేక రోగులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. పాడి రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందని పశువైద్యాధికారి సీహెచ్ సుబ్రహ్మణ్యం అన్నారు. అంగన్‌వాడీ భవనాలు నిర్మాణంలో జాప్యం జరుగుతోందని నెల్లిమర్ల ఐసీడీఎస్ పీవో రమాదేవి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదులు కొరత ఉందని ఎంఈవో భాను ప్రకాశ్ తెలిపారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్‌ల్లో గంటలు తరబడిమాట్లాడుతూ బోధనలో నిర్లక్ష్యం వహిస్తున్నారని సభ్యులు తిరుపతిరావు, వికేశవరావు, కెంగువ మధుసూదనరావు ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో దోచుకున్నారని కెల్ల సర్పంచ్ కర్రోతు రమణమ్మ ఆరోపించడంతో సభలో గందరగోళం ఏర్పడింది. గడిగెడ్డకుసాగు నీరందించడం లేదని సభ్యులు ఆరోపించారు.

ఎమ్మెల్యే ఇలా వచ్చారు..ప్రజా ప్రతినిధులు అలా వెళ్లిపోయారు

మాజీ మంత్రికిమిడి మృణాళిని సమావేశం ప్రారంభమైన రెండు గంటలకు వచ్చారు. అప్పటికే ప్రజా ప్రతినిధులు చాలామంది వెళ్లిపోయారు. సమావేశంలో అధికార పక్షం సభ్యులు ఎమ్మెల్యేను గట్టిగా నిలదీశారు. నడుపూరు, చింతలపేట, ఆనందపురం రోడ్డు పనులు నిలిచిపోయాయని చెప్పారు. ఉపాధి కూలీలకు డబ్బులు ఇవ్వడం లేదని అన్నారు. ఇళ్ల బిల్లులు, మరుగుదొడ్ల బిల్లులు చెల్లించకపోవడంతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందని ఆరోపించారు.

బెల్టుషాపులపై ఎమ్మెల్యే ఆగ్రహం

బెల్టుషాపులు గ్రామాల్లో నిర్వహిస్తున్నారని ప్రజా ప్రతినిధులు చెప్పడంతో నెల్లిమర్ల ఎక్సైజ్ ఎస్ఐ జోగమ్మపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తంచేశారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి కిమిడి మృణాళిని

మండ ల లో నాలుగు లైసెన్సు షాపులనుంచి బెల్ట్ షాపులకు మద్యం తరలిస్తున్నారని తెలిసి ఆమె మండిపడ్డారు.

పది రోజులుగా తాగునీరు బంద్

గరికివలస, గుర్ల , పాలవలస తదితర గ్రామాల్లో తాగునీరు సరఫరాకావడంలేదని ఆత్మ డైరెక్టర్ కనిమెరక కృష్ణ ఆరోపించారు. పాలవలసలో అక్రమ కుళాయి కనెక్షన్లతో నీరు కలుషితమవుతుందని సభ్యులు తెలిపారు.

కార్యక్రమంలో జడ్పీటీసీ తిరుమలరాజు పద్మిని, ఎంపీడీవో రవికుమార్, మండల విప్ సంచాన సన్యాశినాయుడు, వైసీసీ ప్రతినిధి కెంగువ మధుసూదనరావు, పీహెచ్‌సీ వైద్యులు సంతోష్ , రూప, పలు శాఖల అధికారులున్నారు.

విద్యుదాఘాతానికి పాడి గేదె మృతి



మృతి చెందిన గేదె

శృంగవరపుకోట: విద్యుదాఘానికి పాడిగేదె మృతి చెం దింది. స్థానిక ఆర్‌సీఎం చర్చి సమీపాన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద శుక్రవారం మేత మేస్తుండగా, విద్యుత్ పరికరాలకు తాకడంతో సంఘటనా స్థలంలోనే ఈ గేదె మృతిచెందింది. నెలరోజుల కిందట రూ. 70వేలు అప్పుచేసి కొనుగోలు చేసిన గేదె మృతి చెందిందంటూ బాధితరాలు యలమంచిలి రమణమ్మ విలపించింది. గతనెలలోనే రూ. 50వేలతో పాడి గేదె కాలువలో పడి మృతిచెందిదని పేర్కొంది. వీటి ఆధారంగానే తమ ఇద్దరు కుమారుల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. ఈస్థితిలో ప్ర భుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ఎంపీటీసీ సభ్యుడు మోపాడ కుమార్, బాపూజీ సేవా సంఘం వ్యవస్థాపకుడు మోపాడ మరియదాస్ కోరారు.

పాముకాటుతో అస్వస్థత

శృంగవరపుకోట రూరల్ తిమిడి గ్రామానికి చెందిన కోరుపోలు చినతల్లి శుక్రవారంపాముకాటుతో అ స్వస్థతకు లోనైంది. పొలంపనులు ముగించుకొని ఇంటికి వస్తుండగా ఆమెను పాముకాటు వేసింది. వెంటనే భర్త త్రినాధ్, గ్రామపెద్ద గెదెల విజయ్‌బాబు ఎస్.కోట ప్రభుత్వ ఆసుపత్రికి హుటాహుటిన తీసుకెళ్లారు. వైద్యాధికారి రంది త్రినాథరావు చికిత్స అందించడంతో ఆమెకు ప్రాణపాయం తప్పింది.



సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న చినతల్లి

అభివృద్ధి చేస్తే కేసులా?

● టీడీపీ ఎస్టీ సెల్ జిల్లా నేత లక్ష్మణరావు



మాట్లాడుతున్న టీడీపీ ఎస్టీ,ఎస్సీ నేతలు

సాలూరు రూరల్: గిరిజన, దళిత వర్గాలకు టీడీపీ పెద్దపీట వేసి అభివృద్ధి చేస్తుంటే, ఆనేతపై కేసులు పెడతామనడం సరికాదని టీడీపీ ఎస్టీ సెల్ జి ల్లా ప్రధాన కార్యదర్శి దొర లక్ష్మణరావు ప్రశ్నించారు. శుక్రవారం విలేఖరులతో టీడీపీ నేతలు బోను లక్ష్మణరావు, జీగిరాం సర్పంచ్ బలగ రాజేశ్వరి, బలగ లక్ష్మణరావులతో కలిసి ఆయన మాట్లాడారు. గిరిజన, ద ళిత వర్గాల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమ ఫలాలు నేరుగా వారికే అందిస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో గిరిజనుల పేరిట మంజూరైన ఇళ్ల, సంక్షేమ పథకాలు దళారులు దిగమించారన్నారు. అప్పుడు అన్యాయం జరి గినా ఎందుకు స్పందించలేదన్నారు. టీడీపీలో సంక్షేమ పథకాలు నేరుగా వారి ఖాతాకే జమవుతున్నా య న్నారు. గిరిజన ప్రాంతాలకు రోడ్లు, తాగునీరు తది తర అభివృద్ధి, పింఛన్లు, రుణమాఫీ, శతశాతం రాయితీపై వ్యవసాయానికి సూక్ష్మకాలు, చిరుధాన్య విత్తనాలు అం దుతున్నాయన్నారు. గిరిజన, దళిత అభివృద్ధికి పాటు పడే వారిపై విమర్శలు మానుకుని, నిర్మాణాత్మక సలహాలివ్వాలని కోరారు.

పార్వతీదేవికి ప్రత్యేక పూజలు

పార్వతీపురం టౌన్: శ్రీపార్వతీదేవి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విఘ్నేశ్వరుని పూజ అనంతరం అమ్మవారికి మహిళలు కుంకుమార్చనలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు బంకపల్లి కృష్ణశర్మ వేదమంత్రాల మధ్య లక్ష్మీదేవి అవతారంలో ఉన్న అమ్మవారికి ఎర్ర గాజులు, రవికలను అందించారు.



పూజలు చేస్తున్న భక్తులు

అంతా సగం..సగం

• పోలీసుల తీరుపై వ్యాపారుల నిరసన •మధ్యలో ఆగిన క్రమబద్ధీకరణ

పార్వతీపురం టౌన్: పట్టణ ప్రధాన రహదారిలో రాకపోకలకు అంతరాయం కలగకుండా పోలీసులు స్థానిక నాలుగు రహదారుల కూడలి నుంచి పాత బస్టాండ్ వరకు ఆక్రమణ తొలగించారు. ప్రధాన రహదారికి ఆనుకొని కొన్ని షాపులకు మెట్లు, పలకలను పట్టణ ఎస్ఐ రాజేష్ తొలగించారు. అంతా బాగానే ఉంది. కానీ కొంతమంది వ్యాపారుల గోడలు, పలకలు కూలగొట్టిన ఎస్ఐ రాజేష్, సిబ్బంది తరువాత ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం చర్చించనీయాంశంగా మారింది. కొంతమంది వ్యాపారుల గోడలు, మెట్లు తొలగింపు వివాదాలకు కారణమవుతంది. నాలుగు రహదారుల కూడలి నుంచి మేదరవీధి వరకు వివిధ వ్యాణిజ్య సముదాయాల యజమానులు ప్రధాన రహదారికి ఆనుకొని ఆక్రమించుకొని ప్రధాన కాలువను కప్పేశారు. దీంతో ఓ మోస్తారు వర్షం పడితే చాలు ప్రధాన రహదారిపై నీరు అలానే ఉండిపోతుంది. దీనిపై పోలీస్‌శాఖ గాని, ఆర్అండ్‌బీ అధికారులు కనీసం చర్యలు చేపట్టకపోవడం దురదృష్టకరమంటున్నారు.



ప్రధాన రహదారిపైకి వేసిన పక్కా గచ్చులు

సమన్యాయం లేదా..?

నాలుగు రహదారుల కూడలి నుంచి పాతబస్టాండ్ వరకు ఆక్రమణలను తొలగిస్తే ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుందనడం సరికాదని పలువురు అంటున్నారు. ఆక్రమణల తొలగింపులో పోలీసులు సమన్యాయం పాటించాలని వ్యాపారులు కోరుతున్నారు. బెలగాం గెడ్డవీధి శివారు నుంచి పాతబస్టాండ్ వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా ఆక్రమణలు ఎప్పుడు నుంచో ఉన్నాయని, వాటిని తొలగించాలని ప్రజా సంఘాల వారు కోరుతున్నారు. 2004 సంవత్సరంలో ప్రధాన రహదారి విస్తరణ చేసినప్పటికీ ఇంకా ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయంటే దీనికి పోలీసులు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాల్సి ఉంది.



తొలగించి వదిలేసిన ఆక్రమణ స్థలంలోని పలకలు

ఒక్కోసారి ప్రధాన రహదారి గుండా భారీ వాహనాల రాకపోకల సమయంలో ట్రాఫిక్ స్తంభించిపోతుంది. ప్రధాన రహదారిలో ట్రాఫిక్ నిబంధనలు పాటించని తోపుడు బండ్లు, పండ్లు, వ్యాపారులతో పట్టణ పోలీసులు చర్చించాల్సిన అవసరం ఉంది. ఆక్రమణల తొలగింపు విషయంలో పోలీసులు పక్షపాత ధోరణి లేకుండా వ్యవహరిస్తే విమర్శలకు తావులేకుండా ఉంటుందని పలువురు వ్యాపారులు వాఖ్యానిస్తున్నారు.

పోలీసుల అత్యుత్సాహంతో ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ వద్ద కొంత మంది వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలిసింది. వీరికి ఎమ్మెల్సీ జగదీష్ స్పందించి పోలీసులు చేస్తున్న అత్యుత్సాహం చూస్తున్నానని, ఇక నుంచి ఎవరూ షాపుల ముందున్న మెట్లు, గోడలు, పలకలు తొలగించకుండా చూస్తానని హామీ ఇచ్చినట్టు సమాచారం. వ్యాపారులు ఊపిరి పీల్చుకున్నట్టు భోగట్టా.

రేపు గుండె జబ్బుల వైద్య శిబిరం

పార్వతీపురం టౌన్: స్థానిక లయన్స్ కల్యాణ మంటపంలో ఆదివారం గుండె జబ్బుల వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఐ.గోపాలరావు, బోటు అప్పలనరసయ్య తెలిపారు. శుక్రవారం లయన్స్ కల్యాణ మంటపంలో విలేఖరులతో మాట్లాడుతూ సామాన్య, మధ్య తరగతి వర్గాల వారు ఈ మధ్య గుండె జబ్బుల బారిన పడుతున్నారన్నారు. ఆర్థిక స్థోమత లేని వారికి లయన్స్ ఆసరాగా నిలబడుతుందన్నారు. వైద్య శిబిరంలో గుండె పరీక్షతో పాటు ఈసీజీ, ఎకో గుండె స్కానింగ్ ఉచితంగా తీయనున్నట్టు చెప్పారు. అవసరమైయితే యాంజీయోగ్రామ్ పరీక్షను విజయవాడ హెల్ప్ మల్టీ హాస్పిటల్‌లో నిర్వహిస్తామన్నారు. పేద కుటుంబాలకు చెందిన వారికి గుండెలో స్టంట్‌లు వేయడానికి, ఆపరేషన్‌లు చేయించడానికి హెల్ప్ హాస్పిటల్ సహాయ, సహకారాలను అందిస్తుందన్నారు. అవసరమైతే రెండు రోజుల పాటు వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

లయన్స్ కల్యాణ మంటపంలో మెగా ఫ్యాన్స్, లయన్స్ సంయుక్తంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రమాదాల్లో, రక్తహీనత కలిగిన గర్భిణిలకు రక్తదాతలు ఇచ్చిన రక్తం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రక్తదాన శిబిరంలో మెగా ఫ్యామిలీ, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొని రక్తదాతలు కావాలని కోరారు.



విలేఖరులతో మాట్లాడుతున్న లయున్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు

ఏజెన్సీలో నకిలీ విలేఖరుల హల్‌చల్

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఏజెన్సీలలో నకిలీ విలేఖరులు సంచరిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి డబ్బులను డిమాండ్ చేస్తున్నారు. శ్రీకాకుళానికి చెందిన ఇరువురు నకిలీ విలేఖరులు శుక్రవారం మధ్యాహ్నం గుమ్మలక్ష్మీపురం జీసీసీ కార్యాలయానికి వచ్చి జీసీసీ మేనేజర్‌కు డబ్బులు కోసం డిమాండ్ చేశారు. అదే సమయంలో స్థానికంగా ఉన్న కొందరు విలేఖరులు జీసీసీకి వెళ్లారు. వీరు నకిలీ విలేఖరులను నిలదీయడంతో అక్కడి నుంచి జారుకున్నారు. వీరు చిన్న పత్రికల విలేఖ రులగా విజిటింగ్ కార్డులు పట్టుకుని ఏజెన్సీలో తిరుగుతున్నారు. గిరిజన సంక్షేమ వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, జీసీసీ డీఆర్ డిపోలు టార్గెట్‌గా చేసుకుని డబ్బులు వసూలు చేస్తున్నారు.

ఘనంగా దుర్గా సహస్ర నామార్చనలు

పార్వతీపురం టౌన్: పట్టణంలోని శ్రీసర్వమంగళాదేవి పీఠం ఆవరణలో శ్రావణ శుక్రవారం ఏకాదశి పర్వదినం సందర్భంగా పీఠాధిపతి మురపాక కాళిదాసుశర్మ, రుత్వికుల వేదమంత్రాల మధ్య దుర్గా సహస్రనామార్చన నిర్వహించారు. ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యావచనం అనంతరం యజ్ఞకర్త రాజీవ్‌రెడ్డి, పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్ యాళ్ల వివేక్, డాక్టర్ యాళ్ల పద్మజలతో కాళిదాసుశర్మ అమ్మవారికి పూజలు చేయించారు. అలాగే చండీ సప్తశతి, అరుణ, సౌర, సూర్య నమస్కారాలు, మన్యు, సూక్త, సుదర్శన పారాయణాలు చేశారు. సాయంత్రం చండీ హోమం, సహస్ర లింగార్చన శతరుద్రీయం, మన్యు, సూక్త, రుద్ర, సుదర్శన హోమాలు, చేశారు.

అభేదానంద స్వామికి ఘనస్వాగతం

హోమ సహస్ర చండీయాగంలో పాల్గొనేందుకు వచ్చిన పూరి గోవర్ధన పీఠాధిపతి అభేదానంద సరస్వతీ స్వామికి మురపాక కాళిదాసుశర్మ ఘన స్వాగతం పలికారు. శుక్రవారం ఉదయం దుర్గగుడివీధిలోని శ్రీకాశీవిశ్వేశ్వర ఆలయం నుంచి హోమ సహస్ర చండీ యాగశాలల వరకు మంగళ వాయిద్యాలతో తీసుకువెళ్లారు. అనంతరం యాగశాల వద్ద యజ్ఞకర్త రాజీవ్‌రెడ్డి కుటుంబ సభ్యులతో సరస్వతీస్వామి, కాళిదాసుశర్మలు లోకశాంతి కోసం హోమాలు చేశారు. ఈ సందర్భంగా అభేదానంద సరస్వతీ స్వామి భక్తులనుద్దేశించి మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో ఇటు వంటి యాగాన్ని నిర్వహించడం ఈ ప్రాంతవాసుల అదృష్టమన్నారు. యాగాదుల్లో పాల్గొనడం పూర్వ జన్మ సుకృతమన్నారు. హోమాలతో పర్యావరణ కాలుష్య సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు.



అభేదానంద స్వామికి స్వాగతం పలుకుతున్న రుత్వికులు

కురుస్తూనే ఉంది..

పార్వతీపురం టౌన్: వరుణ దేవుడు ఎట్టకేలకు కరుణించాడు. శుక్రవారం ఉదయం నుంచి వర్షం కురుస్తూనే ఉంది. గత వారం రోజులగా తీవ్రమైన ఎండ కాసింది. గురువారం సాయంత్రం నుంచి వాతావరణంలో మార్పులు వచ్చాయి. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారులు చెబుతుండడంతో రైతుల్లో ఆనందం కనిపిస్తుంది. వర్షా కాలంలో మండు వేసవిని తలపించడంతో పట్టణ ప్రజలు అల్లాడిపోయారు. వరుణుడు దయ చూపడంతో వర్షాలు కురవడం ప్రారంభమయ్యాయి. చుట్టు పక్కల గ్రామాల్లో ఊభాలకు సిద్ధమవుతున్న తరుణంలో వర్షం కురుస్తుండడం రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రెండు, మూడు రోజుల పాటు వర్షం కురిస్తే ఉభాలు త్వరితగతిన పూర్తయ్యే అవకాశం ఉందని వ్యవసాయశాఖాధికారులు చెబుతున్నారు.



పట్టణంలో వర్షంలో తడుస్తూ వెళ్తున్న ప్రజలు

గ్యాస్ సమాచారం

పార్వతీపురం పెంటపాటి కామరాజు గ్యాస్ ఏజెన్సీ పరిధిలో శుక్రవారం వరకు బుక్ చేసుకున్న కురుపాం మండలం, గరుగుబిల్లి మండలం రావివలస, పార్వతీపురం మండలం బాలగొడబ, పట్టణ వినియోగదారులకు శనివారం గ్యాస్ సరఫరా అవుతుంది. ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేయ దలచిన వారు 9666023456 నెంర్‌కు ఆన్‌లైన్ బుకింగ్ చేసుకోవాలి. ఫిర్యాదులు, సలహాల కోసం గ్యాస్ ఏజెన్సీ ల్యాండ్‌లైన్ 08963- 221425, 221345 నెంబర్లను సంప్రదించాలి.

సినిమా గైడ్

వెంకటేశ్వర కళామందిర్	ఫిదా
పద్మశ్రీ	లై
సౌందర్య	నేనే రాజు నేనే మంత్రి

త్రుటిలో తప్పిన ప్రమాదం

పార్వతీపురం టౌన్: పట్టణంలోని నవరత్న థియేటర్ కూడలి సమీపంలోని ఫ్లైఓవర్ వద్ద ద్విచక్ర వాహనచోదకునికి త్రుటిలో ప్రమాదం తప్పింది. శుక్రవారం ఉదయం కురుపాం నుంచి పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు వెళ్తున్న కురుపాంకి చెందిన రాజు భారీ వాహన పక్కన వెళ్తున్నాడు. వర్షం కురస్తుండడంతో రాజు ప్రమాదవశాత్తు భారీ వాహనం కిందకు వెళ్లిపోయాడు. భారీ వాహన డ్రైవర్ అప్రమత్తంగా ఉండడంతో రాజుకు ప్రాణాపాయం తప్పింది. స్థానికులు వెంటనే వాహనం కింద ఉన్న ద్విచక్ర వాహనంతో పాటు రాజును రక్షించారు.



రాజును వాహనం కింద నుంచితీస్తున్న స్థానికులు

జాబ్ మేళాలో 70 మంది ఎంపిక

పార్వతీపురం టౌన్: స్థానిక గాయిత్రీ కళాశాలలో రెడ్డీస్ ల్యాబ్ నిర్వహించిన జాబ్ మేళాలో 70 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్టు ల్యాబ్ హెచ్‌ఆర్ మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఉదయం జాబ్ మేళాకు సుమారు 220 మంది హాజరైనట్టు ఆయన తెలిపారు. స్క్రీనింగ్ పరీక్ష అనంతరం రెండేళ్ల పాటు శిక్షణతో పాటు మొదటి సంవత్సరం రూ. 1.45 లక్షలు, రెండో సంవత్సరం రూ. 1.55 లక్షలు స్టైఫండ్, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి విశాఖపట్నం, హైదారాబాద్‌ల్లో ఉద్యోగాలు ఇస్తారన్నారు.



జాబ్‌మేళాకు హాజరైన వారితో మాట్లాడుతున్న శ్రీనివాస్

భూసమస్యల పరిష్కారానికే సదస్సులు

జియ్యమ్మవలస: భూ సమస్యలు పరిష్కరించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి తహసీల్దార్ కేవీఎస్ భాస్కరరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో రైతు సేవలో రెవెన్యూశాఖ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతుల నుంచి 14 దరఖాస్తులు వచ్చాయని చెబుతూ ఇందులో 8 అడంగల్ కోసం, 4 మ్యూటేషన్స్ కోసం, 2 సర్వే చేయాలని ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శివ జగన్మోహనరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ భాస్కరరావు



కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి

బలిజిపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులందరికి తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ఎంపీడీవో శ్రీరామ్మూర్తి అన్నారు. శుక్రవారం మిర్తివలసలో ఆయన అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారుల ఎదుగుదలలో వచ్చే మార్పులను గమనించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు.

సదస్సులను సద్వినియోగం చేసుకోండి

పెద్దూరు (గరుగుబిల్లి): గ్రామాల్లో రైతు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సీహెచ్ రాధాకృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం పెద్దూరు, బీవీ పురం గ్రామాల్లో రైతు సేవలో రెవెన్యూశాఖ సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల భూసమస్యలు రెవెన్యూ సిబ్బంది దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామాల్లో తప్పులు లేని విధంగా రికార్డులను తయారు చేసి, అవసరమైన 1బిలను అందించనున్నట్టు చెప్పారు. మ్యూటేషన్స్, అడంగల్ కరక్షన్లు, సర్వే నిర్వహణకు దరఖాస్తులు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జి.ఉషాసరస్వతి, సర్పంచ్ బోగి పార్వతి, సింహాచలం, బి.శ్రీరాములునాయుడు, భూలక్ష్మి, ఆర్ఐ పి.శ్రీనివాసరావు, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, ఏఎస్‌వో ఎస్.గౌరీశంకరరావు, వీఆర్‌వోలు నాగేశ్వరరావు, మంగమ్మ పాల్గొన్నారు.



వినతులు పరిశీలిస్తున్న తహసీల్దార్ రాధాకృష్ణమూర్తి

సమస్యల పరిష్కారానికే సదస్సులు...

కొమరాడ: గ్రామాల్లో రెవెన్యూపరంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకే రైతు సేవలో రెవెన్యూశాఖ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి తహసీల్దార్ ఆవాల సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం విక్రమపురంలో రైతు సేవలో రెవెన్యూశాఖ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూపరమైన సమస్యలపై 20 మంది దరఖాస్తు చేసుకున్నారు. అడంగళ్లు, 1బిలు సరి చేయడంతో పాటు ఆన్‌లైన్‌లో ఉంచాలని, మ్యూటేషన్ ఫిటిషన్లు దరఖాస్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ ఉపా . ధ్యక్షులు కె.మల్లిబాబు, ఎంపీటీసీ జి.త్రినాధం, ఆర్ఐ, వీఆర్‌వో పాల్గొన్నారు.



విక్రమపురంలో సదస్సు దృశ్యం

ప్రకృతి వ్యవసాయంలో ఆరోగ్యకర ఆహారం

కురుపాం: ప్రకృతి వ్యవసాయంలో ఆరోగ్యకరమైన ఆహారం పండించవచ్చని వ్యవసాయశాఖ ఏడీఏ పి.శంకరరావు తెలిపారు. శుక్రవారం కురుపాం గిరిజనసంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయంపై మెలకువలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థులతో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వై.నారాయణరావు, ఏఈవోలు పాల్గొన్నారు.

వంట పాత్రలను సక్రమంగా వాడుకోండి

కురుపాం: అంగన్‌వాడీ కేంద్రాల్లో వంట పాత్రలను సక్రమంగా ఉపయోగించుకోవాలని ఎంపీడీవో జి.పైడితల్లి సూచించారు. శుక్రవారం కురుపాం ఎంపీడీవో కార్యాలయంలో అంగన్‌వాడీ కేంద్రాలకు వంట పాత్రలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఎన్.కృష్ణుడు, గ్రామ కార్యదర్శులు, ఐసీడీఎస్ పీవో కె.రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

జరడ సబ్ సెంటర్ పరిధిలో టీకాలు

కురుపాం రూరల్: గిరి శిఖరాన ఉన్న జరడ సబ్ సెంటర్ పరిదిలోని 17 గ్రామాల్లోని 341 మంది పిల్లలకు శుక్రవారం ఎమ్మార్ టీకాలు వేశారు. నీలకంఠాపురం వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలోని బృందం 17 గ్రామాలు సందర్శించి 9 నెలల నుంచి 15 సంవత్సరాల వయస్సు పిల్లలకు టీకాలు వేశారు. ఉండిపోయిన పిల్లలకు త్వరలోనే వేస్తామని చేప్పారు.

కుక్కల దాడిలో యువకులకు గాయాలు

● పట్టణంలో విచ్చలవిడిగా సంచారం ● ప్రజల బెంబేలు

పార్వతీపురం టౌన్: కుక్కల దాడిలో ఇద్దరి యువకులకు తీవ్రగాయాలయ్యాయి. బెలగాం రైతుబజారు సమీపంలోని నెల్లి చెరువు గట్టు మీద ఉంటున్న మట్టా సుమన్, దేవుపల్లి రాజులు శుక్రవారం ఉదయం ఇళ్ల నుంచి బయటకు వస్తున్నారు. ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నాలుగు కుక్కలు వీరిపై దాడికి దిగాయి. కుక్కల దాడిలో సుమన్ ఎడమ చేయి, రాజు ఎడమ కాలు తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్సను అందించారు. మున్సిపల్ ప్రజారోగ్యశాఖాధికారులు పట్టణంలోని కొన్ని చోట్లే కుక్కలను పట్టుకొన్నారని, నెల్లి చెరువు గట్టుపై గుంపులు, గుంపులుగా తిరుగుతున్న కుక్కలను నియంత్రించలేకపోయారని దాడిలో గాయపడిన యువకుల కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుక్కల నియంత్రణకు చర్యలు ఏవీ..?

కుక్కల నియంత్రణ చేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని మున్సిపల్ ప్రజారోగ్యశాఖాధికారులు చెబుతున్నారు. పట్టణంలో ఇంకా కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడులకు దిగుతున్నాయి. ఈ మూడు నెలల కాలంలో సుమారు 20 నుంచి 30 మందిని గాయపర్చినట్టు ప్రజలు చెబుతున్నారు.

ఎవరికైనా కరిచినప్పుడు హడావిడి చెయ్యడమే తప్ప తరువాత పట్టించు కోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటకైనా కుక్కలను నివారించి ప్రజలకు రక్షణ కల్పించాలని పట్టణ ప్రజలు, ప్రజా సంఘాలు కోరుతున్నాయి.



కుక్కల దాడిలో గాయాలపాలైన సుమన్, రాజు (కూర్చున్నవారు)

ఇంటింటికీ 'తెలుగుదేశం' విజయవంతం చేయండి

● ఎమ్మెల్యే చిరంజీవులు

పార్వతీపురం: ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ కోరారు. సెప్టెంబర్ 3 నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని అధిష్ఠానం నిర్ణయించడంతో నియోజకవర్గంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా బైపాస్ రహదారి నిర్మాణం, వర్షాభావ పరిస్థితి, తదితర అంశాలపై చర్చించి తీర్మాణాలు చేశారు. ఎమ్మెల్యే చిరంజీవులు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్న ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ జయప్రకాష్‌నారాయణ, పార్వతీపురం, బలిజిపేట, సీతానగరం ఎంపీపీలు హరిప్రియధాత్రాజ్, పెంకి పార్వతి, అప్పలనాయుడు, బలిజిపేట జడ్పీటీసీ ఎం.రాధ, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గొంగాడ రామ్మూర్తి, పట్టణ అధ్యక్షుడు కోలా వెంకటరావు, నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు గొట్టాపు వెంకటనాయుడు, కొమ్మినేని కిశోర్, దొగ్గ మోహన్, మూడు మండలాల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

నిర్వాసితుల సమస్యలపై విచారణ

కొమరాడ: తోటపల్లి ప్రాజెక్టు ముంపునకు గురైన గుణానుపురంలో సమస్యలపై ఆర్డీవో బి.సుదర్శనదొర శుక్రవారం విచారించారు. గ్రామంలో 60 మంది వరకు ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీ అందలేదని వినతులు ఇచ్చారు. అంతేకాకుండా ఇందులో 40 మంది హైకోర్టులో రిట్ పిటిషన్ వేయడం, మరో మారు దర్యాప్తు నిర్వహించి తగు చర్యలు తీసుకోవలసిందిగా కోర్టు ఆదేశించింది. వీటిని పరిష్కరించడానికిఆర్డీవో దర్యాప్తు చేపట్టారు.



విచారిస్తున్న ఆర్డీవో సుదర్శనదొర

మెనూ అమలుచేయకపోతే చర్యలు

బలిజిపేట: కేజీబీవీ పాఠశాల్లో ప్రభుత్వ మెనూ సక్రంంగా అమలు చేయకపోతే కఠిన చర్యలుంటాయని మండల విద్యాశాఖాధికారి జి.శ్రీనివాసరావు హెచ్చరిం చారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల్లో భోజన ఏర్పాట్లను పరిశీలించారు. పాఠశాల పని తీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల సిబ్బంది తీరు ప్రజల్లో వ్యతిరేకత కనిపిస్తుందని తీరు మార్చుకోకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. విద్యార్థినులకు వడ్డించే పప్పులో కోత విధించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేజీబీవీ ఇన్‌చార్జి ప్రత్యేకాధికారి ప్రమీల ఎంఈవోకు పాఠశాల రికార్డులు, స్టాకు వివరాలు వివరించారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈవో

వసతిగృహాల్లో గ్యాస్ పొయ్యిలతోనే వండాలి

● ఐటీడీఏ పీవో డాక్టర్ లక్ష్మీశ

పార్వతీపురం: గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలలతో పాటు పోస్ట్‌మెట్రిక్ కళాశాలల వసతి గృహాల్లో గ్యాస్ పొయ్యిలతోనే వంటలు చెయ్యాలని ఐటీడీఏ పీవో డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. శుక్రవారం ఐటీడీఏ డీడీ నారాయణుడు, ఏటీడబ్ల్యూవోలు, జీసీసీ డివిజనల్ మేనేజర్ భాస్కరరావు, గ్యాస్ ఏజెన్సీ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ ఇకపై కట్టెలతో వంటలు చెయ్యొద్దని స్పష్టం చేశారు. గ్యాస్ ఏజెన్సీలు తప్పనిసరిగా గ్యాస్ సరఫరా చేయాలని ఆదేశించారు. ఏటీడబ్ల్యూవోలు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం, సాలూరు హెచ్‌పీ గ్యాస్ ప్రతినిధులు పెంటపాటి కిరణ్, కన్నారావు, జీసీసీ సూపరింటెండెంట్ అప్పలస్వామి, పీఎంఆర్‌సీ సుబ్రమణ్యం, ఏటీడబ్ల్యూవోలు శ్రీనివాసరావు, విద్యారాణి, మారుతీబాయ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీవో లక్ష్మీశ

రాయితీపై స్ప్రేయర్ల పంపిణీ

గరుగుబిల్లి: మండలంలో 50 శాతం రాయితీపై రైతులకు చార్జింగ్ స్ప్రేయర్లు పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులకు ఉపయోగపడుతున్న దృష్ట్యా తెప్పించినట్టు ఏఈవో అమరా శివ తెలిపారు. స్ప్రేయర్లు కావలసిన రైతులు ఆధార్, రైతువారీ పాస్ పుస్తకం నఖలు, ఫొటోను తీసుకురావాలన్నారు. రాయితీపై వ్యవసాయ పరికరాలు కావలసిన వారు విధిగా మీసేవలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతులకు గతంలో రాయితీపై అందించిన పరికరాలు వినియోగించుకుంటున్నారా, వేరే వారికి అమ్మకం చేశారన్న దానిపై గ్రామాల్లో పరిశీలన చేస్తున్నామన్నారు.



స్ప్రేయర్లు అందిస్తున్న దృశ్యం



ఒడిశా

కొనసాగుతున్న పెన్‌డౌన్

పర్లాకిమిడి: గజపతి జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘం కలెక్టరేట్ ఎదుటు నిర్వహిస్తున్న పెన్‌డౌన్ సమ్మె శుక్రవారం మూడోరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జుదిష్టర్ రణసింగ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఏడో వేతన కమిషన్ అమలు చేసినా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆరోపించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించే వరకూ ఆందోళన చేస్తామని, మరో రెండురోజులపాటు వేచి చూస్తామని, అప్పటికే అమలు కాకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా మినిస్టీరియల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ ఆత్మహత్య

పర్లాకిమిడి: పర్లాకిమిడిలోని జంగంవీధికి చెందిన ఫొటోగ్రాఫర్ శేఖర్ తన ఇంట్లోనే శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆర్థిక వ్యవహారాలే ఈ ఆత్మహత్యకు కారణమని తెలుస్తోంది. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం అనంతరం బంధువులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

22న సంతాన సాఫల్య పరీక్షలు

పర్లాకిమిడి: పర్లాకిమిడి డాక్టర్ రవినర్సింగ్ హోంలో ఈనెల 22న సంతానం లేని దంపతులకు సంతాన సా ఫల్యం కోసం ఉచితంగా పరీక్షలు నిర్వహించనున్నట్లు డాక్టర్ ఆర్‌ఆర్.రవి తెలిపారు. భువనేశ్వర్‌కు చెందిన సంతాన్ సాఫల్యకేంద్రం సౌజన్యంతో నిర్వహించే కార్యక్రమంలో ప్రముఖ వైద్యురాలు దీపికా పాఢి పాల్గొంటారని పేర్కొన్నారు. సంతానలేమితో ఉండేవారు వారి పేర్లను పర్లాకిమిడిలోని రాజకోట పక్కన గల ఆర్‌ఆర్ రవినర్సింగ్‌హోం లేదా, 06815222819 ఫోన్ నెంబరుకు తెలియజేసి నమోదుచేసుకోవాలని కోరారు. గజపతిజిల్లాతో పాటు ఆంధ్రా ప్రాంతానికి చెందిన పాతపట్నం, మెళియాపుట్టి, హిరమండలం వాసులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మద్యం ఎమ్మార్పీకే విక్రయించండి

పర్లాకిమిడి: గజపతి జిల్లామద్యం దుకాణాల్లో మద్యాన్ని ఎమ్మార్పీకే విక్రయించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గద్దె వెంకటరమణరెడ్డి కోరారు. శుక్రవారం ఆయన విలేఖ రులతో మాట్లాడుతూ అధిక ధరకు అమ్ముతున్నా అధికారులు చర్యలు తీసుకోవడంలే దని ఆరోపించారు. ఈ విషయంపై కలెక్టర్‌కు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. జిల్లా యంత్రాంగం ఎమ్మారీపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఎడతెరపి లేని వర్షాలు

పర్లాకిమిడి: జిల్లాలో శుక్రవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. గురువారం అర్ధరాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఒకటో తేదీ నుంచి ఇప్పటి వరకూ 234.మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, కాశీనగర్ సమితిలో అత్యధిక శాతం వర్షం కురిసింది.

నేతాజీకి నివాళి

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుసాని సమితి కొరసండ పాఠశాలలో నేతాజీ సుభాష్ చందబోస్ వర్ధంతి పాతపట్నానికి చెందిన రామరాజు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్టు నిర్వాహకులు రామరాజు మాట్లాడుతూ నేటియువత సుభాష్‌బోస్ ధీరత్వాన్ని అనుసరించాలన్నారు. నేతాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమాన్ని హెచ్‌ఎం ఎస్‌ఏ.మంగమ్మ పాల్గొన్నారు.

పిడుగులతో భయం..భయం



ఐదు నెలల్లో 280 మంది మృతి

పర్లాకిమిడి: రాష్ట్రంలో ఈ ఏడాది పిడుగులు భయా ందోళనకు గురిచేస్తున్నాయి. పలు జిల్లాల్లో వాతావరణం శాఖ ముందుగానే పిడుగులపై హెచ్చరికలు జారీ చేస్తున్న విషయం విదితమే. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ పిడుగుపడి మృతి చెందిన వారి వివరాలు రాష్ట్ర ప్రత్యేక రిలీఫ్ కమిషన్ కార్యాలయం తాజాగా నివేదిక తయారుచేసింది. ఈ మేరకు ఐదు నెలల్లో 280మంది పిడుగుపాటుకు గురై మరణించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. మృతి చెందిన వారిలో 27 మంది 14ఏళ్లలోపు చిన్నారులు ఉన్నారు. 157 మంది 15-40 ఏళ్లలోపు 72మంది 46-60ఏళ్లలోపు వారు ఉండగా, 61ఏళ్ల పైబడిన వారు 24మంది ఈ పిడుగుపాటుకు దుర్మరణంపాలయ్యారు. మృతిచెందిన వారిలో 70శాతం యువకులే కావడం విశేషం. రాష్ట్రంలో 30 జిల్లాల్లో ఉండగా 27 జిల్లాల్లో పిడుగుపాటు అధికంగా సంభవించినట్లు భువనేశ్వర్ వాతావరణశాఖ సంచాలకుడు శరత్‌చంద్ర 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో జాగ్రత్తలు పాటిస్తే మరణాలు తగ్గించవచ్చని చెప్పారు.

వర్తకుల సంఘ అధ్యక్షుడు దుర్మరణం

రాయగడలో స్వచ్ఛందంగా దుకాణాల మూత

రాయగడ: ప్రముఖవ్యాపారి, రాయగడ వర్తకుల సంఘ అధ్యక్షుడు కొత్తకోట మాధవరావు కుముందాన్ శుక్రవారం లారీ ఢీ కొన్న ఘటనలో దుర్మరణం పాలయ్యాడు. పోలీసుల కథనం మేరకు... ఎప్పటిలా వ్యాపారం నిమిత్తం మాధవరావు రైసు మిల్లుకు స్కూటీపై వెళ్తుండగా మిల్లు సమీపంలో లారీఢీకొంది. దీంతో తలకు తీవ్ర గాయం కావడంతో మాధవరావును హుటాహుటిన జిల్లా కేంద్రాసుపత్రికి తరలించగా అక్కడ మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాయగడలోని వ్యాపారులంతా స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేసి బంద్‌పాటించి సంతాపం తెలిపారు. రాయగడ లారీ యజమానుల సంఘం నాయకులు సరుకుల రవాణా ఎగుమతులు, దిగుమతులు నిలిపివేశారు.మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బంధువులకు అప్పగించారు.వ్యాపారుల సంఘం కార్యదర్శి శిల్లా జగన్నాథం తదితరులు సంతాపం తెలిపారు. స్నేహశీలి, మృధుభాషి, వ్యాపారమెలకువలు తెలియజేసి, పదిమంది పురోభివృద్ధికి తోడ్పడిన మాధవరావుతో విషాధంనెలకొంది.



ఆసుపత్రిలో మాధవరావు మృతదేహం

రాయగడలో డీఎస్‌వో ఆకస్మిక పర్యటన

ట్రాక్ పరిశీలన

రాయగడ: రాయగడలో తూర్పు కోస్తా రైల్వేభద్రతాధికారి(డీఎస్‌వో) ఎ.మహరాణా ఆకస్మికంగా పర్యటించారు. రెండురోజుల కిందట ఇక్కడ గూడ్స్ రైలు పట్టాలు తప్పి ఐదు బోగీలు పాక్షికంగా దెబ్బతిన్న నేపథ్యంలో ఆయన పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఆయన రైల్వేస్టేషన్‌కు ఇరువైపులా అవుటర్‌యార్డు ప్రాంతాల్లో రైలుపట్టాలు, ట్రాక్‌పరిశీలించారు.ఈమార్గంలో గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో రైల్వేశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ సందర్భంగా రైలుపట్టాల క్రాష్‌ఓవర్‌లైన్లు, గూడ్స్ జాయింట్లను పరిశీలించినట్లు అధికారులు తెలిపారు.గతంలో కూడా అవుటర్‌లో పలుసార్లు గూడ్స్‌రైళ్ల పట్టాలు తప్పిన విషయం తెలిసిందే.క్రాషఓవర్‌పాయింట్లు, గ్లూబ్‌జాయింట్లు సక్రమంగా లేక ప్రమాదాలు జరుగుతున్నట్లు రైల్వే వర్గాలు భావిస్తున్నాయి.



జాయింట్లను పరిశీలిస్తున్న మహరాణా, రైల్వే అధికారులు

పీహెచ్‌సీల అప్‌గ్రేడ్ షురూ..!

- 24 గంటలూ వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంగా చర్యలు
- మరణాల రేటు నివారణే లక్ష్యంగా ప్రభుత్వం ముందడుగు

(పార్వతీపురం)

సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ పరిధిలో గల ఎనిమిది సబ్‌ప్లాన్ మండలాల్లో ఉన్న ప్రతీ పీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ప్రస్తుత వర్షా కాలంలో వ్యాధుల నివారణకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటూ గిరిజన ప్రాంతాల్లో వ్యాధులు వల్ల ఎటువంటి మరణాలు జరగకుండా ప్రతి ఒక్కరికీ 24 గంటలూ ప్రభుత్వ వైద్యం అందుబాటులో ఉండాలన్న లక్ష్యంతో ప్రతీ పీహెచ్‌సీ ద్వారా రోగులకు రోజంతా వైద్యం అందించే విధంగా చర్యలు ప్రారంభించింది. ప్రస్తుతం ఐటీడీఏ పరిధిలో గుమ్మలక్ష్మీపురం మండ లంలో రేగిడి, కురుపాం మండలంలో మొం డెంఖల్, జియ్యమ్మవలస మండలంలో జియ్యమ్మవలస, కొమరాడ మండలంలో కేఆర్‌బీపురం, పార్వతీపురం మండలంలో బందలుప్పి, సాలూరు మండలంలో మామి డిపల్లి, పాచిపెంట మండలంలో పాచిపెంట, మక్కువ మండలంలో మక్కువ పీహెచ్‌సీలను 24 గంటల పీహెచ్‌సీలుగా ఉన్నాయి. మొత్తం ఐటీడీఏ పరిధిలో గల 20 పీహెచ్‌సీల్లో ఎనిమిది పీహెచ్‌సీలు 24 గంటలు పీహెచ్‌సీలుగా ప్రస్తుతం ఉన్నాయి. మిగిలిన 12 పీహెచ్‌సీలను 24 గంటలు పీహెచ్‌సీలుగా అప్‌గ్రేడ్ చేస్తూ వాటి ద్వారా గిరిజన గ్రామాల్లో పూర్తిస్థాయిలో వైద్య సేవలను అందించాలన్న లక్ష్యంగా ప్రభుత్వం ముందడుగు వేస్తోంది.

కొండ శిఖర ప్రాంతవాసులకు పూర్తిస్థాయి వైద్యం అందేనా....!

ప్రస్తుతం కొండ శిఖర ప్రాంతాల నుంచి రోగులను కిందకు తీసుకువచ్చేందుకే అత్యధిక సమయం పడుతుంది. ప్రస్తుతం అనేక పీహెచ్‌సీల్లో వైద్యులు మధ్యాహ్నం రెండు గంటలు దాటిన తరువాత కనిపించే పరిస్థితి లేదు. దీనివల్ల కొండ శిఖర ప్రాంతాల నుంచి వైద్యం కోసం వచ్చే గిరిజనులకు వైద్యం పూర్తిస్థాయిలో అందు బాటులో లేకుండాపోతోంది. ఈ సమస్యను సబ్‌ప్లాన్ మండలాల పరిధిలో గల గిరిజనులు ఎదుర్కొంటున్నారు. ఒక్కొక్క సమయంలో వైద్యం అందక ప్రాణాలు పోగొట్టుకుంటున్న పరిస్థితులు ఉన్నాయి. ఈక్రమంలో ఈ పీహెచ్‌సీలను అప్‌గ్రేడ్ చేస్తే గిరిజనుల సమస్య పరిష్కారమవుతుంది.



అప్‌గ్రేడ్ కానున్న తాడికొండ పీహెచ్‌సీ

లక్ష్యం నెరవేరాలంటే..

ప్రభుత్వం 24 గంటలు పీహెచ్‌సీల ద్వారా వైద్యం అందించాలన్న లక్ష్యం పూర్తిస్థాయిలో నెరవేరాలంటే వైద్యులు, వైద్య సిబ్బంది పోస్టులను భర్తీ చేయడంతో పాటు పనిచేసే పీహెచ్‌సీ పరిధిలోనే వైద్యులు, వైద్య సిబ్బంది నివాసం ఉండే విధంగా తగు చర్యలు తీసుకుంటే గిరిజన ప్రాంత ప్రజలకు పూర్తిస్థాయిలో ప్రభుత్వ వైద్యం అందుబాటులోకి వస్తుంది.



మారుమూల గిరిజన ప్రాంతం నుంచి రోగిని మంచంపై తీసుకువస్తున్న దృశ్యం (ఫైల్)

24గంటలు వైద్య సేవలు అందించాలంటే..

పీహెచ్‌సీల ద్వారా 24 గంటలు వైద్య సేవలు అందించాలంటే పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బంది పోస్టులను భర్తీ చేయవలసి ఉంది. ప్రస్తుతం 24 గంటలు పీహెచ్‌సీలుగా నమోదైన బందలుప్పి, తదితర పీహెచ్‌సీల్లో ఒకే ఒక్క వైద్యునితో వైద్య సేవలు అందించవలసిన పరిస్థితి ఉంది. 24 గంటలు పీహెచ్‌సీలుగా పనిచేసే పీహెచ్‌సీల ద్వారా పూర్తిస్థాయిలో వైద్య సేవలందించాలంటే ముగ్గురు వైద్యులు తప్పని సరి. వీరితో పాటు ముగ్గురు స్టాఫునర్సులు ప్రతీ పీహెచ్‌సీకి తప్పనిసరి. ఈ రెండు రకాల కీలక పోస్టులను భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకుంటే గిరిజన ప్రాంతాల ప్రజలకు 24 గంటలు ప్రభుత్వం వైద్యం అందుబాటులో ఉండాలనే సర్కారు లక్ష్యం నెరవేరుతుంది.

ఆశలన్నీ వారిపైనే..!

● తోటపల్లి ప్రాజెక్టుపై నేడు విశాఖలో పార్లమెంటు బృందం సమీక్ష

● కేంద్ర సాయంపై చర్చ



తోటపల్లి ప్రాజెక్టును పరిశీలిస్తున్న సీడబ్ల్యూసీ అధికారులు (ఫైల్)

పార్వతీపురం/గరుగుబిల్లి : తోటపల్లి ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం అందించాల్సిన ఆర్థిక సాయంపై పార్లమెంటు బృందం శనివారం ఆ ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించనుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.177 కోట్లు అందించాల్సి ఉంది. ప్రాజెక్టు నిర్మాణ వ్యయంలో 25 శాతం నిధులు సమకూర్చాల్సి ఉన్నప్పటికీ ఇప్పటివరకు కేవలం రూ.99.73 కోట్లు మాత్రమే అందించింది. 2005-06లో రూ.63.14 కోట్లు, 2007-08లో రూ.24.64 కోట్లు, 2008-09లో రూ.11.95 కోట్లును మంజూరు చేసింది. మిగిలిన సుమారు రూ.78 కోట్లు కేంద్ర ప్రభుత్వం నుంచి అందాల్సి ఉంది. ఈ నిధులను అందించేందుకు అవసరమైన చర్యలు పూర్తిస్థాయిలో కేంద్ర ప్రభుత్వం చేపట్టడం లేదు. మే 23న సీడబ్ల్యూసీ బృందం తోటపల్లి ప్రాజెక్టును పరిశీలించి వెళ్లింది. నిధులు మాత్రం నేటివరకూ మంజూరు కాలేదు. ఈ నేపథ్యంలో పార్లమెంటు బృందం సమీక్ష నిర్వహించనుంది. ఇంతవరకు చేపట్టిన పనులు, సాగునీరందుతున్న ఆయకట్టు వివరాలను పార్లమెంటు బృందానికి వివరించేందుకు తోటపల్లి ప్రాజెక్టు ఇంజినీరింగ్ శాఖ అధికారులు నివేదికలను సిద్ధం చేశారు. వాస్తవంగా కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక సాయం 2010 నుంచి నిలిచిపోయింది. దీంతో ప్రాజెక్టు పూర్తికి నిధులు కొరత తప్పలేదు. దీనికి తోడు జీఎస్టీ ప్రభావం కూడా తోటపల్లి పెండింగ్ పనులపై పడింది. గతంలో 5 శాతం పన్నును చెల్లించగా, ప్రస్తుతం 18 శాతం చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల ప్రాజెక్టుల నిర్మాణాలపై జీఎస్టీ భారాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాల్లో భాగంగా 12 శాతానికి జీఎస్టీ పన్నును తగ్గించినట్టు సమాచారం. ఏదిఏమైనా పూర్తిస్థాయిలో తోటపల్లి ప్రాజెక్టు ద్వారా కొత్త ఆయకట్టు 1.24 లక్షల ఎకరాలకు సాగునీరందించాలంటే పెండింగ్ పనులను పూర్తి చేయాల్సి ఉంది. ఈ పనుల పూర్తి, భూసేకరణ, పెండింగ్ పనుల కోసం సుమారు రూ.100 కోట్లు అవసరం కానున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర బకాయి రూ.77 కోట్లు నిధులు మంజూరయ్యేలా పార్లమెంటు బృందం చర్యలు తీసుకుంటే ఈ ఏడాది పనులు పూర్తిస్థాయిలో పూర్తయ్యే అవకాశం ఏర్పడుతుంది.

మీతో మీ ఎస్పీకి విశేష స్పందన

● ఫిర్యాదులపై తక్షణమే స్పందించండి

● పోలీసు అధికారులకు ఎస్పీ పాలరాజు ఆదేశం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ పాలరాజు

విజయనగరం క్రైం : జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ జి.పాలరాజు నిర్వహించిన మీతో మీ ఎస్పీ ఫోన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. 9 ఫిర్యాదులు స్వీకరించారు.

● విజయనగరంలోని ప్రదీప్‌నగర్‌కు చెందిన నారాయణ.. గంట స్తంభం, కోట జంక్షన్‌లో రోడ్డు మీదనే కూరగాయల వ్యాపారాలు నిర్వహిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారని, తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

● లారీ మాయంపై పోలీసులు కేసు నమోదు చేసినా ఇంతవరకు ఆచూకీ లభించలేదని, త్వరితగతిన కేసును పరిష్కరించాలని పార్వతీపురానికి చెందిన కోరారు.

● ఒడిశా రాష్ట్ర జబల్‌పూర్ నుంచి ఆదినారాయణ .. తన కుమారుని ఉద్యోగ విషయమై జాబ్ వెరిఫికేషన్ రిపోర్టు ఇంకను సంబంధిత కార్యాలయం నుంచి రాలేదని ఫిర్యాదు చేశారు.

● పార్వతీపురానికి చెందిన కోటిపల్లి ఈశ్వరరావు.. ఎలక్ట్రికల్ ప్రమాదంలో తనకు గాయాలయ్యాయని, పోలీసులు కేసు నమోదు చేశారని, బీమా ఇప్పించాలని కోరారు.

● విజయనగరానికి చెందిన శ్రీనివాస్ తన కుటుంబసభ్యులకు మాగ్మా ఫైనాన్స్ కంపెనీలో నుంచి ఓ వ్యక్తి ఫోన్ చేశారని ఫిర్యాదు చేశారు.

● విజయనగరానికి చెందిన కెనడీ పండ్ల వ్యాపారులు మెయిన్ రోడ్డు మీదనే వ్యాపారం నిర్వహిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారని చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

● విజయనగరానికి చెందిన గీత ఫోన్ చేస్తూ తన దగ్గరి బంధువులకు రూ.7.5 లక్షలు అప్పుగా ఇచ్చానని, వారు అప్పు తీర్చకపోవడంతో కోర్టును ఆశ్రయించానని, కోర్టులో వారు రూ.4లక్షలను వేరుగా, కోర్టు ద్వారా రూ2.50 లక్షలు ఇచ్చేందుకు అంగీకరించారని, కానీ నేటివరకు ఎటువంటి నగదు చెల్లించలేదని ఫిర్యాదు చేశారు.

● ఫిర్యాదులను స్వీకరించిన ఎస్పీ.. వీటిని తక్షణమే పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. తీసుకున్న చర్యలను నివేదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ పీఆర్‌వో పీఎస్ఎస్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల కమిషన్

చైర్‌పర్సన్‌గా హైమావతి



● 15ఏళ్లుగా బాలలు, మహిళల సేవలో నిమగ్నం

● హెచ్ఐవీ బాధిత కుటుంబాలకు అండాదండ

● బాలలపై లైంగికదాడులు అరికట్టడమే ధ్యేయంగా పనిచేస్తా: హైమావతి

(విజయనగరం, ఆంధ్రజ్యోతి)

విజయనగరం జిల్లా మహిళకు అరుదైన గౌరవం లభించింది. 15ఏళ్లుగా అనాథ పిల్లల సంరక్షణ, ఆరోగ్య పరిరక్షణ, హెచ్ఐవీ బాధిత కుటుంబాల్లో పిల్లలకు అండదండలందిస్తోన్న మహిళకు గుర్తింపు లభించింది. రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్‌గా సాలూరుకు చెందిన గంటా హైమావతిని ప్రభుత్వం నియమించింది. ఈమేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. మూడేళ్ల కిందట రాష్ట్రంలో ఈ కమిషన్ ఏర్పాటైంది. మూడేళ్లకోసారి కమిషన్ కొత్త పాలకవర్గాన్ని ప్రభుత్వం నియమిస్తుంది. అందులోభాగంగా ఈసారి హైమావతిని చైర్‌పర్సన్‌గా నియమించింది. ఆమెతో పాటు మరో ఆరుగురిని సభ్యులుగా నియమించింది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన పీవీవీ ప్రసాద్, విజయనగరానికి చెందిన కేసలి అప్పారావు సభ్యులుగా నియమితులయ్యారు. విజయవాడ, తూర్పుగోదావరి, కర్నూలు, గుంటూరు జిల్లాలకు చెందిన వారు సభ్యులుగా నియమితులయ్యారు. రాష్ట్రంలో బాలల హక్కులను పరిరక్షించడం, వారిపై దాడులను అరికట్టడం, లైంగిక వేధింపుల నివారణ, నిందితులపై చర్యలు తీసుకునేలా పోలీస్,స్త్రీశిశు సంక్షేమ శాఖలతో సమన్వయం చేసుకుంటూ వీరు పనిచేయాల్సి ఉంటుంది. మూడేళ్ల పాటు ఈ కమిషన్‌కు అధికారాలు ఉంటాయి. రాష్ట్ర రాజధాని కేంద్రంగా ఇది పని చేయాల్సి ఉంటుంది. ఈ కమిషన్‌కు చైర్మన్‌గా ఎవరిని నియమించాలనే విషయమై రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రితోపాటు ఆశాఖ ఉన్నతాధికారులు గత నెలలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. సుమారు 30 మంది వివిధ సామాజిక సంఘాల తరపున, పలువురు అధికారులు దరఖాస్తు చేసుకున్నారు. చివరిగా చైర్‌పర్సన్ పదవి హైమావతిని వరించడం విశేషం. ఇదే విషయమై ఆమెతో 'ఆంధ్రజ్యోతి' మాట్లాడగా.. చైర్‌పర్సన్‌గా ప్రభుత్వం తనను నియమించిన అంశాన్ని నమ్మలేకపోతున్నానన్నారు. 15ఏళ్లుగా విజయనగరం కేంద్రంగా నేచర్ ఆర్గనైజేషన్‌లో పనిచేస్తున్నానని వివరించారు. అనాథ పిల్లలు, రోడ్లపై తిరిగే పిల్లలను చేరదీసి వారికి విద్య, వైద్య సదుపాయం కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. అందుకే ఈ అవకాశం తనకు దక్కిందని పేర్కొన్నారు. 2011 నుంచి ఇప్పటి వరకు పిల్లల సంరక్షణ కమిషన్‌లో సభ్యురాలిగా రెండుసార్లు పనిచేశానని తెలిపారు. చైల్డ్‌లైన్‌లో పీడీగా పనిచేశానన్నారు. పసి పిల్లల అక్రమ రవాణా నిరోధం, వారికి పౌష్టికాహారం అందించే విషయంలో నేచర్ సంస్థ ద్వారా ఎన్నో కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. మహిళలకు వివిధ అంశాలపై వందలాది శిక్షణలు ఇచ్చామని వివరించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల్లో 5వేల హెచ్ఐవీ బాధిత కుటుంబాలకు అండగా నిలిచి సేవలు అందించామని చెప్పారు. హెచ్ఐవీ బాధిత కుటుంబాల పిల్లలకు తాను వివిధ హోదాల్లో సేవలందిచడమే చైర్‌పర్సన్‌గా ఎంపికవడానికి ప్రధాన కారణంగా భావిస్తున్నట్టు తెలిపారు. బాలలపై లైంగిక దాడులను అరికట్టడమే తన ధ్యేయమని చెప్పారు.

న్యాయం జరిగే వరకు పోరాటం

● అగ్రిగోల్డ్ బాధితుల సంఘం గౌరవాధ్యక్షుడు ముప్పాల



బొబ్బిలిలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు

బొబ్బిలి/గజపతినగరం రూరల్: అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం న్యాయం చేసే వరకు పోరాడతామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, అగ్రిగోల్డ్ బాధితుల రాష్ట్ర అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముప్పాల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన బొబ్బిలి, గజపతినగరంలో పర్యటించారు. ఈ సందర్భంగా బొబ్బిలి తాండ్రపాపారాయ బొమ్మ సెంటర్‌లో బస్సు యాత్రలో ప్రసంగించారు. అగ్రిగోల్డ్ బాధితులు అనేక ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించలేదన్నారు. పేదవాడి డబ్బులు దోచుకున్న అగ్రిగోల్డ్ సంస్థకు అధికార, ప్రతిపక్షాలు కుడి, ఎడమ భుజాలుగా ఉన్నాయని ఆరోపించారు. బొబ్బిలి నియోజకవర్గంలో 10 వేల మంది అగ్రిగోల్డ్ బాధితులు ఉంటే మంత్రి రంగారావు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా టీడీపీ, వైసీపీ ప్రజా ప్రతినిధులు అగ్రిగోల్డ్ బాధితుల పక్షాన నిలవాలని హితవు పలికారు. లేదంటే రానున్న ఎన్నికల్లో పతనం తప్పదని హెచ్చరించారు. అగ్రిగోల్డ్ బాధితులకు చివరి రూపాయి అందేవరకు సీపీఐ ఉద్యమిస్తుందని తెలిపారు. అంతకుముందు కళా బృందాలు ప్రదర్శనలు నిర్వహించాయి.

గజపతినగరం నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా 143 మంది అగ్రిగోల్డ్ బాధితులు మృతిచెందారని తెలిపారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. లేకుంటే వచ్చేనెల 18 నుంచి జాతీయ రహదారులపై వంటా-వార్పు నిర్వహించనున్నామని హెచ్చరించారు. ప్రభుత్వం ఇచ్చిన ఐదు హామీలను తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అగ్రిగోల్డ్ బాధితుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విశ్వేంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ వీవీ నారాయణరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి కామేశ్వరరావు, లోక్‌సత్తా రాష్ట్ర నేత ఆకుల దామోదరరావు పాల్గొన్నారు.

రూ.7600 కోట్లు వెంటనే చెల్లించాలి



పార్వతీపురంలో అగ్రిగోల్డ్ బాధితుల చైతన్య యాత్ర

పార్వతీపురం టౌన్ : అగ్రిగోల్డ్ బాధితులకు రూ.7600 కోట్లు వెంటనే చెల్లించాలని ఆ సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం పార్వతీపురంలో అగ్రిగోల్డ్ బాధితుల చైతన్యయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కూడలి వద్ద బహిరంగ సభ నిర్వహించారు. సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ మృతి చెందిన అగ్రిగోల్డ్ బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. అగ్రిగోల్డ్ యాజమాన్య కుటుంబ సభ్యులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ప్రాణాలర్పించైనా బాధితులకు అండగా ఉంటామని అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.కామేశ్వరరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల గూర్చి ఈ ప్రాంత శాసనసభ్యులు అసెంబ్లీలో ప్రస్తావించలేదని ఆరోపించారు. అనంతరం బాధితులకు మద్దతు తెలుపుతూ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. సమావేశంలో ఈవీనాయుడు, ఆర్‌వీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ పాఠశాలలో ఉన్న మ్యూజియం



విజ్ఞానం దూరం!


విజ్ఞానం, వినోదం అందించేందుకు దాదాపు పన్నెండేళ్ల కిందట ఏర్పాటు చేసిన సైన్స్ మ్యూజియం నిరాదరణకు గురవ్వడంతో శిథిలావస్థకు చేరింది. స్థల మార్పుతోనే ఈ మ్యూజియంకు కష్టాలు మొదలయ్యాయి. మహారాజా కోటలో ఉన్నప్పుడు రోజూ పదుల సంఖ్యలో విద్యార్థులతోపాటు సందర్శకులు వచ్చి ఇక్కడ ఏర్పాటు చేసిన జంతు నమూనాలు, గ్లోబు, మానవశరీర అవయవ నిర్మాణాలను ఆసక్తిగా పరిశీలించేవారు. ప్రస్తుతం ఈ మ్యూజియంను పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీ మున్సిపల్ పాఠశాలలో నిర్వహిస్తున్నారు. ఇక్కడ తగినంత స్థలం లేకపోవడంతో కొన్ని పరికరాలు ఆరుబయటే ఉండిపోయాయి. దీంతో ఎండకు ఎండుతూ వానకు తడుస్తున్నాయి. సంరక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. ఎంతో ఆశయంతో పెట్టిన ఈ మ్యూజియం ఇప్పుడు విజ్ఞానానికి దూరమైంది...

● దయనీయంగా సైన్స్ మ్యూజియం
● మూలకు చేరిన పరికరాలు
● శిథిలమవుతున్న నమూనాలు
● నిత్యమూ తెరవడం కష్టమే...
● స్థల మార్పుతో తగ్గిన సందర్శకులు

(కలెక్టరేట్)

సైన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన మ్యూజియం మూలకుచేరింది. ఇక్కడకు విద్యార్థుల సందర్శన కూడా లేదు. చివరికి ఎంతోవిలువైన సైన్స్ పరికరాలు శిథిలమవుతున్నాయి. 2005లో అప్పటి కలెక్టర్ రజిత్‌కుమార్ సహకారంతో జిల్లా కేంద్రంలోని మహారాజా కోటలో ఈ మ్యూజియంను ఏర్పాటు చేశారు. ఇందులో వివిధ రకరకాలు బొమ్మలు, జంతువుల చిత్రపటాలు, గ్లోబ్, డైనోసార్, పురాతన ఏనుగు బొమ్మలు తదితర సైన్స్ పరికరాలు ఏర్పాటు చేశారు. వీటిపై చూసేందుకు జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు చూసేందుకు వచ్చేవారు. కోటను చూసేందుకు వచ్చే సందర్శకులు మ్యూజియం పరిశీలించే వారు. ప్రతిరోజూ విద్యార్థులు కూడా వచ్చేవారు. మ్యూజియంను చూసుకునే బాధ్యత అప్పట్లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసిన సుందరి అనే ఉపాధ్యాయురాలకు అప్పగించారు. పరికరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేవారు. అక్కడ పెట్టిన డే రిజిస్ట్రర్‌లో వచ్చే సందర్శకులు సంతకాలు పెట్టేవారు. రోజుకు 25 నుంచి 30మంది చొప్పున సందర్శకులు వచ్చేవారు. అంతేకాకుండా ఏటా పట్టణంలో జరిగే పైడితల్లమ్మ పండగకు వచ్చే భక్తులు, సందర్శకులు మ్యూజియంను తిలకించేవారు. ఇంతవరకూ బాగానే ఉంది. కోటలో మరమ్మతులు పనులు చేస్తామని మాన్సాస్ సభ్యులు, విద్యాశాఖ అధికారులకు సూచించారు. కోటలో ఉన్న మ్యూజియంను వేరేచోటకి మార్పు చేయాలని చెప్పారు. దీంతో ఇక్కడి నుంచి ఈ పరికరాలన్నీ ఐదు నెలల కిందట పట్టణంలోని గల రాజీవ్‌నగర్ కాలనీ మున్సిపల్ పాఠశాలలోని ఒక గదిలో పెట్టారు. లక్షలు విలువ చేసే ఈ పరికలు ఒక మూలగదిలో పెట్టారు. దీంతో ఇక్కడ ఈ మ్యూజియం ఉన్నట్టు చాలామంది విద్యార్థులకు తెలియదు. దీంతో సందర్శకులు రావడం గగనంగా మారిపోయింది. గది కూడా చిన్నది కావడంతో వీటి సంరక్షణ కష్టంగా మారింది. ఇప్పటికే డైనోసార్, గ్లోబ్ వంటి పరికరాలు శిథిలావస్థకు చేరాయి. ఇదే కాకుండా ప్రతి రోజూ ఈ మ్యూజియం తెరవడం లేదన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. మ్యూజియంను చూసే ఉపాధ్యాయురాలు ప్రతి రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఇక్కడికి వచ్చే సందర్శకులకు ఈ పరికరాలపై అవగాహన కల్పించాల్సి ఉంది. ఇక్కడ ఉండే ఉపాధ్యాయరాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.





సందర్శకులు తగ్గారు..

ఈ మ్యూజియం రాజీవ్‌నగర్ మున్సిపల్ పాఠశాలకు మార్చడంతో సందర్శకుల సంఖ్య చాలావరకు తగ్గింది. విశాలమైన భవనం లేకపోవడంతో పరికరాలను సంరక్షించడం కష్టంగా ఉంది. ఇక్కడికి మ్యూజియం మార్చినట్టు చాలామందికి తెలియకపోవడంతో విద్యార్థులు కూడా ఎక్కువగా రావడం లేదు. దీనిపై కరపత్రాలు ముద్రించి ప్రచారం చేస్తాం. గ్లోబును రిపేరు చేస్తాం.

- ఎంవీ సుందరి, సైన్సు మ్యూజియం నిర్వహకురాలు



వరండాలోనే చదువులు..

పాఠశాల భవనంలో పరికరాలు పెట్టడంతో ఇక్కడ చదువుకుంటున్న విద్యార్థులకు వసతి సమస్య ఏర్పడింది. దీంతో కొంతమంది విద్యార్థులు వరండాలో చదువుకునే పరిస్థితి నెలకొంది. గదులు చాలకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే జిల్లాలో సైన్సు మ్యూజియం ఉన్న సంగతి విద్యార్థులు మరిచిపోయే పరిస్థితి వస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సందర్శకులకు అనువగా ఉండే ప్రాంతంలో ఈ మ్యూజియం ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



రోజూ తెరవాల్సిందే...

సైన్స్ మ్యూజియంను నిత్యం తెరవాల్సిన బాధ్యత నిర్వాకురాలిపై ఉంది. కోట నుంచి ఖాళీ చేసిన తర్వాత ఈ మ్యూజియం ఏర్పాటు చేసేందుకు సరైన ప్రదేశం దొరకలేదు. దీంతో తప్పని పరిస్థితిలో రాజీవ్‌నగర్ కాలనీకు మార్చాం. సెలవు రోజుల్లో తప్ప మ్యూజియం తెరవాల్సిందే. పరికారాల సంరక్షణ బాధ్యత కూడా నిర్వాహకులదే. లేకుంటే చర్యలు తీసుకుంటాం.

- అరుణకుమారి, జిల్లా విద్యాశాఖాధికారి



వరినారు ముదిరిందా... ఇలా నాటేద్దాం!

సీతానగరం : ఈ ఏడాది ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు వల్ల సకాలంలో రైతులు వరినాట్లు వేసుకోలేకపోయారు. దీంతో నారు పోసి దాదాపు 50 రోజులు దాటిపోతోంది. అయినా రైతుల్లో ఎక్కడో చిన్న ఆశ.. వరుణుడు కరించకపోతాడా అని. నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో నాట్లు వేసేందుకు రైతులు సిద్ధపడుతున్నారు. ఈ నేపథ్యంలో ముదిరిన నారుతో నాట్లు వేయడంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వ్యవసాయాధికారి ఎం.ఉమామహేశ్వరనాయుడు సూచనలు ఇలా...

● పైపైన నాట్లు వేసుకోవాలి. దీంతో పిలకలు కొత్తగా వస్తాయి. ● వరినారు ఆరేడు మొనలు చొప్పున ఉండేలా నాటుకోవాలి. ● ముదురు నారు నాట్లు వేసేటప్పుడు మోతాదు కంటే 25శాతం ఎరువు పెంచాలి. ● ఆఖరి దమ్ములో 75కిలోల డీఏపీ/కాప్లెక్స్ ఎరువు వేసుకోవాలి. ● 20 నుంచి 25 రోజులకు 20 కిలోల యూరియా వేయాలి. 45 రోజులకు మరోసారి అదే మోతాదులో యూరియా వేయాలి. దీనివల్ల పిలకలు పెట్టే సామర్థ్యం పెరుగుతోంది. ● నాట్లు వేసిన రెండు రోజుల తర్వాత నీరు పెట్టాలి. ● భాస్వరంతో జింక్ సల్ఫేట్ కలిపి వేయకూడదు. కనీసం మూడు రోజుల వ్యవధి ఉండాలి.

కష్టానికి 'ఆ'వల'



ప్రతి జ్ఞాపకం... 'చిత్రం'గా పదిలం


నేడు ఫొటోగ్రఫీ దినోత్సవం




నడకలో నాకు సాటెవరు?

ఆకు కదిలితే చిత్రం..చినుకు నవ్వితే చిత్రం...ప్రకృతి పరవశింపజేస్తే చిత్రం. వంద మాటలు చెప్పలేని భావాన్ని ఒక్క చిత్రం చెబుతుందంటారు. కళ్లకే కాదు...మనసుకూ ఆనందాన్నివ్వగలిగేది... ఎలాంటి హృదయాన్నైనా కదిలింపజేసేది ఫొటో మాత్రమే. కాలంతో పాటు ఫొటోగ్రఫీలోనూ ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. సాంకేతికత కొత్త బాటలు పరిచింది. రీళ్ల స్థానంలో చిప్‌లు వచ్చాయి. సెల్‌ఫోన్లు వచ్చాక ఫొటోగ్రఫీ స్వరూపమే మారిపోయింది. అయినా ఫొటోల స్థానం మాత్రం చెక్కుచెదరనిది. ఇప్పుడు ప్రతి జ్ఞాపకమూ చిత్రంగా మిగులుతోంది.

- విజయనగరం



వన్నెల గోపురం



అందం.. మకరందం



నీటి మెరుపులు



శ్రమైక జీవనయానం

అతిక్రమణకు తప్పదు భారీ మూల్యం..



● మద్యంతాగి వాహనం నడిపితే జైలుశిక్ష
● చోదకులతో పాటు యజమానిపైనా...
● లైసెన్స్ లేకుండా బండి నడిపితే కటకటాలే...
● ప్రత్యేక చట్టానికి కేంద్రం యోచన



(మెంటాడ)

● ఈ ఏడాది జూలై 25న గజపతినగరం నుంచి జీటీపేట వెళ్తున్న బాకారపు కృష్ణ అనే ఆటోడ్రైవర్ మద్యం మత్తులో అతివేగంతో వాహనాన్ని నడిపాడు. మెంటాడ చర్చి వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనదారుడు సత్యంను ఢీకొట్టాడు. దీంతో సత్యం కాలు విరిగిపోయింది. ఆటో డ్రైవర్ కృష్ణను పోలీసులు అరెస్టు చేశారు.

● ఈ ఏడాది ఆగస్టు 12న మెంటాడ గ్రామానికి చెందిన ఆదిరెడ్డి వెంకటరమణ మద్యం తాగి ద్విచక్ర వాహనం నడుపుతుండగా ఆంధ్ర ఎస్ఐ ఐ.భాస్కరరావు తనిఖీలు చేస్తుండగా పట్టుబడ్డాడు. దీంతో అతడిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదైంది.

ఇలా ఎంతోమంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. దీంతో వారి కుటుంబాలను చీకట్లోకి నెట్టేస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం కూడా ఇటువంటి ప్రమాదాలపై ప్రత్యేక దృష్టిసారించాలని సంబంధిత అధికారులను అప్రమత్తం చేసింది. ఇందులో భాగంగా ఏటా రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్య పరుస్తోంది. అయినా ప్రమాదాలు తగ్గక పోవడం ప్రభుత్వాన్ని కలవర పెడుతోంది. ప్రధానంగా మద్యం తాగి వాహనాలు నడపడం ప్రధాన కారణంగా భావించిన ప్రభుత్వం మద్యం షాపుల ఏర్పాటులో కఠిన నిర్ణయాలకు సైతం వెనుకాడలేదు. అయినప్పటికీ ప్రమాదాలు 18 ఏళ్లు నిండని పిల్లలు లైసెన్స్‌లు లేకపోవడం, ట్రాఫిక్ నిబంధనలు తెలియకపోవడం, వాహనం నడపడం సక్రమంగా రాకపోవడం తదితర కారణాలతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆయా ప్రమాదాలకు బీమా సైతం వర్తించని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ప్రమాదాలను నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాయి. లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడపడం, 18 ఏళ్ల లోపువారు వాహనాలు నడపడంపై కఠిన చర్యలు తీసుకునేందుకు కేంద్రం ప్రభుత్వం చట్టం రూపొందిస్తుంది.

జల్సా చేస్తే జరిమానా...

మా బాబు బండి డ్రైవింగ్ బాగా చేస్తాడు. గారాబంగా పెంచాం సరదా పడుతున్నాడు మా బండి మా పిల్లాడికి ఇచ్చుకుంటే తప్పేంటి అని ప్రశ్నించే తల్లితండ్రుల మాటలు ఇక చెల్లవు. 18 ఏళ్లు నిండిన వారికి వాహనాలు ఇచ్చే వారికి కూడా అపరాధ రుసుం విధించడంతోపాటు జైలుకు పంపించనున్నారు. లైసెన్స్ లేకుండా బండి ఉంది కదా అని జల్సా చేస్తామంటే భారీగానే జరిమానా పడునుంది. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపేవారిని ప్రస్తుతం కోర్టులో హాజరుపరుస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టం అమలులోకి వస్తే 18 ఏళ్లు నిండకుండా వాహనాలు నడిపేవారిపై ప్రత్యేక చర్యలు అమలులోకి రానున్నాయి. బిడ్డల తల్లితండ్రులపై చట్టం ప్రభావం పడనుంది.

మత్తు దింపేస్తారు..

జిల్లాలో 2లక్షల99 వేల వాహనాలు ఉన్నాయి. 2 లక్షల 33 వేలు ద్విచక్ర వాహనాలు, సుమారు 13వేల కార్లు, దాదాపు 49వేల ఆటోలు, వ్యాన్లు, ఇతర వాహనాలు ఉన్నాయి. ప్రధానంగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉన్నట్టు అధికారులు గుర్తించారు. కొత్తనిబంధనల ప్రకారం మద్యం తాగి వాహనాలు నడిపితే కోర్టులో హాజరుపరుస్తారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా అధిక లోడ్లతో పట్టుబడినవారిపై ఎక్కువగా కేసులు నమోదయ్యాయి.

పరిమితి మించితే పట్టేస్తారు

వాహనాలు నడపగల సామర్థ్యం ఉందని సరుకు రవాణా వాహనాలు గాని, ప్రయాణికుల్ని తీసుకవెళ్లే వాహనాలు గాని పరిమితికి మించి తీసుకువెళ్తే కఠిన చర్యలు తప్పవు. ఆటోలు మొదలుకుని బస్‌లు, లారీలు ఏ వాహనమైనా పరిమితికి మించి వెళ్తే డ్రైవింగ్ లైసెన్స్, మూడు నెలలపాటు సస్పెండ్ చేస్తారు. ఇంత వరకు అధిక లోడుతో వెళ్తుంటే అపరాధ రుసుం విధించి వదిలేసేవారు. ఇక ఆరోలు పోనున్నాయి. మరోవైపు జిల్లాలో వేలాదిగా ఉన్న ఆటోలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పరిమితికి మించి వెళ్తున్న ఆటోలు ప్రమాదాలకు గురవుతుండడంతో ప్రత్యేకచర్యలు చేపడుతున్నారు.




ట్రాక్టర్ నడుపుతున్న బాలుడు

కఠిన చర్యలు తప్పవు

రోడ్డు ప్రమాదాలపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాము. హెల్మెట్ సీటు బెల్టు లు తప్పనిసరి చేశాం. ఇక నుంచి మైనర్లు వాహనాలు నడిపినా చోదకులతో పాటు యజమానికి జైల్ శిక్ష తప్పదు. తాగి వాహనం నడిపినా అదే పరిస్థితి. అధిక లోడుతో ప్రయాణిస్తే లైసెన్స్ మూడు నెలలు సస్పెండ్ చేస్తాం. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకచట్టం చేస్తుంది.

- ఎంవీ గంగాధర్, మోటారు, వెహికల్ ఇన్‌స్పెక్టర్



పశువుల అక్రమ రవాణాకు... చెక్!

● కదిలిన జిల్లా యంత్రాంగం
● జంతు సంక్షేమ కమిటీ ఏర్పాటు
● రూ.50 లక్షలతో గోశాల నిర్మాణం: కలెక్టర్ వివేక్‌యాదవ్



విజయనగరం(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా నుంచి సరిహద్దు జిల్లాలకు, పక్క రాష్ట్రాలకు పశువుల అక్రమ రవాణా నిరోధించడానికి జిల్లా అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టింది. జంతు హింస నివారణ చట్టం 1960ను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడానికి శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ వివేక్‌యాదవ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. తొలుత జంతు సంక్షేమ కమిటీని ఏర్పాటు చేసి పలు తీర్మానాలు చేశారు. జంతు సంక్షేమ కమిటీ చైర్మన్‌గా కలెక్టర్, ఉపాధ్యక్షులుగా జడ్పీ సీఈవో,



ఎస్పీలు, అనధికార అధ్యక్షుడిగా లయన్స్ రోటరీ క్లబ్ సభ్యులు, గౌరవ కార్యదర్శిగా పశుసంవర్థక శాఖ సంయుక్త సంచాలకుడు, కార్యనిర్వాహక కార్యదర్శిగా జంతు సంక్షేమ సంఘం సభ్యుడు వ్యవహరిస్తారు. జిల్లా అటవీశాఖాధికారి, రవాణాశాఖాధికారి, వాణిజ్య పన్నుల శాఖాధికారి, మార్కెటింగ్ సహాయ సంచాలకుడు, కేంద్ర జంతు సంఘం సభ్యుడు, జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్, జిల్లా పౌర సంబంధాల అధికారి, జిల్లా విద్యాశాఖాధికారి తదితరులు సభ్యులుగా కమిటీలో ఉంటారు.

కమిటీ ఆమోదించిన తీర్మానాలు

విజయనగరం జిల్లాలో పశువుల సంతల నుంచి ఇతర జిల్లాలకు పశువుల అక్రమ రవాణా అరికట్టడం, సంతలలో మౌలిక సదుపాయాల ఏర్పాటు, జిల్లా సరిహద్దు రాష్ట్రాల నుంచి పశువధ నిమిత్తం రవాణా చేయకుండా నిరోధించడం, మున్సిపల్ పరిధిలో విచ్చలవిడిగా పందులు సంచరించకుండా అరికట్టడం, అనుమతుల్లేకుండా ఏర్పాటు చేసిన పశువధ శాలల నిర్వాహకులపై చర్యలు, వీధి కుక్కలకు సంతాన వ్యాప్తి చెంద కుండా కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయడం తదితర అంశాలపై తీర్మానాలు చేశారు.

రూ.50లక్షల వ్యయంతో గోశాల



నెల్లిమర్ల మండలంలోని కొండవెలగాడ గ్రామం వద్ద కేటాయించిన మూడు ఎకరాల స్థలంలో రూ.50లక్షలు ఉపాధి నిధులతో 100 పశువుల సంరక్షణ నిమిత్తం గోశాల ఏర్పాటు చేయనున్నామని కలెక్టర్ వివేక్‌యాదవ్ అన్నారు. గోశాల నిర్మాణం పూర్తయ్యే వరకూ వీటీ అగ్రహారంలోని పశుసంవర్థక సముదాయంలో 20 పశువులకు వసతి ఏర్పాటు చేశామన్నారు. 2015-16 ఆర్థిక సంవత్సరంలో పెదమానాపురం, అలమండ, పశువుల సంత నుంచి పశువులకు అక్రమంగా తరలిస్తున్న వారిపై 1615 కేసులు నమోదు చేసి రూ.33.59 లక్షలు కాంపౌండ్ ఫీజు కింద ప్రభుత్వానికి జమ చేశామని తెలిపారు. 2016-17లో 1061 కేసులు నమోదు చేసి రూ 21.80 లక్షలు అపరాధ రుసుం విధిస్తామన్నారు. విజయనగరం పట్టణంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న 500 పందులను పట్టణానికి 15 కిలోమీటర్ల దూరంలో విడిచిపెట్టడంతో పాటు పందుల పెంపకందారులకు నోటీసులు జారీ చేశామని తెలిపారు. అలమండ, పెదమానాపురం వారపు సంతల్లో పశువుల అక్రమ రవాణా అడ్డుకట్ట వేయడంతో పాటు పశువులకు నీడ, తాగునీటి, సదుపాయాలు కల్పించామని చెప్పారు. సాలూరు పట్టణంలో 60 కుక్కలకు, విజయనగరంలో 972 కుక్కలకు, బ్లూక్రాస్ సొసైటీ ద్వారా 100 కుక్కలకు శస్త్రచికిత్సలు చేయించామని పశుసంవర్థక శాఖ సంయుక్త సంచాలకుడు డాక్టర్ సింహాచలం తెలిపారు.

'ఏడాదికో దూడ'తో పశు సంతతి వృద్ధి

● పశు సంవర్థక శాఖ సంయుక్త సంచాలకుడు సింహాచలం

రింగురోడ్డు: జిల్లాలో పశుసంవర్థకశాఖ ద్వారా రెండంకెల వృద్ధి శాతంలో భాగంగా మార్కెట్ కమిటీల ఆర్థికసాయంతో మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఏడాదికో దూడ కార్యక్రమాన్ని చేపడుతున్నామని పశుసంవర్థక శాఖ సంయుక్త సంచాలకుడు డాక్టర్ ఎం.సింహాచలం తెలిపారు. శుక్రవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఆదివారం రాకోడు గ్రామంలో ఈ కార్యక్రమాన్ని కేంద్రమంత్రి అశోక్‌గజపతిరాజు ప్రారంభిస్తారన్నారు. జిల్లాలో 2.61 లక్షల కుటుంబాలు వ్యవసాయ, అనుబంధ రంగాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. జిల్లాలో 2.70 లక్షల పశువుల ద్వారా ఏడాదికి సుమారు 5.94లక్షల టన్నుల పాలు ఉత్పత్తి అవుతున్నాయన్నారు. పాడి పశువుల్లో ఈతల మధ్యకాలం ఎక్కువగా ఉండడం వల్ల రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ఈతల మధ్య కాలాన్ని తగ్గించి రైతులకు ఆదాయం పెంచేలా వినూత్న కార్యక్రమం చేపడుతున్నామని చెప్పారు. మేలు జాతి దూడలు ఉత్పత్తి చేసేలా పశుపెంపకందారులకు అవగాహన కల్పిస్తామన్నారు. పశువుల సంఖ్య పెంచేందుకు ఏం చేయాలన్న దానిపై సర్వే చేస్తున్నామన్నారు. పునరుత్పత్తి సమస్యలు ఉన్న పశువుల జాబితా, అక్కడి రైతుల అవలంబిస్తున్న లోపాలు గుర్తించి రైతులకు వివరిస్తామన్నారు. పశుగ్రాస పెంపకం, గడ్డి కత్తిరించే యంత్రాలు, పాలుపితికే యంత్రాలను రైతులకు అందజేస్తామని తెలిపారు.

తల్లిపాలలోనే వ్యాధి నిరోధక శక్తి

● ప్రసవమైన గంటలోపే శిశువుకు పాలివ్వాలి
● ఐసీడీఎస్ జేపీసీ శ్యామసుందరి

విజయనగరం రూరల్:మాతాశిశు మరణాలు తగ్గించేలా చూడాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉందని, తల్లిపాలలోనే వ్యాధి నిరోధక శక్తి ఉంటుందన్న విషయం బాలింతలకు వివరించాలని స్త్రీశిశుసంక్షేమశాఖ రాష్ట్ర జాయింట్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ శ్యామసుందరి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని వి.టి.అగ్రహారం బీసీ కాలనీలో తల్లిపాల ఆవశ్యకతపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మనిస్తారన్నారు. గర్భిణులకు పౌష్టికాహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్నామని తెలిపారు. కేంద్రం



గర్భిణీలు, బాలింతలతో మాట్లాడుతున్న ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్యామ్‌సుందరి

పరిధిలో గర్భిణులు, బాలింతలకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేస్తూ వారి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని చెప్పారు. 2022 నాటికి ప్రసవాలు పూర్తిగా ఆసుపత్రిలోనే జరిగేలా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రసవమైన అరగంటకే బిడ్డకు పాలివ్వాలని, వాటిలో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని చెప్పారు. కొందరు తల్లులు అందం కోసం పిల్లలకు డబ్బా పాలు పడుతున్నారని, ఇది తగదన్నారు. బిడ్డకు పాలు ఇవ్వకపోతే రొమ్ము కేన్సర్ వచ్చే అవకాశం ఉంటుందని, ఈవిషయం కార్యకర్తలు అవగాహన పరచాలని చెప్పారు. ప్రసవం అయిన ఆరుమాసాలు వరకూ బిడ్డకు తల్లి పాలు ఇవ్వాలన్నారు. అలా చేసినట్టయితే పిల్లలు చురుకుగా పెరగడమే కాకుండా బరువు, ఎత్తుకూడా బాగుంటుందన్నారు. గర్భిణీలు ఆసుపత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని తెలిపారు. అనంతరం గర్భిణీలకు సీమంతాలు చేశారు. కార్యక్రమంలో సీడీపీవో శ్రీదేవి సూపర్‌వైజర్ సుభాషిణి, కార్యకర్తలు పద్మ, రోహిణీ, తిరుమల, సరస్వతి పాల్గొన్నారు.

సమాచారం

మహిళా ప్రాంగణం డీఎంగా నీలిమ



విజయనగరం రూరల్: జిల్లా కేంద్రంలోని వి.టి.అగ్రహారంలో ఉన్న మహిళా ప్రాంగణం డీఎంగా కె.నీలిమా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ డీఎంగా విధులు నిర్వహించిన సూర్యకళ విశాఖపట్టణం డీఎంగా బదిలీపై వెళ్లారు. విశాఖలో డీఎంగా విధులు నిర్వహించిన నీలిమా విజయనగరం ప్రాంగణం మేనేజర్‌గా విధుల్లో చేరారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అంకిత భావంతో పనిచేసి ప్రాంగణం అభివృద్ధికి, మహిళలకు ఉపయోగపడే విలువైన శిక్షణలను ఇవ్వడంపై పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తానన్నారు.

సీఆర్పీల జీతాల పెంపుపై హర్షం

కలెక్టరేట్:క్లస్టర్ రిసోర్స్‌పర్సన్ (సీఆర్పీ) జీతాల పెంపుపై ఆయా సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి అరుణకుమారి, ఎస్ఎస్ఏ పీవో లక్ష్మణరావులను కలిసి అభినందనలు తెలిపారు. తమకు ఆర్థిక సమస్యలు తీరుతాయని, మరింత అంకితభావంతో పనిచేసి పాఠశాలల్లో మంచి ఫలితాలు తీసుకువస్తామని సంఘనాయకులు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీ సంఘ నాయకులు జి.రమేష్, గురువులు, అనిత, సంతోషి, పాపారావు, జాకీ, రామారావు, అప్పారావు, వెంకటరమణ, సత్యనారాయణ, వైకుంఠం, పార్వతీశంలు పాల్గొన్నారు.

రేపు అఖిల గాండ్ల తెలికుల సంఘ శంఖారావం

విజయనగరం (ఆంధ్రజ్యోతి):అఖిల గాండ్ల తెలికుల సంఘం శంఖారావాన్ని సోమవారం నిర్వహించనున్నామని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలికుల రాష్ట్ర సంక్షేమ సంఘ నాయకుడు రుద్రగోపి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు దాటిన గాండ్ల, తెలికుల జీవన విధానంలో ఎటువంటి మార్పులేదన్నారు. ఆర్థికంగా బలోపేతం కాలేక పోయామని చెప్పారు. పిల్లలను చదివించుకోలేకపోతున్నామని తెలిపారు. తెలికుల సంక్షేమానికి కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు మంజూరు చేయాలన్నారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 20న తేదీన విజయవాడ గవర్నర్ పేట సమీపంలోని మెడికల్ అసోషియన్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసే సమావేశానికి రాష్ట్రంలోని 13 జిల్లాల్లోని కుల పెద్దలు, నాయకులు హాజరవుతారన్నారు. అనంతరం శుక్రవారం కలెక్టర్ కార్యాలయం సమీపంలో గల కార్యాలయంలో సమావేశమయ్యారు.

లక్షల్లో వ్యయం.. ప్రయోజనం శూన్యం!



డీఎస్వో కార్యాలయం వద్ద శ్లాబ్ నుంచి వర్షం నీరు

కలెక్టరేట్ సముదాయంలోని వివిధ శాఖలకు చెందిన కార్యాలయాలను ఇటీవల రెండు కోట్ల రూపాయలు వెచ్చించి మరమ్మతులు చేయించారు. పనులు కూడా పూర్తి చేయడంతో అదునికరించిన భవనాల్లో విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి కొన్నిచోట్ల కారుతోంది. మరికొన్ని చోట్ల శ్లాబులపై నీరు నిల్వ కావడంతో చెమ్మ కిందికి దిగుతోంది. దీంతో విధులు నిర్వహించే సిబ్బంది అవస్థలు పడుతున్నారు. ఇదే కాకుండా ఇక్కడ విద్యుత్ సరఫరాకు సంబంధించి ఉన్న విద్యుత్ బోర్డులు కొన్ని చోట్ల కిందికి వేలాడుతున్నాయి. ప్రమాదం జరగక ముందే అధికారులు చర్యలు చేపట్టాల్సివుంది.

- కలెక్టరేట్




జేసీ చాంబర్ వద్ద శ్లాబ్‌కు ఉన్న చెమ్మ

అరవింద్‌కు ఫొటోలోని వ్యక్తి ఏమవుతారు?

మెంటల్ ఎబిలిటి

(1 - 5): ఒక కోడ్ భాషలో NATIONALను 86523867 గాను, VOLUME ను 937401 గాను రాశారు. ఈ కోడ్ భాష ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి

1. **'LIMIT' కు సరైన కోడ్?**
ఎ) 27052 బి) 72025 సి) 52702 డి) ఏదీకాదు
2. **'ATTENTION' కు సరైన కోడ్?**
ఎ) 655185238 బి) 618555832
సి) 688532551 డి) ఏదీకాదు
3. **'LOVE' కు సరైన కోడ్?**
ఎ) 1379 బి) 3179 సి) 7391 డి) ఏదీకాదు
4. **'UNIT' కు సరైన కోడ్?**
ఎ) 4825 బి) 2458 సి) 8542 డి) ఏదీకాదు
5. **MOVE కు సరైన కోడ్?**
ఎ) 0391 బి) 3190 సి) 1903 డి) ఏదీకాదు
6. **4, 22, 108, 430, 1288, -----------**
ఎ) 2579 బి) 2574 సి) 2457 డి) 2547
7. **8, 3, 2, 3, 10, -------**
ఎ) 56 బి) 64 సి) 49 డి) 96
8. **10, 9, 20, 57, 232, ---------**
ఎ) 1155 బి) 1165 సి) 1175 డి) 1150
9. **85, 40, 69, 54, 72, 14, 56, ---------**
ఎ) 40 బి) 48 సి) 86 డి) 30
10. **13, 18, 31, 49, 80, -------**
ఎ) 192 బి) 129 సి) 921 డి) 219
11. **కింది రేఖాచిత్రంలో ఎన్ని త్రిభుజాలు ఉన్నాయి?**



ఎ) 12 బి) 13 సి) 15 డి) 10
12. **a - c - cb - ab - cab - ba - ca -**
ఎ) bacacbc బి) aabbccc
సి) caabbcc డి) ఏదీకాదు
13. **a - c - bc - acda - da - ca - cd**
ఎ) dbbdbb బి) bddbbb
సి) bbdbbd డి) ఏదీకాదు
14. **UZ, OR, IL, EH, -------**
ఎ) AF బి) FA సి) EB డి) BE
15. **AAZ, BDX, DIT, HPN, -----------**
ఎ) PFY బి) YPF సి) PYF డి) FYP
16. **క్యాలెండర్: తేదీలు :: నిఘంటువు: -------**
ఎ) అర్థాలు బి) పదాలు సి) వాక్యాలు డి) ఏదీకాదు
17. **రెస్టారెంట్ : మెను :: లైబ్రరి : ---------**
ఎ) పుస్తకాలు బి) చదువు సి) కేటలాగ్ డి) ఏదీకాదు

(18 - 20) - భిన్నమైనదాన్ని తెలపండి

18. ఎ) తేయాకు బి) పొగాకు సి) చెరకు డి) జొన్న
19. ఎ) 196 బి) 144 సి) 64 డి) 36
20. ఎ) KBPY బి) NRMJ సి) JDQW డి) HTSG
21. **ఫొటోలో ఉన్న వ్యక్తిని చూపిస్తూ అరవింద్ ఇలా అంటున్నాడు. 'అతను నా తండ్రి తల్లికి ఏకైక కూతురి భర్త భార్యకు ఏకైక సోదరుడి భార్య భర్త' అయితే అరవింద్‌కు ఫొటోలోని వ్యక్తి ఏమవుతారు?**
ఎ) సోదరుడు బి) మేనమామ
సి) తండ్రి డి) కుమారుడు
22. **పార్కుకి వెళుతున్న వ్యక్తిని చూపిస్తూ అమృత్ ఇలా అంటున్నాడు. 'అతను నా తల్లి తండ్రికి ఏకైక అల్లుడి భార్య సోదరుని తల్లికి భర్త' అయితే పార్కుకి వెళుతున్న వ్యక్తికి అమృత్ ఏమవుతాడు?**
ఎ) మనవడు బి) మేనల్లుడు
సి) కుమారుడు డి) అల్లుడు

(23 - 25): A, B లు సోదరులు. A, C లు వివాహిత జంట. B తల్లి M. C కుమారుడు K. A,



Panditi Meenakshi Pavan
Senior Faculty


Competitive Exams Special

B ల సోదరి Q. Z భార్య Q. పై సమాచారం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి.

23. **A కి Z ఏమవుతారు?**
ఎ) సోదరుడు బి) కుమారుడు
సి) బావ డి) మేనమామ
24. **Q కి K ఏమవుతారు?**
ఎ) కుమారుడు బి) అల్లుడు
సి) సోదరుడు డి) మేనల్లుడు
25. **M కి C ఏమవుతారు?**
ఎ) కుమార్తె బి) కోడలు సి) మేనకోడలు డి) వదిన
26. **సూర్యోదయం తరవాత వివేక్ ఒక స్తంభాన్ని చూస్తూ నిలబడ్డాడు. స్తంభం నీడ వివేక్‌కు ఎడమవైపున ఉంది. అయితే వివేక్ ఏ దిశను చూస్తూ నిలబడ్డాడు?**
ఎ) ఉత్తరం బి) దక్షిణం సి) పడమర డి) ఏదీకాదు
27. **ఉదయం సూర్యునివైపుగా అచ్యుత్ నడకకు బయలుదేరాడు. కొంత దూరం తరవాత ఎడమవైపునకు తిరిగి నడిచాడు. మరల ఎడమవైపునకు తిరిగి నడుస్తున్నాడు. అయితే అచ్యుత్ చివరగా ఏ దిశలో నడుస్తున్నాడు?**
ఎ) ఉత్తరం బి) దక్షిణం సి) పడమర డి) తూర్పు
28. **వినోద్, వివేక్, విక్రమ్, విశాల్ క్యారమ్స్ ఆడుతున్నారు. వినోద్, విక్రమ్‌లు భాగస్వాములు. విక్రమ్ తూర్పునకు ముఖంతో ఉన్నాడు. విశాల్ దక్షిణానికి ముఖంతో ఉన్నాడనుకొంటే పడమరకు ముఖంతో ఉన్న వ్యక్తి?**
ఎ) వినోద్ బి) వివేక్ సి) విశాల్ డి) ఎవరూకాదు
29. **ప్రశ్నార్థకం గుర్తు ఉన్న స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?**


5	9	17
32	63	125
86	171	?

ఎ) 346 బి) 348 సి) 341 డి) 382
30. **ప్రశ్నార్థకం గుర్తు ఉన్న స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి**




ఎ) 61 బి) 84 సి) 38 డి) 64

(31-35)



పై రేఖాచిత్రాన్ని ఆధారంగా చేసుకొని కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి

31. **గాయకులు, క్రికెట్ అభిమానులైన గ్రామీణ విద్యార్థులను సూచించే అక్షరం?**
ఎ) K బి) I సి) E డి) B
32. **గ్రామీణ విద్యార్థులను సూచించే అక్షరం?**
ఎ) G బి) D సి) F డి) E
33. **క్రికెట్ అభిమానులైన గ్రామీణ విద్యార్థులను సూచించే అక్షరం?**
ఎ) L బి) H సి) D డి) K
34. **గాయకులైన విద్యార్థులను సూచించే అక్షరం?**
ఎ) C బి) A సి) K డి) J
35. **కేవలం గాయకులను సూచించే అక్షరం?**
ఎ) B బి) D సి) I డి) A
36. **P అంటే x. Q అంటే ÷. R అంటే - . S అంటే +. అయితే 4P36Q3R752 విలువను తెలపండి?**
ఎ) 48 బి) 43 సి) 52 డి) 54
37. **A అంటే +. B అంటే x. C అంటే -. D అంటే ÷ అయితే 40D8A3B7C5 విలువను తెలపండి**
ఎ) 21 బి) 26 సి) 24 డి) 23
38.



పై డయాగ్రం ఆధారంగా ఎడమవైపున ఉన్న పాచికకు అడుగు ముఖభాగంలో ఉండే అక్షరం?
ఎ) C బి) A సి) E డి) F
39. **FRIENDSHIP పదంలో మొదటి అక్షరం ఆరో స్థానంలోకి, ఆరో అక్షరం మొదటి స్థానంలోకి, రెండో అక్షరం ఏడో స్థానంలోకి, ఏడో అక్షరం రెండో స్థానంలోకి, ఇలా పదంలోని అక్షరాలన్నీ మారాయి. మారిన తరవాత ఏర్పడిన నూతన పదంలో కుడి నుంచి అయిదో అక్షరానికి గల మూడో ఎడమ అక్షరం?**
ఎ) H బి) N సి) R డి) F
40. **ప్రస్తుతం అనుపమ్ వయసు కంటే అతని తండ్రి వయసు నాలుగు రెట్లు. అయిదేళ్ల తరవాత అతని తండ్రి వయసు అనుపమ్ వయసు కంటే మూడు రెట్లు అయితే ప్రస్తుతం అనుపమ్ తండ్రి వయసు?**
ఎ) 40 బి) 30 సి) 35 డి) 45
41. **లీపు సంవత్సరంలో జనవరి నెలలో ఏ తేదీకి ఏ వారం వస్తుందో అదే తేదీకి అదే వారం వచ్చే తదుపరి నెల?**
ఎ) మార్చి బి) జూన్ సి) ఏప్రిల్ డి) జూలై
42. **పాట్నాకు ప్రతి 80 నిలకు ఒక రైలు ఉంది. విచారణాధికారి తనను కలసిన ప్రయాణికుడితో రైలు వెళ్లిపోయి 15నిలు అయింది. తరవాత రైలు గం.10.15లకు అని చెప్పారు. అయితే ఈ సమాచారాన్ని విచారణాధికారి ప్రయాణికుడితో ఏ సమయంలో చెప్పారు?**
ఎ) గం.9.10ని బి) గం.10.20ని
సి) గం.9.30ని డి) ఏదీకాదు
43. **కింది సిరీస్‌లో ముందు సరి సంఖ్య ఉండి తరవాత బేసి సంఖ్య గల సరిసంఖ్యలు ఎన్ని ఉన్నాయి?**
8 4 3 9 8 6 5 9 2 3 6 8 4 2 7 9 2 8 3 9
ఎ) రెండు బి) మూడు సి) నాలుగు డి) ఏదీకాదు
44. **ఈ రోజు ఆగస్టు 15 గురువారం. కిందటి ఏడాది లీపు సంవత్సరం అయితే మూడేళ్ల క్రితం ఇదే తేదీకి ఏ వారం వస్తుంది?**
ఎ) సోమవారం బి) ఆదివారం
సి) శనివారం డి) ఏదీకాదు

సమాధానాలు

		13) బి	21) సి	29) సి	37) ఎ
		14) ఎ	22) ఎ	30) ఎ	38) డి
1) బి	7) సి	15) సి	23) సి	31) బి	39) ఎ
2) ఎ	8) ఎ	16) బి	24) డి	32) డి	40) ఎ
3) సి	9) డి	17) సి	25) బి	33) ఎ	41) సి
4) ఎ	10) బి	18) డి	26) ఎ	34) సి	42) ఎ
5) ఎ	11) బి	19) సి	27) సి	35) డి	43) సి
6) బి	12) ఎ	20) బి	28) ఎ	36) బి	44) బి

ఉద్యోగాలు

ఐఆర్‌డిఏఐ

హైదరాబాద్‌లోని ఇన్స్యూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఐఆర్‌డిఏఐ)- **అసిస్టెంట్ మేనేజర్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 30
విభాగాలవారీ ఖాళీలు: ఆక్చూరియల్ 4, అకౌంట్స్ 4, లీగల్ 2, జనరల్ 20
అర్హత: 60 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు విభాగాన్ని అనుసరించి ఐఏఐ/ ఎసిఏ/ ఐసిడబ్ల్యుఏఐ/ ఎసిఎంఏ/ ఎసిఎస్/ సిఎఫ్ఏ/ ఎల్ఎల్‌బి పూర్తిచేసి ఉండాలి.
వయసు: దరఖాస్తు నాటికి 30 ఏళ్లు మించకూడదు
ఎంపిక: ఫేజ్ 1 - ఆన్‌లైన్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్, ఫేజ్ 2 - డిస్క్రిప్టివ్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ ద్వారా
ఫేజ్ 1 - ఆన్‌లైన్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్: అక్టోబరు 4న
ఫేజ్ 1 ఎగ్జామ్ సెంటర్లు: విజయవాడ, హైదరాబాద్
ఫేజ్ 2 ఎగ్జామ్ సెంటర్లు: హైదరాబాద్, కోల్‌కతా, ముంబై, న్యూఢిల్లీ
దరఖాస్తు ఫీజు: రూ.650(ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు రూ.100)
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 5
వెబ్‌సైట్: www.irdai.gov.in

ఎన్‌పిసిఐఎల్

న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐఎల్)- **ట్రేడ్ అప్రెంటిస్**‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 80
ట్రేడ్స్ వారీ ఖాళీలు: ఫిట్టర్ 15, టర్నర్ 5, మెషినిస్ట్ 5, ఎలక్ట్రీషియన్ 20, వెల్డర్ 10, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ 15, ఎలక్ట్రానిక్ మెకానిక్ 10
ట్రైనింగ్ వ్యవధి: ఏడాది
వయసు: జూలై 31 నాటికి 16 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి
అర్హత: అభ్యర్థులు పదోతరగతితో పాటు సంబంధిత విభాగంలో ఐటిఐ పూర్తిచేసి ఉండాలి
ఎంపిక: అకడమిక్ మెరిట్, మెడికల్ ఎగ్జామ్ ద్వారా ఆసక్తిగలవారు తమ దరఖాస్తును కింది చిరునామాకు పంపుకోవాలి.
దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: ఆగస్టు 24
చిరునామా: Manager(HRM), Nuclear Power Corporation of India Limited, Kaiga site, Via Karwar, PO Kaiga ,Dt. Uttara Khand - 581400, Karnataka
వెబ్‌సైట్: www.npcil.nic.in

అడ్మిషన్స్

యుసిఇఒయు

ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (యుసిఇఒయు)- స్పాన్సర్డ్ కేటగిరీ కింద **ఎంఇ/ ఎంటెక్** ప్రోగ్రామ్స్‌లో ప్రవేశ ప్రక్రియను నిర్వహిస్తోంది.
ప్రవేశ ప్రక్రియ జరిగే తేదీ: ఆగస్టు 30
వెబ్‌సైట్: www.uceou.edu

ఇఫ్లూ

హైదరాబాద్‌లోని ద ఇంగ్లీష్ & ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ వారి స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ - **ఎమ్మే (ఇంగ్లీష్)** ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది
కోర్సు వ్యవధి: రెండేళ్లు
అర్హత: డిగ్రీ(ఇంగ్లీష్ ఒక సబ్జెక్టుగా) పూర్తిచేసి ఉండాలి.
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: అక్టోబరు 31
వెబ్‌సైట్: www.efluniversity.ac.in

చిన్నపిల్లల శరీరాన్ని వెచ్చగా ఉంచే కొవ్వు ఏది?

1. తేలు జంతు రాజ్యంలోని ఏ వర్గానికి చెందుతుంది?
ఎ) కార్డేట బి) అనెలిడా
సి) ఆర్థ్రోపొడా డి) మొలస్కా
2. ఈల్ అనేది ఒక ....
ఎ) చేప బి) క్షీరదం సి) పక్షి డి) అకశేరుకం
3. కర్పరాన్ని కలిగి ఉన్న ప్రోటోజోవన్ ఏది?
ఎ) ఎల్ఫీడియం బి) యూగ్లీనా సి) వర్టిసెల్లా డి) నత్త
4. కింది వాటిలో నిజమైన సర్పం కానిది ఏది?
ఎ) గాజు పాము బి) బ్లైండ్ స్నేక్
సి) సముద్ర సర్పం డి) ట్రీ స్నేక్
5. వ్యాపనం ద్వారా శ్వాసక్రియను జరుపుకొనే జంతువు?
ఎ) తేలు బి) అమీబా సి) వానపాము డి) బి, సి
6. కింది వాటిలో కర్పరం లేని మొలస్కా వర్గపు జీవి ఏది?
ఎ) నత్త బి) డేవిల్ ఫిష్ సి) జలగ డి) ఏదీకాదు
7. కింది వాటిలో సరైన వాక్యాన్ని గుర్తించండి.
1. హైడ్రా నిడేరియా వర్గానికి చెందుతుంది
2. హైడ్రాలో నోరు పాయువుగా కూడా పనిచేస్తుంది.
ఎ) 1 బి) 2 సి) 1 & 2 డి) ఏదీకాదు
8. పురుషుల్లో ఉండే ప్రోస్టేట్ గ్రంథి బరువు సుమారుగా?
ఎ) 20 గ్రాములు బి) 100 గ్రాములు
సి) 85 గ్రాములు డి) 0.5 గ్రాములు
9. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం పుట్టిన శిశువు కనీసం ఎన్ని కిలో గ్రాముల బరువు ఉండాలి?
ఎ) 2 బి) 4.6 సి) 5.2 డి) 3.3
10. 'బ్లూ బేబీ సింక్రోమ్' ఉన్న శిశువులో ఏ అవయవంలో లోపాలుంటాయి?
ఎ) మెదడు బి) గుండె సి) కన్ను డి) ఊపిరితిత్తులు
11. 'డౌన్స్ సింక్రోమ్' ఉన్న మానవునిలో ఎన్ని క్రోమోజోములు ఉంటాయి?
ఎ) 46 బి) 45 సి) 23 డి) 47
12. కింది కొన్ని ఎముకలు, అవి ఉండే భాగాల పేర్లు ఉన్నాయి. వాటిలో సరైన జత కానిది?
1. టిబియా - కాలు 2. అట్లాస్ - వెన్నెముక
3. కార్పెల్ - చేయి 4. స్టెపిస్ - ముక్కు
ఎ) 1, 4 బి) 3, 4 సి) 2, 3, 4 డి) కేవలం 4
13. 'కానిబాల్స్' అంటే?
ఎ) రక్తాన్ని పీల్చే జంతువులు
బి) ఫలాలు తినే జంతువులు
సి) మలాన్ని తినే జంతువులు
డి) తమ వంటి జీవులను తినే జంతువులు
14. కింది వాటిలో జలచర క్షీరదం?
ఎ) డుడాంగ్ బి) డాల్ఫిన్
సి) తిమింగలం డి) పైవన్నీ
15. వెంట్రుకల్లో ఉండే ప్రోటీన్?
ఎ) ఎవిడిన్ బి) కెసిన్
సి) కెరాటిన్ డి) కెరోటిన్
16. కింది వాటిలో అవశేష అవయవం?
ఎ) జ్ఞానదంతం బి) రెటీనా
సి) ప్లీహం డి) క్లోమం
17. 'మస్క్యులర్ డిస్ట్రోఫి' దేనికి సంబంధించిన వ్యాధి?
ఎ) మెదడు బి) గుండె
సి) ఎముకలు డి) కండరాలు
18. చేప ప్రధాన విసర్జక పదార్థం?
ఎ) అమ్మోనియ బి) యూరియ
సి) యూరికామ్లం డి) క్రియాటిన్
19. కుల్యా వ్యవస్థను కలిగి ఉండటం ఏ జంతువు లక్షణం?
ఎ) వానపాము బి) స్పంజిక
సి) బద్దెపురుగు డి) అమీబా



ఆర్. సురేష్
సీనియర్ ఫ్యాకల్టీ

జనరల్ స్టడీస్ - బయాలజీ



20. కింది ఏ జీవిలో ఏక రక్త ప్రసరణ కలదు?
ఎ) కప్ప
బి) పాము
సి) ఏనుగు డి) చేప
21. చేప గుండెలో ఉండే కర్ణికల సంఖ్య?
ఎ) 1 బి) 2 సి) 3 డి) 4
22. ఏ జంతువు గుండెలో మిశ్రమ రక్తం ఉంటుంది?
ఎ) చేప బి) కప్ప సి) మొసలి డి) పైవన్నీ
23. కింది వాటిలో చేపల లక్షణం కానిది?
ఎ) ఉష్ణరక్త జీవులు బి) బంధిత రక్త ప్రసరణ
సి) బ్రాంఖియల్ హృదయం డి) బాహ్య ఫలదీకరణ
24. మలంతో పాటు చీము, రక్తం రావడం ఏ వ్యాధి లక్షణం?
ఎ) ఫైలేరియ బి) మలేరియ
సి) అమీబిక్ డీసెంట్రీ డి) టైఫాయిడ్
25. 'ఎంటరిక్ ఫీవర్' అని ఏ వ్యాధిని పిలుస్తారు?
ఎ) టైఫాయిడ్ బి) మలేరియ
సి) ఫైలేరియ డి) క్షయ
26. ఏ రకానికి చెందిన ట్యూమర్‌ను శస్త్ర చికిత్స ద్వారా తొలగించవచ్చు?
ఎ) బినైన్ బి) మాలిగ్నెంట్
సి) బినైన్, మాలిగ్నెంట్ డి) ఏదీకాదు
27. అధిక బరువును కలిగి ఉన్న మానవుని బాడీమాస్ ఇండెక్స్ ఎంత?
ఎ) 18.5 కంటే తక్కు బి) 18.5 నుంచి 24.9
సి) 25 నుంచి 29.9 డి) 15.5 కంటే తక్కువ
28. కీలు చుట్టూ ఉండే ద్రవాన్ని ఏమంటారు?
ఎ) పెరిఫ్లూరల్ బి) పెరికార్డియల్
సి) సైనోవియల్
డి) మస్తిష్క మేరు ద్రవం
29. చేతి వేలితో ఒక వ్యక్తి కాలుపై నొక్కినప్పుడు గుంతలు ఏర్పడితే అతడు ఏ వ్యాధితో బాధపడుతున్నట్లు?
ఎ) స్కర్వీ బి) గౌట్ సి) ఫ్లోరోసిస్ డి) ఎడిమా
30. కింది వాటిలో ఎగిరే చేప ఏది?
ఎ) టార్పిడో బి) ఎక్సోసీటస్
సి) డాల్ఫిన్ డి) డెవిల్ ఫిష్
31. పుట్టిన పిల్లల్లో శ్వాసక్రియ రేటు?
ఎ) 32 బి) 16 సి) 25 డి) 70
32. మానవుని శరీరంలో యూరియా సంశ్లేషణ జరిగే ప్రదేశం?
ఎ) కాలేయం బి) క్లోమం
సి) మూత్రపిండం డి) ప్లీహం
33. సీతాకోకచిలుక ఆకారంలో ఉండే వినాళ గ్రంథి?
ఎ) పీయూష బి) అధివృక్క
సి) అవటు డి) పార్శ్వ అవటు(పారా థైరాయిడ్)
34. టిబియా అనే ఎముక ఏ భాగంలో ఉంటుంది?
ఎ) చేయి బి) కాలు సి) చెవి డి) ముక్కు
35. 'వెరికోస్' అనేది దేనికి సంబంధించిన వ్యాధి?
ఎ) ధమనులు బి) ఎర్రరక్త కణాలు
సి) కాలేయం డి) సిరలు
36. చిన్నపిల్లల శరీరాన్ని వెచ్చగా ఉంచే కొవ్వు ఏది?
ఎ) బ్రౌన్ ఫ్యాట్ బి) పసుపు ఫ్యాట్
సి) ఎరుపు ఫ్యాట్ డి) బ్లూ ఫ్యాట్
37. పాలలో ఉండే ప్రోటీన్ ఏది?
ఎ) లాక్టోజ్ బి) ఎవిడిన్ సి) కెరాటిన్ డి) కెసిన్
38. కింది వాటిని జతపరచండి.
1. కణ మేధస్సు ఎ. మైటోకాండ్రియ
2. కణ కొలిమి బి. కేంద్రకం
3. కణ భాండాగారం సి. రిక్తిక
4. కణ వంటశాల డి. హరితరేణువు
ఎ) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి బి) 1-బి, 2-ఎ, 3-సి, 4-డి
సి) 1-బి, 2-ఎ, 3-డి, 4-సి డి) 1-బి, 2-డి, 3-సి, 4-ఎ
39. మానవుని రక్త వర్గాలకు సంబంధించి ఎన్ని జన్యు రూపాలు ఉంటాయి?
ఎ) 4 బి) 2 సి) 8 డి) 6
40. 'పెప్సిన్' అనేది ఒక ......
ఎ) హార్మోన్ బి) ఎంజైమ్ సి) విటమిన్ డి) స్టిరాయిడ్
41. కణం ప్రోటీన్ల కర్మాగారం అని దేన్ని పిలుస్తారు?
ఎ) లైసోజోమ్ బి) పెరాక్సిజోమ్
సి) రైబోజోమ్ డి) మైటోకాండ్రియ
42. ఎగిరే క్షీరదం అని దేన్ని పిలుస్తారు?
ఎ) డాల్ఫిన్ బి) తిమింగలం
సి) గబ్బిలం డి) డుడాంగ్
43. పాలలో లభించని పోషక పదార్థం?
ఎ) కాల్షియం బి) ప్రోటీన్లు సి) ఇనుము డి) పైవన్నీ
44. హెర్పిస్ అనే వ్యాధిని కలుగజేసింది?
ఎ) బ్యాక్టీరియా బి) శిలీంధ్రం
సి) ప్రోటోజోవన్ డి) వైరస్
45. వైడాల్ : టైఫాయిడ్ :: బయాప్సి : ....
ఎ) రేబీస్ బి) క్యాన్సర్ సి) ఎయిడ్స్ డి) సిఫిలిస్



46. ఉసిరిలో పుష్కలంగా లభించే విటమిన్?
ఎ) విటమిన్-సి
బి) విటమిన్-ఇ
సి) విటమిన్-డి
డి) విటమిన్-ఎ
47. మూత్రంలో విసర్జితమయ్యే విటమిన్?
ఎ) విటమిన్-డి బి) విటమిన్-సి
సి) విటమిన్-కె డి) విటమిన్-ఎ
48. బటన్, మిల్కి, పాడిస్ట్రా అనేవి?
ఎ) పుట్టగొడుగు రకాలు బి) వరి రకాలు
సి) మామిడి రకాలు డి) అరటి రకాలు
49. కింది వాటిలో రక్తనాళాలు లేని జంతువు ఏది?
ఎ) వానపాము బి) బొద్దింక సి) కప్ప డి) పైవన్నీ
50. పట్టుపురుగుల పెంపకాన్ని ఏమంటారు?
ఎ) ఎపికల్చర్ బి) మోరికల్చర్
సి) ఒలేరికల్చర్ డి) సెరికల్చర్

సమాధానాలు

			25) ఎ	34) బి	43) సి
1) సి	9) డి	17) డి	26) ఎ	35) డి	44) డి
2) ఎ	10) బి	18) ఎ	27) సి	36) ఎ	45) బి
3) ఎ	11) డి	19) బి	28) సి	37) డి	46) ఎ
4) ఎ	12) డి	20) డి	29) డి	38) బి	47) బి
5) డి	13) డి	21) ఎ	30) బి	39) డి	48) ఎ
6) బి	14) డి	22) బి	31) ఎ	40) బి	49) బి
7) సి	15) సి	23) ఎ	32) ఎ	41) సి	50) డి
8) ఎ	16) ఎ	24) సి	33) సి	42) సి	

ఉద్యోగాలు

షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా

షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా - **మెరైన్ ఇంజనీర్స్** పోస్టుల భర్తీకి ఉద్దేశించిన **'జిఎంఇ'(గ్రాడ్యుయేట్ మెరైన్ ఇంజనీర్స్) కోర్స్**కు దరఖాస్తులు కోరుతోంది. ఈ కోర్సులో 8 నెలల ప్రీ సీ ట్రైనింగ్, 10 నెలల షిప్ బోర్డ్ ట్రైనింగ్ ఉంటుంది.
మొత్తం ఖాళీలు: 40
కోర్సు ఫీజు: రూ.4,50,000
క్యాంపస్: ఎస్‌సిఐ మారిటైం ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, పొవై, ముంబై
కోర్స్ ప్రారంభం: అక్టోబరు 1 నుంచి
అర్హత: ఆగస్టు 31 నాటికి బిఇ/ బిటెక్(మెకానికల్) పూర్తిచేసి ఉండాలి.
వయసు: అక్టోబరు 1 నాటికి 28 ఏళ్లు మించరాదు. మహిళలకు రెండేళ్ల సడలింపు వర్తిస్తుంది
ఎంపిక: ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా
ఆన్‌లైన్ టెస్ట్: సెప్టెంబరు 9న
పరీక్ష కేంద్రాలు: ముంబై, న్యూఢిల్లీ, కోల్‌కతా, చెన్నై
దరఖాస్తు ఫీజు: రూ.1000(ఎస్సీ/ ఎస్టీలకు రూ.500)
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 23
దరఖాస్తు హార్డు కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: ఆగస్టు 25
వెబ్‌సైట్: www.shipindia.com

ఇఎస్ఐసి

కోల్‌కతాలోని ఇఎస్ఐసి పీజీఐఎంఎస్ఆర్ & ఎంసి - కాంట్రాక్ట్ ప్రాతిపదికన **ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్** పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.
మొత్తం ఖాళీలు: 23
పోస్టుల వారీ ఖాళీలు: ప్రొఫెసర్ 7, అసోసియేట్ ప్రొఫెసర్ 11, అసిస్టెంట్ ప్రొఫెసర్ 5
విభాగాలు: అనెస్థీషియా, బ్లడ్ బ్యాంక్/హెమటాలజీ, కమ్యూనిటీ మెడిసిన్, డెంటిస్ట్రీ, డెర్మటాలజీ, ఇఎన్‌టి, జనరల్ మెడిసిన్, మైక్రో బయాలజీ, ఆప్తల్మాలజీ, పీడియాట్రిక్స్, పాథాలజీ, సైకియాట్రి, రేడియాలజీ, టిబి/ చెస్ట్ మెడిసిన్.
వయసు: ఇంటర్వ్యూ నాటికి 69 ఏళ్లు మించరాదు
ఇంటర్వ్యూలు: సెప్టెంబరు 4 నుంచి 7 వరకు
వేదిక: ESIC - PGIMSR & MC, Joka, Kolkata
వెబ్‌సైట్: www.esic.nic.in

జిటిఆర్ఇ

డిఆర్‌డిఒ ఆధ్వర్యంలోని గ్యాస్ టర్బైన్ రీసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్ - **గ్రాడ్యుయేట్/ డిప్లొమా/ ఐటిఐ అప్రెంటిస్ ట్రైనీస్**‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 152
- **గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ట్రైనీస్**
ఖాళీలు: 90
అర్హత: బిఇ/ బిటెక్ / తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి
వయసు: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి
స్టయిపెండ్: నెలకు రూ.4,984
- **డిప్లొమా అప్రెంటిస్ ట్రైనీస్**
ఖాళీలు: 30
అర్హత: డిప్లొమా / తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి
వయసు: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి
స్టయిపెండ్: నెలకు రూ.3542
- **ఐటిఐ అప్రెంటిస్ ట్రైనీస్** **ఖాళీలు:** 32
అర్హత: రెండేళ్ల ఒకేషనల్ కోర్స్ / తత్సమాన కోర్సు పూర్తిచేసి ఉండాలి
వయసు: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి
స్టయిపెండ్: ప్రభుత్వ నిబంధనల మేరకు
ఎంపిక: అకడమిక్ మెరిట్, ఇంటర్వ్యూ ద్వారా
ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తును పోస్టు ద్వారా పంపుకోవాలి.
దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 5
చిరునామా: The Director Gas Turbine Research Establishment, CV Raman Nagar, Bangalore - 560093

ఎంఒఐఎల్

నాగపూర్‌లోని మాంగనీస్ ఓర్ ఇండియా లిమిటెడ్ (ఎంఒఐఎల్)- కింది పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. **ఖాళీలు: 13**
పోస్టులు: మేనేజర్ (మెడికల్ సర్వీసెస్) 8, ఎగ్జిక్యూటివ్ ట్రైనీ(జియాలజీ/ అప్లయిడ్ జియాలజీ) 3, సీనియర్ మేనేజర్(జియాలజీ) 1, మేనేజర్(సెక్యూరిటీ) 1
అర్హత: పోస్టును అనుసరించి ఎంబిబిఎస్/ పీజీ (జియాలజీ/ అప్లయిడ్ జియాలజీ)/ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
దరఖాస్తు ఫీజు: రూ.100
ఇంటర్వ్యూలు: మేనేజర్ పోస్టులకు ఆగస్టు 20న, ఇతర పోస్టులకు సెప్టెంబరు 4న
వేదిక: Moil Bhawan, 1 - A KATOL Road, Nagpur - 440013
వెబ్‌సైట్: www.moil.nic.in

భావనకు న్యూమరీ కోటాలో ట్రిపుల్ ఐటీ సీటు

కురుపాం: స్థానిక ఆదర్శ పాఠశాలలో గతేడాది చదువుకొని 10వ తరగతి పరీక్షల్లో 9.7 పాయింట్లు సా. దించిన నడికట్ల భావనకు సూపర్ న్యూమరి కోటాలో ట్రిపుల్ ఐటీ సీటు మంజూరయ్యింది. సీటు కేటాయిం పుతో ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. శ్రీకాకుళంలో సీటు కేటాయించి తండ్రి మురళీకృష్ణ తెలిపారు.

నేడు ఆయుర్వేద వైద్య శిబిరం

జియ్యమ్మవలస: శనివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు జియ్యమ్మవలస పీహెచ్‌సీ ఆయుర్వేద వైద్యాధికారి టి.హేమాక్షి చెప్పారు. ఈ వైద్య శిబిరంలో అన్ని రకాల వ్యాధులకు వైద్య సేవలు అందించనున్నట్టు చెప్పారు. దీనిని మండలంలోని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

పాఠశాలలకు క్రీడా సామగ్రి పంపిణీ

జియ్యమ్మవలస: మండలంలో 86 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు శుక్రవారం క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సామగ్రిలో క్యారమ్ బోర్డులు, వాలీబాల్ నెట్, షాట్ పుట్, స్కిప్పింగ్ రోప్స్, రింగ్స్, ఉన్నాయి. శుక్రవారం దాదాపు 70 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వారి పాఠశాలల సామగ్రిని తీసుకువెళ్లారు. శనివారం ఉదయం మిగిలిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తీసుకు వెళ్లే అవకాశం ఉంది. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి విద్యా శాఖా . దికారి నిమ్మక సత్యనారాయణ, సీఆర్‌పీలు పోలినాయుడు, కృష్ణ పాల్గొన్నారు.



క్రీడా సామగ్రిని పంపిణీ చేస్తున్న సీఆర్‌పీలు

అంతర్ పంటలతో అధిక లాభాలు

కొంకడివరం (గరుగుబిల్లి): రైతులు ఆర్థికంగా బలపడడానికి అంతర్ పంటలు ఎంతగానో ఉపయోగపడతాయని ఏఈవో అమరాశివ అన్నారు. శుక్రవారం కొంకడివరంలో జాతీయ ఆహార భద్రత పథకంలో రైతులు సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్ట ప్రాంతాలు అనుకూలంగా ఉంటాయన్నారు. గోగులో కంది పంట సాగు చేయడంతో ఆహార భద్రతతో పాటు ఆరోగ్యభద్రత ఉంటుందన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పొలం గట్లుపై కంది సాగుకు విత్తనాలను అందిస్తున్నామన్నారు. గట్లుపై కంది సాగు కారణంగా గట్లు బలపడటంతో పాటు వరికి తెగుళ్లు ఆశించవన్నారు. వరికి రసాయనాలకు బదులు సేంద్రియ ఎరువులను ఉపయోగించేలా సూచనలు అందిస్తున్నామన్నారు. మొదటిగా తోటపల్లి, నాగూరు క్లస్టర్ల పరిధిలో సేంద్రియ ఎరువులను తయారు చేసి అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అల్లు అప్పలనాయుడు, రైతులు పాల్గొన్నారు.



అంతర్ పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అరకొర వర్షాలతో పూర్తికాని ఉభాలు

గరుగుబిల్లి: మండలంలోని సాగునీరందని ప్రాంతాల్లో వరి ఉభాలు నత్తనడకన సాగుతున్నాయి. నాగావళి కుడి, ఎడమ కాల్వల పరిధిలో ముమ్మరంగా ఉభాలు నిర్వహిస్తున్నారు. గత మూడు రోజులగా వర్షాలు కురుస్తున్నా అంతంత మాత్రంగానే నీరు చేరడంతో రైతులు ఇబ్బందులకు లోనవుతున్నారు. సీతారామపురానికి ఆనుకుని జంఝావతి కాల్వ ఉన్నా సాగునీరు రాకపోవడంతో ఆ ప్రాంతంలో ఉడుపులు కాలేదు. ఈ నెలాఖరుకు ఉడుపులు పూర్తి కావల్సి ఉన్నప్పటికీ వర్షాలు అనుకూలంగా లేక పొలాలు బీడుగా కనబడుతున్నాయి. మరో పక్క వరి నారు ముదిపోతుందని రైతులు ఆందోళన చందుతున్నారు. మండలంలో ప్రస్తుతం 6,005 హెక్టార్లకుమ గాను 5,500 ఎకరాల్లో ఉడుపులు పూర్తయ్యాయి. మెట్ట ప్రాంతాల్లో అనుకూల వర్షాలు లేనట్లయితే కరువు ఛాయలు నెలకొనే పరిస్థితి ఉంది.



నీటి తడులు తక్కువగా ఉన్నా ఉడుపులు చేస్తున్న దృశ్యం

విధులకు సూపరింటెండెంట్ డుమ్మా

● ఎంపీడీవో కార్యాలయం చుట్టూ అర్జీదారుల ప్రదక్షిణలు

జియ్యమ్మవలస: మూడు రోజులగా ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ కె.బానోజీరావు కార్యాలయానికి ముఖం చూడకపోవడంపై అర్జీదారులు మండిపడుతున్నారు. గుమ్మలక్ష్మీపురం ఎంపీడీవోగా ఇక్కడ ఇన్‌చార్జిగా వ్యవహరించడంతో సూపరింటెండెంట్ బాధ్యతలు అత్యంత కీలకం. అటువంటిది ఆయన 3 రోజులుగా చూడకపోవడంపై మండల ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. కనీసం సెలవుపై వెళ్లినట్టు గాని, ఉన్నతాధికారుల అనుమతి తీసుకోవడం గాని ఏమీ లేదు. ఈ నెల 16వ తేదీన ఎస్సీ, ఎస్టీ, బీసీ రుణాలు 44 యూనిట్లుకు ఎంపిక చేసినప్పుడు ఎంపీడీవో శ్యామ్‌సుందర్ ఉన్న సమయంలో అత్యవసర ఫోన్ వస్తే హుటాహుటిన గుమ్మలక్ష్మీపురం వెళ్లాల్సి వచ్చింది. ఆ సమయంలో సూపరింటెండెంట్ గైర్హాజరు కారణంగా ఆఫీసు సబార్డినేట్ ఎంపిక ప్రక్రియ వద్ద కూర్చోవలసి వచ్చింది. ఒక్క మాటలో చెప్పాలంటే ఆఫీసుకు రావడం, పోవడం అతని ఇష్టారాజ్యంగా తయారయ్యింది. గతంలో ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉన్నప్పుడు ఇతనికి మండలాధ్యక్షురాలు దత్తి కామేశ్వరి పలుమార్లు హెచ్చరించినా పరిస్థితి మారలేదు. అంతే కాకుండా మరింత బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించడం షరా మామూలైపోయింది. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు డిమాండ్ చేస్తున్నారు.

అనుమతి అడగలేదు



ఆగస్టు 15 తరువాత ఇప్పటి వరకు కార్యాలయానికి రాలేదు. నా అధికారిక సిమ్ నెంబర్‌తో ఉన్నతాధికారులకు సమాచారం పంపిస్తున్నట్టు తెలిసింది. నాకు కనీసం అనుమతి అడగలేదు. చెప్పలేదు కూడా.

శ్యామ్‌సుందర్, ఇన్‌చార్జి ఎంపీడీవో



ఖాళీగా కనబడుతున్న సూపరింటెండెంట్ కుర్చీ

నీటి నిల్వలు పెంచేందుకు చర్యలు

తోటపల్లి (గరుగుబిల్లి): తోటపల్లి ప్రాజెక్టులో నీటి నిల్వలు పెంచేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. గత మూడు రోజుల క్రితం నదిలో 102.95 అడుగుల మేర నిల్వలు ఉన్నాయి. ప్రాజెక్టులో ముందస్తుగా నిల్వలు చేసినా, వరదలు వస్తాయన్న ఆలోచనతో నీటిని దిగువకు విడుదల చేయడంతో సాగునీరు వృథా అయ్యింది. ప్రస్తుతం అనుకున్న మేర నీరు లేకపోవడంతో దిగువకు వెళ్లకుండా పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తున్నారు. నాగావళి వేసవిని తలపించే విధంగా ఒట్టిపోయింది. నదీ తీర ప్రాంతవాసులకు కొంతమేర సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పైనుంచి సుమారు 2,580 క్యూసెక్కుల మేర నదిలోకి వస్తోంది. దీంతో ప్రస్తుతం 103.20 అడుగులకు చేరుకుంది. కుడి, ఎడమ ప్రధాన కాల్వలతో పాటు పిల్ల కాలువలు నుంచి సుమారు 1370 క్యూసెక్కుల మేర సాగుకు విడుదల చేస్తున్నామని ప్రాజెక్టు డీఈ ఎస్.పాండు, జేఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. వర్షాలు కురుస్తున్న దృష్ట్యా ప్రస్తుతం నీటి నిల్వలకు ఢోకా లేదన్నారు. ఖరీఫ్‌కు ముందస్తుగా చెరువుల్లో నీరు నిల్వ చేసుకొనేందుకు పూర్తిస్థాయిలో అందించినట్టు చెప్పారు.



అంతంత మాత్రంగానే నీరు సరఫరా చేస్తున్న దృశ్యం

గిరిజన సంక్షేమ వసతి గృహాలకు వంట గ్యాస్

గుమ్మలక్ష్మీపురం: ఐటీడీఏ పరిధిలో గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలలకు వంట గ్యాస్‌ను సరఫరా చేయాలని గిరిజన సహకార సంస్థకు ఐటీడీఏ పీవో డాక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. ఈ ఆదేశాల మేరకు గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస మండలాల్లోని ఆశ్రమ పాఠశాలలకు గుమ్మలక్ష్మీపురం గ్యాస్ డీలర్ ద్వారా డోర్ డెలివరీ చేయడానికి జీసీసీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గత కొన్నాళ్లుగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు వంట గ్యాస్ సరఫరా నిలిచిపోయింది. వంట చెరకును ఉపయోగిస్తున్నారు. వంట చెరకు వాడకంతో అడవులు నాశనమై పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతున్న కారణంగా పీవో స్పందించి ఉన్నతాధికారులతో మాట్లాడి టీడబ్ల్యూ ఆశ్రమ పాఠశాలలకు వంట గ్యాస్ సరఫరాకు అనుమతి తీసుకున్నారు.

బీఎస్ఎన్‘నిల్’ సేవలపై అసంతృప్తి

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం గిరిజన ప్రాంతంలో బీఎస్ఎన్ఎల్ సెల్‌ఫోన్, ఇంటర్నెట్ సేవలపై వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేసుతన్నారు. సెల్‌ఫోన్లు ఎప్పుడు పనిచేస్తాయో చేయవో తెలియని పరిస్థితి. బ్రాడ్ బ్రాండ్‌కు నెలకు రూ. 800 చొప్పున ఇంటర్నెట్ వినియోగదారులు కడుతున్నా గంట కూడా పనిచేయడం లేదని అసం తృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ప్రైవేటు నెట్‌వర్కు వస్తుందా అని ఎదురు చూస్తున్నారు. బీఎస్ఎన్ఎల్ సేవలు మెరుగుపర్చాలని వినియోగదారులు ఫిర్యాదులు చేస్తున్నా సంబంధిత అధికారుల నుంచి సరైన స్పందన కానరావడం లేదు. ఇప్పటికైనా స్పందించి ఏజెన్సీలో బీఎస్ఎన్ఎల్ సేవలు మెరుగుపర్చాలని వినియోగదారులు కోరుతున్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపండి

జోగింపేట (సీతానగరం): గురుకుల పాఠశాలలో పేద విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు తెలిపారు. శుక్రవారం జోగింపేట ఎస్సీ గురుకుల పాఠశాలను పరిశీలించారు. పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న పి.గణేష్ మృతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తల్లిదండ్రులను విడిచి సుదూర ప్రాంతాలనుంచి వచ్చిన విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులే ప్రధాన దిక్కుగా నిలవాలన్నారు. పిల్లలకు వేడి వేడి పదార్థాలు పెట్టాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. గురుకులం విద్యార్థులకు తరచూ వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. విద్యార్థీ, విద్యార్థులను సొంత పిల్లలాగ చూసుకోవాలని హితవు పలికారు. సమయానికి పిల్లల్ని పాఠశాలకు పంపించి, రాత్రి సమయంలో చక్కగా చదివించాలని చెప్పారు. గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ చంద్రవతి, ప్రిన్సిపాల్ ఆశీర్వాదం, పార్వతీపురం ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాసరావు, మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటప్పలనాయుడు పాల్గొన్నారు.



గురుకుల పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిరంజీవులు

బడి పిల్లలకు గుడ్డు హుళక్కేనా?

కురుపాం రూరల్ : బడి పిల్లలకు మెనూ సక్రమంగా అందడం లేదు. ఒక్కొక విద్యార్థికి 3 గుడ్లు పెట్టాలని ప్రభుత్వం నిర్దేశించింది. మండలంలోని అన్ని యాజమాన్యల కింద ఉన్న పాఠశాల్లో 6,900 మంది బాలి బాలికలు ఉన్నారు. వీరికి వారానికి ఒక్కొక్కరికి 3 గుడ్లు చొప్పున 20,700 వేల గుడ్లు అవసరం ఉంది. అయితే ఆగస్టు 1వ తేదీ నుంచి ఏ ఒక్క పాఠశాలకు గుడ్ల సరఫరా చేయడం లేదు. దీంతో బడి ఈడు పిల్లలకు గుడ్డు అందని ద్రాక్షే అయ్యింది. శ్రీకాకుళం కేంద్రంగా ఉన్న మారుతి అగ్రో లిమిటెడ్ గుడ్లు సరఫరా చేయాల్సి ఉండగా గుడ్ల జాడే లేదు.

గుడ్లు పెట్టినప్పుడు కూడా ఒక్కో చోట చిన్న సైజు గుడ్లు, మరో చోట కుళ్లిన గుడ్లు వండి పెట్టిన సందర్భాలూ ఉన్నాయి. దీనితో పిల్లలకు పోష కాహారం మాట ఎలా ఉన్నా తిరిగి అనారోగ్యం పాల యే పరిస్థితి ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సరైన పద్ధతిలో గడ్లను సరఫరా చేయ్యాలని లేని ఎడని పూర్తిగా వీటిని తీసివేయాలని కోరుతున్నారు.

గుడ్లు కోసం నిలదీస్తున్నారు



మెనూ ప్రకారం వంటకాలలో గుడ్లు పెట్టాలని పాఠశాల పిల్లలు నిలదీస్తున్నారు. ప్రభుత్వపరంగా వారానికి ఒకసారి గుడ్లు స్కూల్‌కు సరఫరా చేయాల్సి ఉండగా నేటికి 19 రోజులైనా గుడ్లు జాడే లేదు. ఈ అంశంపై పట్టించుకునే నాథుడే లేదు. గుడ్లు సరఫరా లేని కారణంగా పిల్లలకు సమాధానం చెప్పలేకపోతున్నామని ఉపాధ్యాయులు అంటున్నారు.

బంటు సంగం నాయుడు,
ఉపాధ్యాయ సంఘం నాయకుడు

దినఫలాలు



అదృష్టసంఖ్యలు : 1,8



మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): బదిలీలు, మార్పులు అసౌకర్యం కలిగిస్తాయి. ప్రియతముల వైఖరిలో మార్పు ఆవేదన కలిగిస్తుంది. ఇంట్లో వేడుకలు, సమావేశాలకు ఏర్పాట్లు చేస్తారు. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు.



వృషభరాశి: (ఏప్రిల్21-మే20): సోదరీ, సోదరుల వైఖరిలో మార్పు ఆవేదన కలిగిస్తుంది. విద్యా సంస్థల్లో ప్రవేశానికి అనుకూలం. రవాణా, ఏజెన్సీలు, స్టేషనరీ, బోధన రంగాల వారు చేపట్టిన పనులు పూర్తిచేస్తారు. ఒక వార్త కలవరపెడుతుంది.



మిథునరాశి: (మే21-జూన్21): ఆర్థిక విషయాలకు సంబంధించి ఒక సమాచారం కలవరపెడుతుంది. సన్నిహితులకు డబ్బు సర్దుబాటు చేయాల్సి వస్తుంది. రుణాలు, పెట్టుబడుల కోసం చేసే ప్రయాణాలు, చర్చలు ఫలిస్తాయి.



కర్కాటకరాశి: (జూన్22-జూలై23): పెట్టుబడులు, పొదుపు పథకాల విషయంలో ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలి. ఆర్థిక వ్యవహారాల్లో సంకల్పం నెరవేరుతుంది. అనుకున్న నిధులు సకాలంలో చేతికి అందుతాయి. లక్ష్యాలు సాధిస్తారు.



సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల్లో లక్ష్య సాధనకు ఆటంకాలు ఎదురయ్యే అవకాశం ఉంది. గ్రానైట్, ఫొటోగ్రఫీ, టెక్స్‌టైల్స్, బోధన రంగాల వారికి సంకల్పం నెరవేరుతుంది. ఏదో తెలియని వెలితి మనసును బాధిస్తుంది.



కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): ఆర్థిక వ్యవహారాలు అశాంతికి కారణం అవుతాయి. సన్నిహితులకు సంబంధించి రహస్య సమాచారం తెలుసుకుంటారు. ప్రదర్శనలు, ఉత్సవాల్లో పాల్గొంటారు. ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి.



తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): పెద్దల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది. ఉద్యోగ, వ్యాపారాల్లో సన్నిహితుల సహకారం లోపిస్తుంది. బంధుమిత్రుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. జనసంబంధాలు విస్తరిస్తాయి.



వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): వృత్తి, వ్యాపారాల్లో అంచనాలు తప్పే అవకాశం ఉంది. భవిష్యత్ గురించి వ్యూహరచన చేస్తారు. వృత్తికి సంబంధించిన సమావేశాల్లో పాల్గొంటారు. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు.



ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): రుణ ప్రయత్నాలు ఫలించకపోవచ్చు. ఆర్థిక విషయాల్లో అంచనాలు తప్పే అవకాశం ఉంది. పన్నుల వ్యవహారాలు ఇబ్బంది పెడతాయి. పాత వస్తువుల రవాణాకు అనుకూలం. గత అనుభవంతో లక్ష్యాలు సాధిస్తారు.



మకరరాశి(డిసెంబర్22-జనవరి21): పెట్టుబడులు, పందాలు, పోటీల్లో నష్టం సంభవం. ప్రియతముల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు.



కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): శ్రీవారు, శ్రీమతి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి. సన్నిహితుల సహకారంతో వృత్తి, వ్యాపారాల్లో అనుకున్న పనులు పూర్తి చేస్తారు. విందు, వినోదాల్లో పరిమితి పాటించాలి.



మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): చిన్నారులు, ప్రియతముల ఆరోగ్యం కలవరపెడుతుంది. వృత్తిపరమైన శిక్షణలో పాల్గొనేందుకు అనుకూలం. కృషి రంగంలో కొత్త అనుబంధాలు ఏర్పడతాయి. విద్య, సృజనాత్మకరంగాల వారికి అనుకూలం.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

మొదటి పేజీ తరువాయి

'దారి' పొడవునా అక్రమాలు

204 రోడ్లకు రూ. 391.68 లక్షలు, వేతనం కింద మరో రూ. 571.31 లక్షలు కలిపి మొత్తం రూ.962.98 లక్షలకు పరిపాలన ఆమోదం తెలిపింది. ఇప్పటివరకు 10 రోడ్లు పూర్తి చేశామని... వాటికోసం రూ. 9.41 లక్షలు చెల్లించామని... రూ. 1.76 లక్షలను మెటీరియల్ కింద ఖర్చు చేశామని ఉపాధి హామీ అధికారులు నివేదికలు పంపించారు. అంతేకాకుండా మరో 78 రోడ్లు నిర్మాణంలో ఉన్నాయని చెప్పుకొచ్చారు. వాటి కోసం రూ.106.9 లక్షలను మెటీరియల్ కింద ఖర్చు చేశామని తెలిపారు. రూ. 13.68 లక్షలు వేతనాలతో కలిపి మొత్తం రూ.120.58 లక్షలు ఖర్చయినట్లు నివేదికలో పొందుపరిచారు. వాస్తవ పరిస్థితులు చూస్తే అడుగడుగునా అవినీతే కనిపిస్తోంది. చాలా చోట్ల వేసిన రోడ్లను మళ్లీమళ్లీ వేసినట్టు చూపారు. ఈ వ్యవహారంలో గతంలో ఇక్కడ పనిచేసిన ఏపీవో, ఈసీ, ఎంపీడీవోలే కీలక పాత్ర పోషించినట్టు సమాచారం. నేతలు, కాంట్రాక్టర్లు పంపిన ప్రతిపాదనలను సరిగా పరిశీలించకుండా ఆమోదించారని కొందరు ప్రజాప్రతినిధులే విమర్శిస్తున్నారు. వాటిలో మచ్చుకు కొన్ని ఉదాహరణలు చూద్దాం.

● పిప్పలభద్ర నుంచి బీజేపురం (వర్క్ కోడ్ నెంబరు. 020080420043081835) గ్రావెల్ రోడ్డుకు రూ. 13,312లతో పాటు వేతనం కింద రూ.1,25,541 ఖర్చు చేసినట్లు చూపించారు. మళ్లీ ఇదే రోడ్డు కోసం వర్క్ కోడ్ నెంబరు 1352తో గ్రావెల్ రోడ్డుకు వేతనం కింద రూ.25,808లు, మెటీరియల్ కింద రూ.1,71,382 ఖర్చు చూపి నిధులు డ్రా చేశారు.

● వర్క్ కోడ్ నెంబరు 1834తో పిప్పలభద్ర నుంచి గెడ్డతిరువాడ గ్రావెల్ రోడ్డుకు రూ.40,515లు వేతనం కింద, రూ.3,71,679లు మెటీరియల్ రూపంలో ఖర్చు చూపారు. మళ్లీ వర్క్ కోడ్ నెంబరు 1504తో గెడ్డతిరువాడ నుంచి పిప్పలభద్ర వరకు గ్రావెల్ రోడ్డు నిర్మాణం పేరుతో రూ. 3,43,867లతో ఎస్టిమేట్లు వేసి పని మంజూరు చేయించారు. కానీ ఇంకా ఖర్చు చేసినట్లు చూపలేదు.

● వర్క్ కోడ్ నెంబరు 1833. పిప్పలభద్ర నుంచి గంగమ్మపేట గోర్జి వరకు రూ. 6,18,937లతో ఎస్టిమేట్లు వేసి మంజూరు చేయించారు. ఇది అప్పటికే మెటల్ రోడ్డు ఉంది. దీనిపై రూ. 34,848లు వేజ్, రూ. 3,00,908లు మెటీరియల్ కలిపి రూ. 3,35,756లు గ్రావెల్ వేసినట్లు బిల్లు డ్రా చేశారు.

● వర్క్ కోడ్ నెంబరు 1832తో పిప్పలభద్ర నుంచి ఇటిక గోర్జి వరకు రూ. 11,37,407లతో మరో రోడ్డుకు అంచనా వేసి మంజూరు చేశారు. ఈ రోడ్డుకు రూ.4,80,248 వేతనం కింద, మెటీరియల్ కింద రూ. 27,600 డ్రా చేసేశారు. ఇదే రోడ్డు చూపుతూ వర్క్ కోడ్ నెంబరు 1847తో పిప్పలభద్ర నుంచి ఇటిక వరకు రూ. 4,80,977లతో ఎస్టిమేట్లు వేసి పంపారు. తర్వాత నిధులు కూడా డ్రా చేశారు. ఒకే రోడ్డును రెండు రోడ్లుగా చూపుతూ ప్రభుత్వ నిధులు స్వాహా చేశారు.

● వర్క్ ఐడీ నెంబరు 1399తో శిఖబడి-లోతువానివలసకు గ్రావెల్ రోడ్డు వేసినట్లు రూ. 1,37,102 డ్రా చేశారు. వర్క్ ఐడీ నెంబరు 0097తో ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి లోతువానివలస రోడ్డుకు వేతనం కింద రూ. 40,120, మెటీరియల్ కింద రూ.2,66,801 డ్రా చేశారు. మళ్లీ లోతువానివలస నుంచి జోగులడుమ్మ పేరుతో రూ. 7,47,766లు రోడ్డు మంజూరు చేయించారు. ఈ మూడు రోడ్లు ఒకటే కావడం గమనార్హం.

● వర్క్ ఐడీ నెంబరు 1834తో పిప్పలభద్ర-జీటీవాడ రోడ్డుకు రూ. 40,515 వేజ్ రూపంలోనూ, రూ. 3,71,679ను మెటీరియల్ రూపంలోనూ డ్రా చేసేశారు. మళ్లీ వర్క్ ఐడీ నెంబరు 1504తో జీటీవాడ-పిప్పలభద్ర రోడ్డుకు రూ.3,43,867తో రోడ్డు మంజూరు చేసేశారు. ఈ రెండు రోడ్లు ఒక్కటే. ఇదే విధంగా అనేక రహదారులు మండలంలో నిర్మించారు. సర్పంచ్‌లు, ఉపాధి హామీ సిబ్బంది కుమ్మక్కై దాదాపు రూ. 50 లక్షలు వరకు స్వాహా చేసినట్టు విమర్శలు ఉన్నాయి.

విచారణ అవసరం

ప్రభుత్వం లింకు రోడ్ల పేర నిధులు మంజూరు చేస్తూ వచ్చింది. ఈ నిధులు దుర్వినియోగం అయినట్టు ఆధారాలు ఉన్నాయి. పూర్తిస్థాయిలో విచారణ అవసరం.

- దత్తి కామేశ్వరి, ఎంపీపీ, జియ్యమ్మవలస

దర్యాప్తు చేస్తే మంచిదే

గ్రావెల్ రోడ్డు పనులు నేను ఇక్కడకు రాకముందు జరిగాయి. వాటి పూర్తి సమాచారం నాకు తెలియదు. అవకతవకలు జరిగినట్లు అక్కడక్కడా విన్నాను. దీనిపై పూర్తి దర్యాప్తు జరిగితే మంచిదే.

- శ్యామ్‌సుందర్, ఇన్‌చార్జి ఎంపీడీవో, జియ్యమ్మవలస

గిరిజనాభివృద్ధికే వర్సిటీ

వద్ద వర్సిటీ ప్రహరీ నిర్మాణానికి శుక్రవారం మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన వర్సిటీ ఏర్పాటు కేంద్రం పరిధిలో ఉందని, త్వరలో పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందే అవకాశముందన్నారు. ఇందుకోసం ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలూ కృషిచేస్తున్నారన్నారు. సుమారు రూ.5కోట్ల అంచనా వ్యయంతో ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టడం శుభ పరిణామమని హర్షం వ్యక్తంచేశారు. గిరిజనుల సంక్షేమం, వారి అభ్యున్నతికి అన్నివిధాలా ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. వర్సిటీ ఏర్పాటుతో భూములు కోల్పోయిన రైతులకు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నామన్నారు. ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన లేఅవుట్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రస్తుతం పనులు జరుగుతున్నాయన్నారు. ఈ విషయం గిరిజనులంతా గమనించి సహకరించాలని సూచించారు. వర్సిటీ రాక వల్ల ఈ ప్రాంత అభివృద్ధితో పాటూ గిరిజనుల జీవన విధానాల్లో సమూల మార్పులు వస్తాయన్నారు. వర్సిటీకి కేంద్ర ఆమోదం అనంతరం తరగతులు ప్రారంభమయ్యేందుకు అవకాశముందన్నారు. వర్సిటీ భూముల్లో సాగులో ఉన్న 178మంది రైతులకు న్యాయం జరిగే దిశగా చర్యలు చేపట్టామన్నారు. భూమిని కోల్పోతున్న గిరిజనులకు ప్రత్యామ్నాయంగా ఇదే సర్వే నెంబర్లోసాగుచేసుకునేందుకు వీలుగా భూమిని ఇస్తామన్నారు. పూర్తి హక్కును కల్పిస్తూ రైతులకు పట్టాలు మంజూరుచేస్తామని మంత్రి మరోమారు హామీఇచ్చారు. 152 కుటుంబాలకు 2.5 సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు మంజూరుచేస్తామన్నారు. కలెక్టర్ వివేక్‌యాదవ్ మాట్లాడుతూ గిరిజన వర్సిటీ ఏర్పాటు ఓ బృహత్తరమైనదిగా పేర్కొన్నారు. వర్సిటీ నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతం ఎంతగానో అభివృద్ధి చెందుతుందన్నారు. ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ వర్సిటీ ఏర్పాటుకు స్థల సేకరణలో గిరిజనులంతా సహకరించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీవో జి.శ్రీనివాసమూర్తి, మండల ప్రత్యేకాధికారి వై.సింహచలం, తహసీల్దార్‌లు కె.శ్రీనివాసరావు, జే.రాములమ్మ, ఎమ్పీడీఓ నారాయణరావు, టీడీపీ ఎస్.కోట నియోజకవర్గ సమన్వయకర్త కెబిఏ రాంప్రసాద్, జడ్పీటీసీలు కోళ్ల రమణమ్మ, కరెడ్ల ఈశ్వరరావు, ఎంపీపీ పి.రాజన్న తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే న్యాయం చేయండి

వర్సిటీ ఏర్పాటుతో భూములు కోల్పోయిన రైతులకు, వారి కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలుచేసి వారికి న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు టి.అప్పలరాజుదొర డిమాండ్ చేశారు. సభాప్రాంగణంలో ప్రభుత్వ తీరుకు తొలుత నిరసన తెలిపారు. హామీలను మరిచి హడావిడిగా ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేయడాన్ని తప్పుబట్టారు.

తొలి అడుగు

తర్వాత కీలక అడుగు పడింది. దీనికి ముందు రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. విశ్వ విద్యాలయం కోసం సేకరించిన భూముల్లో మామిడి, జీడిమామిడి వంటి పండ్లతోటలను పెంచుకుంటూ జీవనం సాగిస్తున్న గిరిజన కుటుంబాల నుంచి తీవ్ర అభ్యంతరం వ్యక్తమైంది. ఆ భూములను చూసేందుకు కేంద్ర, రాష్ట్ర, జిల్లాల నుంచి ప్రతినిధులు వచ్చినప్పుడల్లా వీరు ఆందోళనకు దిగేవారు. వాటన్నింటినీ ఎమ్మెల్యే లలితకుమారి సావధానంగా పరిష్కరించారు. ప్రత్యామ్నాయంగా భూములను ఇచ్చేందుకు ఒప్పించారు. ఎంతెంత భూమిని గిరిజనులు సాగు చేస్తున్నారో.. అంతే భూమిని ఇదే సర్వే నెంబర్‌లో విశ్వ విద్యాలయానికి సేకరించగా మిగిలిన భూమిలో ఇచ్చేందుకు అంగీకరించారు. దీంతో పాటు ఇళ్లు లేని వారికి ఇళ్ల స్థలాలు కేటాయించేందుకూ అధికారులు ముందుకు వచ్చారు. నెల రోజుల కిందట వర్సిటీ స్థలాన్ని చూసేందుకు వచ్చిన మంత్రి సుజయ్ కృష్ణ రంగారావుతోను ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం కలెక్టర్, ఇతర రెవెన్యూ అధికారులతో చర్చించి గిరిజనులను శాంతపరిచారు. ప్రత్యామ్నాయంగా చూపించిన భూములను ఉపాధి హామీ నిధులతో చదును చేసే పనులు జరుగుతున్నాయి. ఈ భూముల్లోకి రాకపోకలు సాగించేందుకు వీలుగా రహదారి నిర్మాణ పనులు చేపడుతున్నారు. దీంతో భూసేకరణకు సంబంధించిన సమస్యలు సమసిపోయాయి. వచ్చే ఏడాది నుంచైనా విశ్వవిద్యాలయ తరగతులు నిర్వహించాలన్న కృతనిశ్చయంతో వున్నారు. అయితే రాష్ట్ర విభజన చట్ట ప్రకారం గిరిజన విశ్వ విద్యాలయం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చినప్పటికీ పార్లమెంటు ఆమోదం తప్పనిసరి. బిల్లును ఎప్పుడు ప్రవేశపెడతున్నదీ కేంద్ర ప్రభుత్వం ఇంతవరకు తేల్చలేదు. రాష్ట్రానికి వస్తున్న కేంద్ర మంత్రులు, విశాఖపట్టణం లోక్‌సభ సభ్యుడు కంభంపాటి హరి బాబు మాత్రం విశ్వ విద్యాలయం ఏర్పాటు తథ్యమని చెబుతున్నారు. వచ్చే ఏడాదికైనా ప్రవేశాలు వుంటాయో.. లేవో అన్న విషయాన్ని మాత్రం ఎవరూ చెప్పలేకపోతున్నారు. ఇకపోతే ఇక్కడ విశ్వ విద్యాలయ నిర్మాణానికి రూ.100కోట్ల వరకు అవసరమని అంచనా. గత ఏడాది కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ నుంచి కేవలం రూ.5కోట్లు కేటాయించారు. ఆ తరువాత ఒక రూపాయి కూడ విదల్చలేదు.




గిరిజన యూనివర్సిటీ ప్రతిపాదిత స్థలం

చికెన్ ధరలు



	బాయిలర్	వెన్‌కాబ్
రిటైల్‌ధర	85	75
విత్‌స్కిన్	140	125
స్కిన్‌లెస్	150	147

కోడి గుడ్లు (నెక్)



విశాఖపట్నం	రూ.360
విజయనగరం	రూ.364
శ్రీకాకుళం	రూ.364

జంబ్లింగ్ వర్డ్స్

1. LBOD ▸..........................
2. SGNI ▸..........................
3. FTLI ▸..........................
4. CPYO ▸..........................

జంతర్‌మంతర్

1. విలయంద్యా ▸..........................
2. వేశంమాస ▸..........................
3. కాగారారం ▸..........................
4. వాదేయంల ▸..........................


చెప్పగలరా?

ఆదిలో ఉన్నా
కానీ మదిలో లేను
యుగంలో ఉన్నా
కానీ సగంలో లేను
నీవులో ఉన్నా కానీ నీరులో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో
చెప్పగలరా?

సూక్తి

తెలియని విషయం గురించి మాట్లాడటం అంటే - నీ అవివేకాన్ని బయటపెట్టుకోవడమే!

చుక్కలు కలపండి



World Photography Day

స్మైల్ ప్లీజ్





ఇంటి పండుగైనా.. బంధువుల ఇంట వేడుకైనా.. నలుగురు కలిసిన ఏ వేళైనా.. ఫొటో క్లిక్‌మంటుంది. అందమైన జ్ఞాపకం కెమెరా కన్నుల్లో మరింత అందంగా ముస్తాబవుతుంది. ఎన్నో భావాలకు, మరెన్నో మధురానుభూతులకు సాక్ష్యంగా నిలిచేది ఫొటో. ప్రకృతి అందాలు, పక్షుల సోయగాలు, సెలయేళ్ల హొయలు, నదీనదాల పరవళ్లు, ఆకాశ అద్భుతాలు, నేలమ్మ ఆనందాలు.. అన్నింటినీ ఇట్టే బంధించేస్తుంది కెమెరా. ఇప్పుడెందుకు ఫొటో ముచ్చట్లు అంటే.. ఈ రోజు 'ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం'!

సెల్ఫీ.. సెన్సేషన్ సృష్టించినా.. సెల్ఫీ గ్రూపులు కట్టినా.. ఫొటోకు సాటి రావు. మానవ జీవితంలో ఫొటోగ్రఫీకి విడదీయలేని అనుబంధం ఉంది. దానికి శతాబ్దాల చరిత్ర ఉంది. 18వ శతాబ్దంలో పారిస్‌లో నలుపు, తెలుపులతో ప్రారంభమైన ఫొటోగ్రఫీ కాలక్రమంలో రంగులు అద్దుకుంటూ కొత్తపుంతలు తొక్కుతోంది.

రెండు గ్రీకు పదాల కలయికే 'ఫొటోగ్రఫీ'. ఫొటో అంటే కాంతి, గ్రఫీ అంటే గీయడం అని అర్థాలు. 'ఫొటోగ్రఫీ' అంటే.. కాంతితో చిత్రాన్ని గీయడం.

ఫ్రాన్స్‌కు చెందిన లూయిస్ జె.ఎమ్. డాగ్యూరే, జోసెఫ్ నైస్‌ఫోరెలు 1837లో 'ఫొటోగ్రఫీ ప్రాసెస్'ను ప్రపంచానికి పరిచయం చేశారు. 'ఫ్రెంచ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్' డాగ్యూరే రూపొందించిన 'ఫొటోగ్రఫీ ప్రాసెస్'ను అధికారికంగా గుర్తించింది. ఆ తర్వాత 1839, ఆగస్టు 19న ఫ్రాన్స్ ప్రభుత్వం 'ఫొటోగ్రఫీ ప్రాసెస్' పేటెంట్ హక్కులను సొంతం చేసుకుని, ప్రపంచానికి ఉచిత బహుమతిగా అందించింది. అందుకే ప్రతి ఏటా ఆగస్టు 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం జరుపుతున్నారు.

మనదేశంలో 1857 వరకు ఫొటోగ్రఫీ అందుబాటులోకి రాలేదు. 1977 ముందు వరకు బ్రిటీష్ వాళ్లు, జమీందారులు, సిపాయిలు మాత్రమే ఫొటోలు తీసుకునేవారు. ఆ తర్వాత ఇది సామాన్యులకు అందుబాటులోకి వచ్చింది. లాలా దీనదయాళ్ భారత్‌లో తొలిసారిగా 'ఫొటోగ్రఫీ'కి శ్రీకారం చుట్టారు.

1860లో నలుపు, తెలుపు రంగుల ఫొటోలు కాస్త రంగుల్లోకి మారిపోయాయి. జేమ్స్ క్లార్క్ మ్యాక్స్‌వెల్ 'కలర్ ఫొటో'లకు ప్రాచుర్యం తెచ్చాడు.

- 1988లో మొదటి డిజిటల్ కెమెరా (ఫ్యూజీ డీఎస్-1పీ) అందుబాటులోకి వచ్చింది. ఫొటోను కంప్యూటరైజ్డ్ ఫైల్‌లో నిక్షిప్తం చేసుకునే సౌకర్యం వచ్చింది.
- మొదటి డిజిటల్ కెమెరాలో 1.4 మెగా పిక్సల్స్ మాత్రమే ఉండేది. ఆ కెమెరా ధర 10 వేల డాలర్లు.

స్మార్ట్ ఫోన్ రాక ముందు... ఎంతోమంది మెడలో కెమెరా వేసుకుని, లెన్స్ జూమ్ చేస్తూ.. తమకు ఇష్టమైన వాటిని ఫొటోలు తీస్తుండేవారు. అదో గొప్ప కళగా భావించేవారు. రాను రాను జనాలు కెమెరాలు కొనడం మానేశారు. కానీ ఆనాటి తరం కెమెరాల నుంచి ఈ నాటి అత్యాధునిక కెమెరాల వరకు అన్నింటికి చోటు కల్పిస్తూ హర్యానాలోని చక్కర్‌పుర్‌లో 'వింటేజ్ కెమెరా మ్యూజియం' ఇటీవలే ప్రారంభమంది. మనదేశంలోనే ఇది అతి పెద్దది కావడం విశేషం. దాదాపు ఇందులో 700 కెమెరాలు ప్రదర్శనకు ఉంచారు. 100 ఏళ్ల నాటి కెమెరాలను కూడా ఇక్కడ చూడొచ్చు. ఆదిత్యా ఆర్య అనే ఫొటోగ్రాఫర్ వీటిని సేకరించారు.




ప్రపంచంలోనే అతి ఎక్కువ ధర పలికిన కెమెరా 'డాగ్యురే టైప్'. ఇది 168 సంవత్సరాల క్రితం నాటిది. దీని ధర దాదాపు లక్షా ముప్పై రెండు వేల డాలర్లు కావడం విశేషం.

ఔనా!



కాకుల గుంపును 'మర్డర్' అంటారు.

బొమ్మ గీయండి



మీకు తెలుసా?



ఉరుములకు ఆడవారి కన్నా మగవారే 5 రెట్లు ఎక్కువ ఉలిక్కిపడతారు.

టంగ్ ట్విస్టర్స్

1. How many yaks could a yak pack pack if a yak pack could pack yaks?
2. There's a sandwich on the sand which was sent by a sane witch.
3. There was a little witch which switched from Chichester to Ipswich.

నవ్వుల్ నవ్వుల్


టీచర్ : ఏమ్మా! రాణీ! స్కూలుకు ఇంత ఆలస్యంగా వచ్చావేమిటి?
రాణి : మా నాన్నగారు రోడ్డు చూసుకుంటూ వెళ్లమన్నారు టీచర్! రోడ్డంతా చూస్తూ వచ్చేసరికి ఈ సమయమైంది.
టీచర్ : !!!!!!!!!!

రంగులు వేయండి



క్రాస్ వర్డ్

music editing | sound reports | voice weather | sports announce



జవాబులు

చెప్పగలరా? : ఆయువు
జంబ్లింగ్ వర్డ్స్ : 1. BOLD 2. SIGN 3. LIFT 4. COPY
జంతర్‌మంతర్ : 1.విద్యాలయం 2. సమావేశం 3. కారాగారం 4. దేవాలయం

పైడితల్లికి కూరగాయల అలంకరణ

విజయనగరం రూరల్: శ్రావణ మాసం చివరి శుక్రవారం పురష్కరించుకుని పట్టణంలో కొలువుదీరిన చదురుగుడి పైడితల్లి అమ్మవారిని కూరగాయలతో అలంకరించారు. టమోటా, వంగ, దొండ, కాకర తదితర కూరగాయలతో సర్వంగా సుందరంగా అలంకరణ చేశారు. దీంతో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయం వద్ద బారులుదీరారు. అలాగే ప్రత్యేక పూజలు చేశారు. ఎక్కడ ఎటువంటి సంఘటనలు తలెత్తకుండా ఆలయ ఈవో భానురాజా, అర్చకులు తగు ఏర్పాట్లు చేశారు.



'రైతే బాహుబలి'కి ప్రశంసలు!

● సినీ బృందానికి ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అవార్డు ప్రదానం

వేపాడ: సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి అందించిన దండాలయ్య బాహుబలి పాటస్ఫూర్తితో సినీ దర్శకుడు పీసీ ఆదిత్య రూపొందించిన రైతే బాహుబలి దృశ్య గీతానికి జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంటుంది. దేశానికి వెన్నెముక అయిన రైతు జీవన శైలిని వర్ణిస్తూ తీసిన దృశ్య గీతాన్ని తిలకించిన శిఖరం ఆర్ట్స్ థియేటర్స్ యాజమాన్యం దర్శకుడు ఆదిత్యను, నిర్మాత రావుల మోహనరెడ్డిని, ఫొటోగ్రాఫర్ ఎం.అరవింద రెడ్డిని అభినందించారు. ఈ సందర్భంగా శిఖరం యాజమాన్యం తరుపున ప్రశంసా పత్రాన్ని శుక్రవారం ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ దర్శకుడు ఆదిత్యకు అందజేశారు. వీడియోను హిందీలోకి కూడా అనువదించాలని కేజ్రీవాల్ కోరినట్టు ఆదిత్య విలేఖరులకు తెలిపారు. దేశ వ్యాప్తంగా ఆదరణ రావడం ఆనందంగా ఉందన్నారు.



కేజ్రీవాల్ నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న దర్శకుడు ఆదిత్య

హరికథకు 'ఆది'భట్ల!

● నారాయణదాసు విగ్రహాన్ని ఆవిష్కరించిన మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల



విగ్రహానికి హారతి ఇస్తున్న దృశ్యం



ఆదిభట్ల విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న చైర్మన్ ప్రసాదుల

విజయనగరం టౌన్: పట్టణంలోని గాంధీ పార్క్‌లో హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు విగ్రహాన్ని శుక్రవారం మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చైర్మన్ ప్రసాదుల మాట్లాడుతూ, హరికథను విస్తృతపరిచిన ఆదిభట్ల.. జిల్లా పేరును ఇనుమడింపజేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కనకల మురళీమోహన్, కమిషనర్ కనకమహాలక్ష్మి, ఆదిభట్ల ఉత్సవ సంఘం ప్రతినిధులు డాక్టరు ఎ.గోపాలరావు, పీవీ నరసింహరాజు, సంగీత కళాశాల ప్రిన్సిపల్ అనురాధ పరుశురామ్, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు బీఏ నారాయణ, ప్రధాన కార్యదర్శి బూరాడ శ్రీనివాసరావు, స్థలదాత పేర్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం హరికథా భాగవతారిణీలు కాళ్ల నిర్మలభాగవతారిణి, పి.కళ్యాణి నారాయణదాసు రచించిన కీర్తనలు అలపించారు.

ఇదిలా ఉండగా, కొన్ని రోజుల క్రితం నారాయణదాసు విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. దీంతో కళాకారులు, సాహితీవేత్తలు ఆందోళన చేపట్టారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లగా, ఘటనపై దర్యాప్తు చేయించాలని అదేశాలు జారీ చేశారు. దుండగులు ధ్వంసం చేసిన విగ్రహ స్థానంలోనే కొత్త విగ్రహాన్ని స్థాపించాలని కలెక్టర్ వివేక్ యాదవ్‌కు సూచించారు. ఈ బాధ్యతలను కలెక్టర్ మున్సిపాల్టీకి అప్పగించి, రూ.50 వేలు మంజూరు చేశారు. దీంతో కథ సుఖాంతమైంది.

● రేపటి నుంచి జయంత్యుత్సవాలు

ఆదిభట్ల నారాయణదాసు 153వ జయంత్యుత్సవాలు శనివారం నుంచి పట్టణ లయన్స్ కమ్యూనిటీ హాల్‌లోని నిర్వహిస్తున్నామని ఆదిభట్ల ఆరాధనోత్సవ సంఘం అధ్యక్షుడు పీవీ నరసింహరాజు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావులు తెలిపారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన వర్ధమాన, సీనియర్ హరికథా భగవాతార్‌లను అహ్వానిస్తున్నట్టు చెప్పారు. అలాగే ముగింపు రోజున తిరుపతికి చెందిన జయంతి సావిత్రి భాగవతారిణికి హరికథా చూడామణి బిరుదు ప్రదానం చేస్తున్నట్టు గోపాలరావు తెలిపారు.

ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్స్‌కు శిక్షణ

డెంకాడ: చింతలవలస వద్ద గల 5వ బెటాలియన్ ట్రైనింగ్ సెంటర్‌లో ఆర్మ్‌డ్ కానిస్టేబుల్స్‌కు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఎస్పీ పాలరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, 206 మంది ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్స్‌కు 9 నెలల పాటు శిక్షణ కొనసాగుతుందని, శిక్షణలో మెలకువలు నేర్చుకుని, భవిష్యత్‌లో ఎదురయ్యే ఆటంకాలు అధిగమించే విధంగా శిక్షణ పొందాలని, ప్రజలకు న్యాయం జరిగేలా విధులు నిర్వహించి, వృత్తి విశిష్టతను, గొప్పదనాన్ని కాపాడాలని కోరారు. అదేవిధంగా సంఘం విద్రోహ శక్తులను, తీవ్రవాద సమస్యలను చాకచక్యంగా, నేర్పుతో ఎదుర్కోవాలని సూచించారు. ఈ శిక్షణకు శ్రీకాకుళం, విశాఖ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, విజయనగరం జిల్లాలకు చెందిన మొత్తం 206 మంది హాజరైనట్టు బెటాలియన్ డీఐజీ కె.సూర్యచంద్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి కమాండెంట్ బీవీ సత్యనారాయణ, జీవీ ప్రభాకరరావు, డీఎస్పీలు పి.నరసింహరాజు, కె.తిరుమలరావు, ఆర్ఐ రవీంద్ర కుమార్ పాల్గొన్నారు.



జ్ఞాపికను అందుకుంటున్న ఎస్పీ పాలరాజు



పర్యాటక పనులు వేగవంతం చేయండి

సుంకి (గరుగుబిల్లి): తోటపల్లి ప్రాజెక్టు పరిధిలో పర్యాటక పనులు వేగవంతం చేయాలని పార్వతీపురం ఐటీడీఏ పీవో డాక్టర్ లక్ష్మీశ అధికారులకు సూచించారు. శుక్రవారం ప్రాజెక్టు కుడి మట్టికట్టకు ఆనుకుని ఉన్న ప్రాంతంలో చేస్తున్న పనులను ఆయన పరిశీలించి, మాట్లాడారు. ప్రాజెక్టు ప్రాంతం పర్యాటకానికి అనువుగా ఉండటంతో అభివృద్ధి చేసేందుకు దృష్టి సారించామన్నారు. మొక్కలు నాటి ఆహ్లాదకరంగా ఉండేలా పారు తయారు చేయాలని, తాగునీరు, మరుగుదొడ్లతో పాటు పర్యాటకులు కూర్చొనేందుకు సౌకర్యాల పనులు వేగవంతం చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ఈఈ కుమార్‌కు సూచించారు.



సుంకి ప్రాంతంలో పనులను పరిశీలిస్తున్న పీవో లక్ష్మీశ



తహసీల్దార్ లక్ష్మారెడ్డితో మాట్లాడుతున్న కొవ్వాడ గ్రామస్థులు

నష్టపరిహారంపై కొవ్వాడ గ్రామస్థుల ఆరా

భోగాపురం: మండలంలో నూతనంగా నిర్మించనున్న అంతర్జాతీయ విమానాశ్రయ ఏర్పాటులో భూములు కోల్పోయిన రైతులకు ఏ విధంగా నష్టపరిహారం అందజేశారని తెలుసుకోవడానికి శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం కొవ్వాడ గ్రామస్థులు శుక్రవారం భోగాపురం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్ధార్ లక్ష్మారెడ్డిని కలిశారు. కొవ్వాడ గ్రామంలో ఏర్పాటు చేయనున్న అణు రియాక్టర్‌కు సంబంధించి రైతుల నుంచి భూములు తీసుకొంటున్నారని, అక్కడ డీపట్టా, జిరాయితీకి ఒకే విధంగా ఎకరాకు రూ.18 లక్షలు పరిహారం అందజేస్తామంటున్నారని, అయితే ఇక్కడ తీసుకొన్న భూములకు పరిహారంతోపాటు ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇస్తున్నట్టు తెలిసిందని, ఇది ఎంతవరకు వాస్తవమని తహసీల్దార్‌ని అడిగి తెలుసుకొన్నారు.



వాహనదారులకు అపరాధ రుసుం

బాడంగి: సరైన ధ్రువపత్రాలు లేనివారికి 22 మంది వాహనదారులకు అపరాధ రుసుం విధించినట్టు ఎస్‌ఐ డి.రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బాడంగిలో వాహన తనిఖీ లు చేశారు. ప్రతి ఒక్క వాహనదారుడు ధ్రువపత్రాలతోపాటు హెల్మెట్ విధిగా ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. గ్రామాల్లో మద్యం, ఖైనీలు, గుట్కాలు విక్రయిస్తున్నట్టు సమాచారం ఇస్తే, దాడుల చేస్తామని తెలిపారు. తెలియజేసే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు.



వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ జనార్దనరావు

సమస్యల పరిష్కారానికే సదస్సులు

రేజేరు(బాడంగి): రైతు సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ జనార్దనరావు తెలిపారు. శుక్రవారం రేజేరులో రైతు సేవలో రెవెన్యూ శాఖ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు సంబంధించిన ప్రతి ఒక్క సమస్యను పరిష్కరిస్తామని, దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అనంతరం రైతుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సమావేశంలో ఆర్ఐ చంద్రశేఖర్, సర్వేయర్ చంద్రశేఖర్, వీఆర్వోలు చిట్టయ్య, రామకృష్ణ రైతులు పాల్గొన్నారు.

ఆధునిక విధానాలతో అధిక దిగుబడులు

భూసాయవలస(రామభద్రపురం): వేరుశనగ సాగులో ఆధునిక విధానాలు అవలంభించి, అధిక దిగుబడులు సాధించాలని ఏవో అనురాధ పండా రైతులకు సూచించారు. శుక్రవారం భూసాయవలసలో వేరుశనగ పంటపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నూతన విధానాలపై అవగాహన కల్పించారు. భూమిలో తేమ శాతం, ఎరువుల ఆవశ్యకత, చీడపీడలు, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మెలకువలు పాటిస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చన్నారు. వేరుశనగ పంటకు పూత దశలో జిప్సం వేస్తే ఊడలు దిగి, నాణ్యమైన గింజతో పాటు కాయబరువు పెరిగి, నూనె శాతం ఎక్కువగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు సురేష్, పుష్పలత, ఎంపీఈవోలు లత, గణపతి పాల్గొన్నారు.

● లింగాకర్షక బుట్టలు ఏర్పాటు

జీఎస్‌పురం(బొబ్బిలి రూరల్): చంద్రన్న రైతు క్షేత్రంలో భాగంగా శుక్రవారం జీఎస్ పురంలో ఏవో ఎం.శ్యాంసుందరరావు ఆధ్వర్యంలో లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బట్టులు రైతులకు ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందని, ఎకరానికి ఆరు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వీటి వలన వరి పంటకు హానిచేసే కాండం తొలుచే పురుగు, ముడత పురుగులు, రెక్క పురుగుల నివారణకు వీలుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు బి.జోగినాయుడు, వి.ఇందిర, రామ్మూర్తి, గిరిజ, ఎంపీఈవోలు, సీఏలు ప్రభాకర్‌రావు, వాండ్రాసి లక్ష్మి పాల్గొన్నారు.

పశు బీమా పరిహారం అందజేత

రామభద్రపురం: పశు బీమా పథకంలో చేరిన విశాఖ డెయిరీకి చెందిన పాడి రైతులకు శుక్రవారం రామభద్రపురం కార్యాలయంలో బీమా పరిహారం కింద సుమారు రూ.14.50 లక్షలు మేనేజర్ వరప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుఖీభవ కార్డు కలిగిన రైతులు పాడిపశువులకు బీమా చేసుకోవాలని కోరారు. మేలుజాతి పాడిపశువులను పోషించి, క్షీర విప్లవానికి తోడ్పాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు దేముడు, దుర్గారావు, సూర్యగణేష్, రవి, పాడిరైతులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు

రామభద్రపురం: శ్రావణ మాసం చివరి శుక్రవారం పురష్కరించుకుని భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి భక్తులు బారులుదీరడంతో ఆరికతోట, రామభద్రపురం, రొంపల్లి, కొట్టక్కి, సీతారాంపురం, భూసాయవలస ఆలయాలు కిటకిటలాడాయి. ఈ సందర్భంగా కుంకుమ పూజలు, పాలాభిషేకాలు చేశారు. శ్రీరామనగర్ కాలనీ దుర్గాదేవి ఆలయంలో విశేష పూజలు, అన్నసమారాధన చేపట్టారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

2019 ఎన్నికలు ఏకపక్షం కావాలి

● ఆ దిశగా పార్టీని బలోపేతం చేయండి

● నాయకులకు మంత్రి రంగారావు ఆదేశం

బొబ్బిలి: 2019 సాధారణ ఎన్నికలు ఏకపక్షం కావాలని, టీడీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర గనులశాఖ మంత్రి సుజయకృష్ణ రంగారావు పిలుపునిచ్చారు. పార్టీ పట్టణ అధ్యక్షుడిగా రాంబార్కి శరత్‌కుమార్ పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శుక్రవారం బొబ్బిలి కోటలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మంత్రి రంగారావు మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న కార్యవర్గాలు 2019 సాధారణ ఎన్నికల వరకు ఉంటాయని, ఈ సమయంలో ప్రతి సభ్యుడు సైనికుల్లా పనిచేయాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రోజుకు 16 నుంచి 18 గంటలు కష్టపడుతున్నారని, కార్యకర్తలు కనీసం రోజుకు 4 నుంచి 5 గంటలు కష్టపడి, చంద్రబాబు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు వివరించాలని కోరారు. ప్రజల్లో 80 శాతం మద్దతు టీడీపీకి కూడగట్టాలన్నది చంద్రబాబు ఆశయమని, ఆయన ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పనిచేయాలన్నారు. పార్టీ నియమావళి ప్రకారం ప్రతి నెల గ్రామ, వార్డు, మండల, జిల్లా కమిటీలతో పాటు సమన్వయ కమిటీల సమావేశాలు నిర్వహించి, సమస్యలపై చర్చించిపై నాయకత్వానికి తెలియజేయాలన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు శరత్ కుమార్ పార్టీలోని అన్ని వర్గాలను కలుపుకుని, పార్టీ అభివృద్ధి కోసం పనిచేయాలని సూచించారు.

బొబ్బిలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి తెంటు లక్ష్మునాయుడు మాట్లాడుతూ, 2019 ఎన్నికల్లో చరిత్రను సృష్టించాలని, బొబ్బిలికి ఎంత చరిత్ర ఉందో 2019 సాధారణ ఎన్నికల్లో సుజయకృష్ణరంగారావును గెలిపించి, మరో చరిత్ర సృష్టించాలని కోరారు. కార్యకర్తల మధ్య విభేదాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, పట్టు విడుపులు వదిలి పనిచేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తూముల అచ్యుతవల్లి మాట్లాడుతూ, పట్టణంలో పార్టీని బలోపేతం చేసేందుకు పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. విజయం సాధించేందుకు ఇప్పటి నుంచి ప్రణాళికలు రూపొందించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రంగారావు, ప్రమాణ స్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

టీడీపీ కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి తూముల భాస్కరరావు మాట్లాడుతూ, బొబ్బిలి నియోజక వర్గంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మంచి నమ్మకం ఉందని, ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా రంగారావుకు విజయాన్ని అందించాలని కోరారు. దీనికి మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు కృషి అవసరమన్నారు. అనంతరం నూతన కార్యవర్గంచే చైర్‌పర్సన్ అచ్యుతవల్లి ప్రమాణ స్వీకారం చేయించారు. అంతకుముందు శరత్‌కుమార్ ఇంటి వద్ద నుంచి బొబ్బిలి కోట వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చోడిగంజి రమేష్‌నాయుడు, ఏఎంసీ చైర్మన్ పువ్వల శ్రీనివాసరావు, కౌన్సిలర్‌లు రౌతు రామ్మూర్తినాయుడు, సుంకరి సాయిరమేష్, బొబ్బాది తవిటినాయుడు పాల్గొన్నారు.

● నూతన కార్యవర్గం

టీడీపీ పట్టణ అధ్యక్షుడిగా రాంబార్కి శరత్, ఉపాధ్యక్షులుగా కేతిరెడ్డి కృష్ణమూర్తి, కాకల వెంకటరావు, ప్రధాన కార్యదర్శిగా తెంటు శివప్పలనాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా కోట పెదరాములు, బొబ్బిలి రాములు, కార్యదర్శులుగా బంటు స్వామినాయుడు, నాగిరెడ్డి అరుణ, కోశాధికారిగా వజ్జి చిన్నారావుతో పాటు మరో 20 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రీస్కూల్ పిల్లలకు కార్పొరేట్ విద్య

● చైర్‌పర్సన్ తూముల అచ్యుతవల్లి

బొబ్బిలి: మున్సిపాల్టీలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలను కలిపి ఒక ప్రీస్కూల్‌గా ఏర్పాటు చేసి, పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందించేలా చర్యలు తీసుకుంటున్నట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ తూముల అచ్యుతవల్లి అన్నారు. శుక్రవారం ఆమె సిరివరపువీధి, రావువారివీధి, జెండావీధి, స్వామివారి వీధుల్లో ప్రీస్కూల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పేద పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రీస్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీలకు మూడు అంగన్‌వాడీ కేంద్రాల నుంచి కార్యకర్తలను ఏర్పాటు చేస్తున్నామని, వీరు చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు విద్యను అందించాలన్నారు. ఆడుతూ పాడుతూ పనిచేస్తే కుదరదని, చిన్నారులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. వైస్‌చైర్మన్ చోడిగంజి రమేష్‌నాయుడు మాట్లాడుతూ, చిన్నారులను సొంత పిల్లల్లా చూసుకుని విద్యాబుద్ధులు నేర్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రేజేటి కృష్ణవేణి, ఐసీడీఎస్ పీవో పి.సుశీల, సూపరువైజర్‌లు పూర్ణిమ, గోపమ్మ, కార్యకర్తలు లంక లక్ష్మి, శోభ, జయలక్ష్మి, నాగమణి, హుసేన్‌బీ, గౌరి, టీడీపీ కమిటీ సభ్యులు తీగల వెంకన్న, చింతాడ రవి, రేజేటి విశ్వేశ్వరరావు, గంగుల మధన్‌మోహన్, బండయ్య పాల్గొన్నారు.



ప్రీస్కూల్ ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ అచ్యుతవల్లి

శుద్ధ జలంతో వ్యాధుల దూరం

రొంపల్లి (రామభద్రపురం): రొంపల్లి గ్రామ పంచాయతీలో నిర్మించిన ఎన్టీఆర్ సుజలస్రవంతి యూనిట్‌ను శుక్రవారం ఎంపీపీ అప్పికొండ శ్రీరాములునాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ టీఎంకే రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజారోగ్య పరిరక్షణకు శుద్ధజలం ముఖ్యమని భావించిన సీఎం చంద్రబాబు నాయుడు ఎన్టీఆర్ సుజలస్రవంతి పథకాన్ని ప్రవేశపెట్టారని, దీంతో గ్రామీణులకు రూ.2కే శుద్ధజలం అందుతుందన్నారు. పంచాయతీ నిధులు ఖర్చు చేసి, ఆర్‌వో ప్లాంట్ నిర్మాణానికి ముందుకు వస్తే అన్ని గ్రామాల్లో ప్లాంట్లు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనారోగ్యాల బారిన పడకుండా ప్యూరిఫైడ్ నీటిని తాగాలని ప్రజలకు సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు శుద్ధజలం దోహదపడుతుందని సర్పంచ్ రాధిక తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పువ్వల మురళీమనోహర్, నారాయణరావు, పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.



ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ

ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఆర్‌వీ పద్మజ

బొబ్బిలి రూరల్: రామభద్రపురం ఎంపీడీవో ఆర్‌వీ పద్మజ బొబ్బిలి ఇన్‌చార్జి ఎంపీడీవోగా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన త్రినాథరావు బొబ్బిలి మండల కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా కొనసాగుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తెర్లాం: ఎంఆర్ అగ్రహారం గ్యాస్ ఏజెన్సీ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఇదే గ్రామానికి చెందిన గాలి వెంటరావు (48) గురువారం రాత్రి ఆర్‌ఆర్ రోడ్డుపై నడిచి వెళ్తుండగా, అదే గ్రామానికి చెందిన బొద్దాన రవి వెనుక నుంచి ఆటోతో ఢీకొన్నాడు. దీంతో వెంకటరావుకు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం స్థానికులు రాజాం కేర్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్టు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఎస్‌ఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ సమాచారం

ఈనెల 16న బుక్ చేసుకున్న బొబ్బిలి శ్రీవెంకటేశ్వర గ్యాస్ ఏజెన్సీ పరిధిలో బొబ్బిలి రూరల్, బాడంగి, మక్కువ, తెర్లాం, సీతానగరం, రామభద్రపురం, బలిజిపేట మండలాల వినియోగదారులకు, ఈనెల 17న బుక్ చేసిన బొబ్బిలి పట్టణ వినియోగదారులకు శనివారం గ్యాస్ సరఫరా చేస్తారు.

బొబ్బిలిలో సినిమాలు

సాయిగణపతి	- ఆనందోబ్రహ్మ
శ్రీవాసవి	- జయ జానకి నాయక
వెంకటకృష్ణ	- ఫిదా
వెంకటేష్	- భూతాల దిబ్బ
శ్రీలక్ష్మి	- నేనే రాజు నేనే మంత్రి

వృద్ధులకు నగదు వితరణ

దాసన్నపేట: నిర్లక్ష్యానికి గురైన వృద్ధులను అక్కున చేర్చుకుంటున్న వృద్ధాశ్రమాలకు చేయూతనందించడం సామాజిక బాధ్యతని విజయనగరానికి చెందిన విశ్రాంత రైల్వే ఉద్యోగి కొండారాజు అన్నారు. పట్టణంలోని కంటోన్మెంట్‌లో ఉన్న ఎస్వీఎస్ వృద్ధాశ్రమాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. రూ.5వేలు నగదును నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులకు సేవ చేసేందుకు ముందుకురావాలని కోరారు. ఈ నగదుతో వృద్ధులకు భోజనం, వసతి కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకుడు ఆంజనేయులు, విశ్రాంత ఉద్యోగి మార్ల రఘుకుమార్, వృద్ధాశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు బేజార్లు!

● సదుపాయాల కల్పనలో ప్రభుత్వం విఫలం ● శిథిలావస్థలో షెడ్లు ● నిధులున్నా నోచుకోని అభివృద్ధి ● అవస్థలకు గురవుతున్న కొనుగోలు, విక్రయదారులు ● చోద్యం చూస్తున్న అధికారులు



రైతుబజార్‌లో వరండాపై విక్రయాలు

విజయనగరం టౌన్: రైతులు దళారీల బారిన పడకుండా నేరుగా కూరగాయలు విక్రయించేందుకు ప్రభుత్వం రైతుబజార్లను ఏర్పాటు చేసింది. ఇక్కడ కనీస సదుపాయాలు కల్పించకపోవడంతో కొనుగోలుదారులతో పాటు విక్రయదారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. విజయనగరం పట్టణంలో ఆర్అండ్‌బీ రోడ్డు, దాసన్నపేట రింగురోడ్డు, తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతుబజార్లను ఏర్పాటు చేశారు. షెడ్డులు, స్టోర్ రూమ్‌లు లేకపోవడంతో కూరగాయలను దాచుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు.

మాన్సాస్ స్థలంలో నిర్వహణ

తహసీల్దారు కార్యాలయం రోడ్డులో వున్న రైతు బజారుకు సొంత స్థలం లేకుండా పోయింది. మాన్సాస్ స్థలంలో ఉంది. ఈ రైతుబజారు అభివృద్ధికి నిధులున్నా చేసేందుకు వీలు పడని పరిస్థితి. ఇక్కడ ఉన్న షాపులు ఎప్పుడూ ఖాళీగానే ఉంటాయి. కొనుగోలు దారులు ఎక్కువగా వస్తున్నా తాజా కూరగాయలు దొరకడం లేదు. ఈ రైతుబజారును రైల్వేస్టేషన్ రోడ్డుకు తరలించి అధునాతన సౌకర్యాలతో ఏర్పాటు చేస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదు.

ఆవరణలోనే షాపులు...

దాసన్నపేట రింగురోడ్డులోని ఉన్న రైతుబజారు నిత్యం కొనుగోలుదారులతో కిటకిటలాడుతుంటుంది.



ఆర్అండ్‌బీ రైతుబజారు ముఖద్వారం

రోడ్ల విస్తరణ కారణంగా కొంత స్థలం పోవడంతో షాపుల సంఖ్య తగ్గిపోయాయి. దీంతో బజారు ఆవరణలో రైతులు షాపులు ఏర్పాటు చేసుకుని కూరగాయలు విక్రయిస్తుంటారు. వర్షం పడితే బురదగా మారుతోంది. ఇక్కడ షాపులు నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉంది.

ఆర్అండ్‌బీ రైతు బజారుకు స్థల సమస్య

విజయనగరం పట్టణంలోని ఆర్అండ్‌బీ రైతుబజారుకి స్థల సమస్య ఉంది. పట్టణ నడిబొడ్డున ఉండడంతో ఈ బజారు నిత్యం రద్దీగా ఉంది. ఎక్కువ మంది కొనుగోలు దారులు రావడం స్థలం తక్కువతో ఇబ్బందులు ఎదురౌతున్నాయి. ఇక్కడ షాపులకు కూడా మంచి డిమాండ్ వుంది. షాపులు ఖాళీగా లేకపోవడంతో కిందనే వుండి కూరగాయలు విక్రయించుకుంటున్నారు. కూరగాయలు నిల్వ చేసుకునే గదులు లేవు. రేకుల షెడ్డుల్లోనే కూరగాయలను రైతులు విక్రయిస్తున్నారు. రేకులకు రంధ్రాలు పడడంతో వర్షం పడితే కూరగాయలు తడిసిపోతున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి రైతుబజార్లలో సదుపాయాల కల్పనపై దృష్టిసారించాల్సివుంది.



నిర్మాణంలో జనతాబజార్

జనతా బజార్ సిద్ధం

● రైతుబజారు తరహాలో షాపులు ● రోడ్ల విస్తరణలో షాపులు కోల్పోయిన వారికి ప్రాధాన్యం

విజయనగరం టౌన్: జిల్లా కేంద్రంలో జనతాబజారు నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధమైంది. ఏడాది కిందట భవన నిర్మాణం ప్రారంభమైంది. తొలివిడతగా 72మందికి ఇక్కడ షాపులు కేటాయించే అవకాశం ఉంది. రోడ్ల విస్త రణలో భాగంగా షాపులు కోల్పోయేవారికి, మున్సిపల్ కార్యా లయం ఎదుట వున్న ట్రాఫిక్ ఐలాండ్ నుంచి గణేష్ ఆల యానికి వెళ్లే దారిలో వున్న ఫుట్‌పాత్‌పై వ్యాపారం చేసే కాయగూరల వ్యాపారులతో పాటు మరికొంతమందికి ఇక్కడ షాపులు కేటాయించే అవకాశాలు ఉన్నాయి. విజయనగరం పట్టణానికి కాయగూరల మార్కెట్‌గా ఇది మారే అవకాశం ఉంది. ఇక్కడ షాపులు కేటాయించే వారిలో ఎక్కువ మంది కూరగాయల వ్యాపారులే. ఇక్కడ రైతుబజారు తరహాలో షాపులను మున్సిపాలిటీ ఏర్పాటు చేసింది. సెప్టెంబరు నెల తొలివారంలో జనతాబజార్ ప్రారంభమయ్యే అవకాశం ఉంది

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



నోట్‌పుస్తకాలు అందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

దాసన్నపేట: చదువుకి పేదరికం అడ్డం కాకూడదని చైతన్య కళాశాల ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసులునాయుడు అన్నారు. శుక్రవారం కోటజంక్షన్ సమీపంలోని సంస్కృత పాఠశాలలో 400మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్ అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు సాధించవచ్చన్నారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలు చేపడుతుండడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో శ్రీచైతన్య కళాశాల జోనల్ ఏవో పి.నర్సినాయుడు, సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ ఉదయ్‌భాస్కర్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

లొట్లపల్లిలో ప్రభుత్వ భూమి స్వాధీనం

జామి: మండలంలోని లొట్లపల్లి గ్రామంలో 91సెంట్లు ప్రభుత్వ భూమిని శుక్రవారం తహసీల్దార్ కె ఆనందరావు తన సిబ్బందితో కలిసి స్వాధీనం పర్చుకున్నారు. లొట్లపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 68/5లో ప్రభుత్వం పొన్నకాయల అప్పలస్వామికి 91సెంట్లు ప్రభుత్వ భూమిని డీపట్టాగా మంజూరు చేసింది. ఈ భూమిని 1983లో అప్పలస్వామి విక్రయించేశాడు. ఈ భూమి ముగ్గురి చేతులు మారి ప్రస్తుతం జన్నెల సాదమ్మ ఆధీనంలో ఉంది. డీ పట్టా భూములు విక్రయించిన అప్పలస్వామికి, కొనుగోలు చేసిన సాదమ్మకు తహసీల్దార్ నోటీసులు జారీ చేశారు. వారి నుంచి స్పందన లేకపోవడంతో శుక్రవారం తహశీల్దార్ ఈ భూమి ప్రభుత్వానికి చెందినదని బోర్డులు పాతారు. ఈభూమిని ప్రభుత్వ అవసరాలకు వినియోగిస్తామని తహశీల్దార్ చెప్పారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ పూజలు

● కిటకిటలాడిన ఆలయాలు
● అమ్మవారికి ప్రత్యేకలంకరణ

విజయనగరం రూరల్: శ్రావణ శుక్రవారం సందర్భంగా విజయనగరం పట్టణంలోని ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో శ్రావణ పూజలు నిర్వహించారు. చదురుగుడిలో పైడితల్లి అమ్మవారిని కూరగాయలు, వివిధ పండ్లతో అలంకరించారు. వనంగుడిలో ఆలయ ప్రధాన అర్చకుడు సాయికిరణ్‌శర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమ పూజలు చేశారు. పూజకు అవసరమైన సామాగ్రిని పట్టణానికి చెందిన వేణు దంపతులు భక్తులకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రాజేశ్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

ఐశ్వర్య లక్ష్మికి ప్రత్యేకాలంకరణ

దాసన్నపేట: శ్రావణమాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని మన్నార్ రాజగోపాలస్వామి ఆలయంలో ఐశ్వర్యలక్ష్మికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని వివిధ రకాల పూలతో అలంకరించారు. ప్రధాన అర్చకుడు ఫణిహారం మణిబాబు, శ్రీధర్‌లు పూజలుచేసి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అవనాపు శివప్రసాద్, నిర్వహణ కమిటీ కార్యదర్శి కంది మురళీనాయుడు, ప్రతినిధులు ఎం. రామలింగస్వామి, మాటూరి సతీష్‌లు ఏర్పాట్లు చేశారు.

రామనారాయణంలో...

ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామనారాయణంలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని లక్ష్మీదేవికి గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి విశేష కుంకుమార్చన, విశేష హారతీ, ప్రత్యేక పూజలను ప్రధాన అర్చకుడు నాగవర్ధన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు.



వనంగుడిలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

శ్రీక్షేత్రంలో అలరించిన నృత్య ప్రదర్శన

భారతీయ తత్త్వ దర్శన కేంద్ర శ్రీక్షేత్రమ్‌లోని అష్టలక్ష్మి సమేత ఐశ్వర్య వేంకటేశ్వరస్వామిఆలయంలో శుక్రవారం చిన్నారుల నృత్య ప్రదర్శన అలరించింది. శ్రీసాయి లలితా నృత్య కళానికేతన్ ఆధ్వర్యంలో పలు పాటలకు ఎం మానసజ్యోతి, కెవిఎస్ మౌనిక, పి.తేజస్విని, ఎం.రేణుకా, చక్కటి నృత్యాన్ని ప్రదర్శించారు.





పైడితల్లి అమ్మవారి ఆలయ ఆవరణలో గోవుకు పూజలు, మన్నార్ రాజగోపాలస్వామి ఆలయంలో పూజిస్తున్న భక్తులు

సమాచారం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రింగురోడ్డు: పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏడీఈ త్రినాధరావు ఒక ప్రకటనలో తెలిపారు. పీడబ్ల్యూ మార్కెట్, ట్యాంకుబండ్, దాసన్నపేట, బాలాజీనగర్, ఆర్టీసీ కాంప్లెక్స్, ప్రదీప్‌నగర్, కేఎల్‌పురం, దుప్పాడ, కోరుకొండ, రాకోడు, కొత్తపేట, లంకాపట్నం, బాబామెట్ట, వీటీ అగ్రహారం, పూల్‌బాగ్, వేణుగోపాలపురం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

దాసన్నపేట: ఎలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్-105 ఆధ్వర్యంలో తోటపాలెం గాయత్రి స్కూల్‌లో శనివారం ఉదయం పదిగంటలకు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం నిర్వహించనున్నామని క్లబ్ వైస్ గవర్నర్ సముద్రాల గురుప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ రంగంలో సేవలందించిన వారికి సత్కరించనున్నామన్నారు.

నేడు కేంద్రమంత్రి అశోక్ రాక

కలెక్టరేట్: కేంద్రమంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు శనివారం సాయంత్రం 6.30గంటలకు జిల్లాకు రానున్నారు. 21వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు ఇక్కడి నుంచి ఢిల్లీ వెళ్తారు.

నేడు, రేపు విద్యుత్ అంతరాయం

డెంకాడ : మండలంలోని డెంకాడ, చింతలవలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం విద్యుత్ అభివృద్ధి పనులు చేసేందుకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శంకరాచార్యులు తెలిపారు. అలాగే ఆదివారం అక్కివరం, మోదవలస, సబ్‌స్టేషన్ల విద్యుత్ అంతరాయం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఉందని తెలిపారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరుతున్నారు.

సమయపాలన పాటించండి

● బొప్పడాం ఉన్నత పాఠశాలను సందర్శించిన డీఈవో అరుణకుమారి

నెల్లిమర్ల : ఉపాధ్యాయులంతా సమయపాలన పాటించాలని డీఈవో అరుణకుమారి అన్నారు. బొప్పడాం ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారిణి సింగూరు అరుణకుమారి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. విధుల్లో అంకిత భావంతో పనిచేస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. ఈ సందర్భంగా అన్ని తరగతులను కలియ తిరిగిపరిశీలించారు. ఉపాధ్యాయుల బోధనా తీరుపై ఆరా తీశారు. అలాగే ఉపాధ్యాయులతోను, విద్యార్థులతోనూ వివిధ అంశాలపై మాట్లాడారు. పాఠశాల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి, కంప్యూటర్ విద్యా తదితర విషయాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో అరుణకుమారి



సన్యాసినాయుడిని సత్కరిస్తున్న రాము

సన్యాసినాయుడు సేవలు ప్రశంసనీయం

యుటీఎఫ్ రాష్ట్ర నాయకుడు రాము

నెల్లిమర్ల : నెల్లిమర్ల జడ్‌పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు విద్యారంగానికి చేస్తున్న సేవలు ప్రశంసనీయమని యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి డి.రాము అన్నారు. మండలంలోని కొండవెలగాడ గ్రామానికి చెందిన పేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేయడంతో పాటు పాఠశాల అభివృద్ధికి లక్షలాది రూపాయిలు విరాళంగా ఇవ్వడం గొప్ప విషయమని అన్నారు. పాఠశాల అభివృద్ధికి లక్షలాది రూపాయల విరాళం ఇచ్చిన సందర్భంగా ఆ గ్రామంలో శుక్రవారం యుటీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాము చేతుల మీదుగా జెడ్‌పీటీసీ సన్యాసినాయుడుకు ఘన సత్కారం జరిగింది. కార్యక్రమంలో యుటీఎఫ్ నెల్లిమర్ల మండల నాయకులు పతివాడ త్రినాథ్, మీసాల రామారావు, బత్తుల శ్రీనివాసరావు, మద్దిల సత్యనారాయణ, ఎం.తిరుపతిరావు, జి.సత్యారావు, రాజేంద్రప్రసాద్, రవి, ఎవిఎన్ఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.




సరస్వతీ విగ్రహాన్ని ప్రారంభించిన దృశ్యం

పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి

భోగాపురం: పాఠశాలల అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ సహాయ సహకారాలందించాలని ఎంఈవో రమణమూర్తి అన్నారు. మండలం బమ్మిడిపేట ప్రాథమిక పాఠశాలలో బైరెడ్డి ఎర్రప్పల నారాయణ ఆర్థిక సహాయంలో నిర్మించిన సరస్వతీదేవి విగ్రహాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పాఠశాలలను అభివృద్ధి చేస్తే గ్రామాలను అభివృద్ధి చేసుకొన్నట్టే అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బైరెడ్డి ప్రభాకర రెడ్డి, మెచ్ఎం కె.శ్రీనివాస బెహరా, పీఆర్‌పీ మాతా శేషుబాబు, స్థానికులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

భోగాపురం : మండలంలోని ఒనుంపేట పెట్రోల్ బంకు సమీప జాతీయరహదారిపై శుక్రవారం వేకువ జామున గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ తారకేశ్వరరావు, మహేష్‌లు తెలిపారు. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న రహదారిలో నడిచి వెళ్తున్న యువకుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంలో అక్కడక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఆయువకుడు ఎవరిని తెలియడంలేదన్నారు. యువకుడు వయసు 20నుంచి 25 సంవత్సరాల మధ్య ఉంటుందని జీన్‌ఫేంటు, పెద్దగళ్ళ షర్ట్ వేసుకొన్నాడని ఎవరైన గుర్తించగలిగితే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.



మృతి చెందిన యువకుడు



ముమ్మరంగా వరినాట్లు

డెంకాడ : మండలంలోని గత నాలుగు రోజులుగా పడుతున్న వర్షాలకు రైతులలో ఆనందం వెలువడుతుంది. ఈ సంవత్సరం ఖరీఫ్‌సాగు ప్రశ్నార్థకంగా సాగుతుందనే సమయంలో వరణుడు కరుణించి ఒక మోస్తారు వర్షం పడడంతో రైతులు వ్యవసాయం పనులలో నిమగ్నమయ్యారు. అదే విధంగా మండంలోని వరి, మొక్కజొన్న పంటలకు ఆశాజనకంగా ఉన్నాయని పలువురు ఆనందం వ్యక్తం పరుస్తున్నారు.



మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కర్రోతు

భోగాపురం : పూసపాటిరేగ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా భోగాపురం మండలం పోలిపల్లి గ్రామానికి చెందిన కర్రోతు సత్యనారాయణను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన టీడీపీకి నిరంతరం పార్టీ అభివృద్ధికి శ్రమిస్తూ వచ్చారు. కొన్నేళ్ల క్రితం మండలంలో టీడీపీకి ఆదరణ లేకపోయినా సత్యనారా యణ ఇదే పార్టీని నమ్ముకుని అభివృద్ధి చెందెలా కృషి చేశారు. అనేక పర్యాయాలు మండల టీడీపీ పార్టీ అధ్యక్షులుగా పార్టీకి ఎనలేని సేవలందించారు. అయితే ఈయన సేవలను గుర్తించి ప్రభుత్వం ఏఎంసీ చైర్మన్‌గా బాధ్యతలు అప్పజెప్పింది. ఈయన ప్రస్తుతం పోలిపల్లి సర్పంచ్‌గా ఉన్నారు. అయితే ఈయనను ఏఎంసీ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించడంతో ఆయనకు మండలంలో టీడీపీ వర్గీయులు హర్షం వ్యక్తం చేశారు. ఈయనకు గుంటూరు వ్యవసాయ కార్యాలయంలో అసిస్టెంట్ సెక్షన్ అధికారి కె.రమేష్‌బాబు ఏఎంసీ చైర్మన్‌గా ఉత్తర్వులు అందజేశారు. వైస్ చైర్మన్‌గా కాగితాల స్వనారాయణ, మెంబర్లుగా బడి అప్పన్న, పారిపల్లి పెంటయ్య, చిల్లా అరుణ, కర్రి కృష్ణ, పిన్నింటి రాం నాయుడు, అప్రభుత్వ సుధాకర్, మల్లపురాజు శ్రీనివాసరాజు, పిల్లాసూరిబాబు, షేక్‌రెహమాన్, చందకా నంద్, ఎస్.రామకృష్ణరాజు, ఆకి శ్రీనివాసరావు, వుద్రాళ్ల దేవుళ్ళ, పీఏసీఎస్ కమిలి ప్రెసిడెంట్, విజయనగరం మార్కెటింగ్ అసిస్టెంట్ డైరెక్టర్, విజయనగరం వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, పూసపాటిరేగ సర్పంచ్‌ని మెంబర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



ఉత్తర్వులు అందుకుంటున్న సత్యనారాయణ

ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

పూసపాటిరేగ : ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలంటూ సీఐటీయూ నాయకులు బి.సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు శుక్రవారం ఎమ్మెల్యే పతివాడనారాయణ స్వామినాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీహెచ్‌సీల పరిధిలో ఆశ వర్కర్లు 20రకాల ప్రభుత్వ పనులు నిర్వహిస్తున్నారని వీరి విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. వీరికి ఎటువంటి వేతనాలు లేకుండా కేంద్రం ఇచ్చే పారితోషకంతోనే సరిపెట్టుకొంటున్నారన్నారు. వారికి కనీసం రూ.6000 వేతనం అందజేయాలని ఇతరత్రా సదుపాయాలు కల్పించాలని దీనిపై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేసిన దృశ్యం

కిటకిటలాడిన ఆలయాలు

నెల్లిమర్ల : శ్రావణ మాస పవిత్ర దినాన్ని పురస్కరించుకుని శుక్రవారం పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రధానంగా రామతీర్థం రామస్వామివారి ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువయింది. ఉదయం నుంచే భక్తులు దేవస్థానానికి చేరుకుని సీతారాములను దర్శించుకుని పూజలుచేశారు. అలాగే దేవస్థానంలోని లక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పక్కనే ఉన్న ఉమా సదా శివ ఆలయానికి కూడా వెళ్లి శివుణ్ణి దర్శించుకున్నారు. రామతీర్థం దేవస్థానానికి మధ్యాహ్నం రెండు గంటల వరకు భక్తుల తాకిడి కనిపించింది. అలాగే మండల కేంద్రంలోని నెల్లిమర్లలో సంతోషిమాత కోవెల, శివ కోవెల, షిర్డీ కోవెలల వద్ద కూడా భక్తుల సంఖ్య అధికంగా ఉంది.



సినిమాలు

నెల్లిమర్ల

సాయిసుభద్ర :	లై
శ్రీనివాస :	జయ జానికి నాయక

పూసపాటిరేగ

శ్రీసాయికృష్ణ :	నక్షత్రం

భోగాపురం

శ్రీగోపాలకృష్ణ :	జయ జానికి నాయక

రైతు శ్రేయస్సుకు ఈ-పాసు పుస్తకాలు

మెంటాడ: రైతులు ఇబ్బంది లేకుండా ఎలక్ట్రానిక్ పట్టాదారు పాసు పుస్తకాలు, ఇ- పట్టాదారు పాసుపుస్తకాలు అందిస్తున్నట్టు తహశీల్దార్ జి. జయదేవి అన్నారు. శుక్రవారం కొండలింగాలవలసలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు. మీ సేవ కేంద్రాల్లో 15 నిమిషాల్లో 1బితో కూడిన పట్టాదారు పాసు పుస్తకం లభిస్తుందన్నారు. కె.ఎల్. వలస సర్పంచ్ కె.నాగమణికి ఇ- పాస్ పుస్తకాలు అందజేశారు. డీటీ అప్పారావు, తదితరులున్నారు.


పాస్ పుస్తకం అందజేస్తున్న తహశీల్దార్

శ్యామలాంబ విగ్రహం పునఃప్రతిష్ఠ


పూజలు చేస్తున్న కమిటీ అధ్యక్షుడు అప్పారావు, సభ్యులు

సాలూరు: పట్టణ వాసుల ఇలవేల్పు శ్యామలాంబ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠా కార్యక్రమాలు శుక్రవారం ఆలయ కమిటీ అధ్యక్షుడు అక్యాన అప్పారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయం అభివృద్ధి పనులు చేసిన తర్వాత అమ్మవారి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించారు. తొలుత మూలవిరాట్‌కు పూజలు చేశారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. 108 మంది మహిళలు 108 కళశాలతో వేగావతి నదీ జలాలకు పూజలు చేసి అమ్మవారికి అభిషేకం చేశారు. కుంకుమ పూజలు, హోమాలు నిర్వహించారు. లారీ ఓనర్ల సంఘ అధ్యక్షుడు గొర్లె మాధవరావు, మాజీ అధ్యక్షుడు కిలారి శ్రీను, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రం వద్ద తుప్పల తొలగింపు

పాచిపెంట: కొత్తవలసలోని ఆరోగ్య ఉపకేంద్రం భవనం వద్ద పేరుకుపోయిన తుప్పలను శుక్రవారం తొలగించారు. అలంకారప్రాయంగా ఆరోగ్య ఉపకేంద్రాలు అనే శీర్షికతో ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనానికి స్పందించిన ఎమ్మెల్సీ గుమ్మడి సంధ్యారాణి ఈ సబ్ సెంటర్‌ను పరిశీలించారు. వెంటనే డీఎంహెచ్‌వోతో ఆమె ఫోన్‌లో మాట్లాడారు. ఈనేపథ్యంలోఅధికారులు తుప్పలను తొలగించే చర్యలు చేపట్టారు.

ఘనంగా వరలక్ష్మి పూజలు

సాలూరు: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. చివరి వారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. పంచముఖేశ్వరస్వామి, సంతోషిమాత, దుర్గాదేవి, కామాక్షిదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.


పాచిపెంటలో పూజల్లో మహిళలు

పాచిపెంట: స్థానిక భ్రమరాంబిక శ్రీమల్లికార్జునస్వామి ఆలయం వద్ద శ్రీవరలక్ష్మి వ్రత ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ప్రభాకర్‌రావు, రవిశర్మ పూజలు నిర్వహించారు.


సామూహిక వ్రతాల్లో మహిళలు

సాలూరు రూరల్: మండలంలో మామిడిపల్లి, శివరాంపురంలోని ఆలయాలకు భక్తుల పోటెత్తారు. పాచిపెంట మండలం శ్యామలాగౌరీపురం వెళ్లి పలువురు భక్తులు సామూహిక వరలక్ష్మి వ్రత పూజల్లో పాల్గొన్నారు. అష్టలక్ష్మి ఆలయంలో భక్తులు పోటెత్తారు.

'సీడీపీ' సేవలు భేష్

మక్కువ (సాలూరు రూరల్): విద్యార్థులకు నేచర్ సీడీపీ సేవలు అందించడంపై మక్కువ ఎంపీడీవో రామారావు అభినందించారు. శుక్రవారం నేచర్ సీడీపీ ద్వారా విద్యార్థులకు సైకిళ్లు, విద్యాసామగ్రి, బ్యాగ్‌లను ఎంఈవో మల్లేశ్వరరావుతో కలసి ఆయన పంపిణీ చేశారు. సంస్థ సిబ్బంది గంటా షైమావతి, ఎల్. వర లక్ష్మి, సోమేష్, రాంబాబు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో

జోరుగా రహదారి విస్తరణ పనులు

- స్వచ్ఛందంగా ఇళ్ల తొలగింపు
- ఏడాది చివరినాటికి పూర్తికి చర్యలు

మెంటాడ: మెంటాడ గజపతినగరం రోడ్డు విస్తరణ పనులు వేగవంతమయ్యాయి. ట్రాఫిక్ సమస్య అధికం కావడంతో ఈ రోడ్డు విస్తరణకు ప్రభుత్వం పూనుకుంది. గజపతినగరం నుంచి సాలిపేట రోడ్డు వరకు ఒక భాగం, అక్కడ నుంచి మెంటాడ కస్తూర్బా పాఠశాల వరకు రెండో భాగంగా పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం ఉన్న 12 అడుగుల రోడ్డును 30అడుగులు వెడల్పు మార్చనున్నారు.

వినతి మేరకు తగ్గిన 4 అడుగులు

మండల కేంద్రంలోని శివారు వరకు మొత్తం 30అడుగులు వెడల్పు ఉండే విధంగా చర్యలు చేపట్టారు. గ్రామంలో ఇదే విధంగా విస్తరిస్తే సుమారు 15కుటుంబాలు ఇళ్లు కోల్పోయే ప్రమాదం ఉంది. దీంతో గ్రామస్థులు, గ్రామపెద్దలు కోరిక మేరకు గ్రామంలో ఇరువైపులా రెండు అడుగులు తగ్గించి మొత్తం 26 అడుగులు విస్తరించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో తమ ఇళ్లు, షాపులను స్వచ్ఛందంగా తొలగించుకుంటున్నారు. ఈ ఏడాది చివరినాటికి ఈ పనులు పూర్తి చేసేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రయత్నిస్తున్నారు.


ఇళ్లను తొలగిస్తున్న మెంటాడ గ్రామస్థులు

అభివృద్ధికి 'గొర్లె' విశేష కృషి

- మున్సిపల్ పాలకవర్గం ఘన నివాళి

సాలూరు: తొమ్మిదో వార్డు కౌన్సిలర్ గొర్లె అప్పారావు మృతికి పాలకవర్గ సభ్యులు సంతాపం తెలిపారు. శుక్రవారం కౌన్సిల్ హాలులో చైర్‌పర్సన్ గొర్లె విజయకుమారి అధ్యక్షతన సంతాప సభ ని ర్వహించారు. తొలుత గొర్లె చిత్రపటానికి పూలమాల వేసి చైర్‌పర్సన్, కమిషనర్ ఎంఎం నాయుడు, కౌన్సిల్ సభ్యులు, అధికారులు, సిబ్బంది నివాళులర్పించారు. నిమిషం పాటు మౌనం పాటించారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి అభివృద్ధికి గొర్లె ఎంతగానో కృషి చేశారన్నా రు. తాగునీరు, రోడ్లు, కాలువల అభివృద్ధి పనులు జరిపించేందుకు అధికారుల వెంటే ఉండేవారని కమిషనర్ అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలపై అధికారులతో ఎప్పటికప్పుడు చర్చించేవారని మేనేజరు పాండ్యన్, డీఈ సుధాకర్ అన్నారు.


కౌన్సిలర్ గొర్లెకు నివాళి అర్పిస్తున్న సభ్యులు

వార్డు అభివృద్ధికి ఎంతగానో కృషి చేసిన గొర్లె అకాల మరణం తీరని లోటని వైసీపీ ఫ్లోర్ లీడర్ వంగపండు అప్పలనాయుడు అన్నారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు నిమ్మాది చిట్టి, టీడీపీ నేత గొర్లె మాధవరావు, వార్డు కమిటీ సభ్యులు గొర్లెకు నివాళులర్పించారు.

రెవెన్యూ సదస్సుకు 37 వినతులు

సాలూరు రూరల్: పెదబోరబందలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 37 వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ పేడాడ జనార్దనరావు మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటమ్మ, ఎంపీటీసీ, ఆర్ఐ గణేష్‌రెడ్డి, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

ఈయూలో చేరిన కార్మికులు


ఈయూలో చేరిన కార్మికులతో రాష్ట్ర నేతలు పద్మాకర్, సత్యనారాయణ

సాలూరు: ఎంప్లాయీస్ యూనియన్‌లో ఎన్ఎంయూ, టీఎన్‌టీయూసీ సంఘాలకు చెందిన 25మంది కార్మికులు శుక్రవారం ఈయూ రాష్ట్ర నేత పద్మాకర్ సమక్షంలో చేరారు. ఈ కార్మికులకు పుష్పగుచ్ఛాలు అందించి ఈయూలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్నారు. గత ఎన్నికలలో ఎన్నో హామీలిచ్చి గెలిచిన ఎన్ఎంయూ ఏఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. సత్యనారాయణ, జోనల్ అధ్యక్షుడు సీహెచ్‌వీ రావు, కార్యదర్శి భానుమూర్తి, జి. రవికాంత్, బీకే మూర్తి ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు రోటరీ సేవలు శ్లాఘనీయం

సాలూరు: పర్యావరణ పరిరక్షణకు రోటరీ క్లబ్ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు శ్లాఘనీయమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బలగ సహదేవుడు అన్నారు. శుక్రవారం రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జె. కళ్యాణ్ చక్రవర్తి, రవివర్మ ఆధ్వర్యంలో డిగ్రీ కాలేజీ ఆవరణలో గ్రీన్ రోటరీ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత కాలేజీలో ఆరునుంచి పది అడుగుల ఎత్తైన 120 మొక్కలను నాటారు. 70 మొక్కలకు ట్రీగార్డులు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ సహదేవుడు మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కా బతకాలన్న ఆశయంతో ట్రీ గార్డులు ఏర్పాటు బాగుందన్నా రు. మొక్కను పెంచే బాధ్యతను విద్యార్థులకు అప్పగించేదుకు వారికి దత్తత ఇస్తున్నారన్నారు. అనంతరం రోటరీ అధ్యక్షుడు కళ్యాణచక్రవర్తి మాట్లాడుతూ పట్టణంలోని కళాశాలలు, పాఠశాలలు, మున్సిపల్ పార్కులను పచ్చదనంతో నింపుతామన్నారు. మొక్కలను క్లబ్‌కు అందించిన రాష్ట్ర ఉత్తమ రైతు, రోటరీ మాజీ అధ్యక్షుడు చలసాని లీలా ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పీడీ గౌరీశంకరరావు, రోటరీ సభ్యులు ఇందుపూరి వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, పువ్వలసిరి గోపి, బీవీఎస్ఎస్ గుప్తా పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్, రోటరీ సభ్యులు

ఐటీడీఏ పనులపై ఏసీబీ తనిఖీలు అవసరం

- ఎమ్మెల్యే రాజన్నదొర

సాలూరు రూరల్: ఐటీడీఏ ఇంజినీరింగ్ విభాగం జరిపిన పనులపై ఏసీబీ, విజిలెన్స్, క్వాలిటీ కంట్రోల్ విభాగాలు పరిశీలించి గిరిజనులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే పీడిక రాజన్నదొర డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. ఆ ఇంజినీరింగ్ విభాగం వ్యవహరిస్తున్న తీరు వల్ల ఐటీడీఏ అంటే ఇచ్చింది తీసుకో, దోచుకున్నది అడక్కు అని అర్థం చేసుకోవాల్సిన ఆగత్యం ఏర్పడిందని ఆయన ఎద్దేవా చేశారు. పనుల్లో నాణ్యత చూడకుండానే బిల్లులు చేస్తున్నారన్నారు. కొత్తాది రూపాయల నిధులు వృథా అవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. పనులు నాసిరకంగా ఉండటంతో గిరిజనులకు నిర్దేశించిన లక్ష్యం నెరవేరడం లేదన్నారు. గిరిజన ప్రాంతాల్లో పనులను కాంట్రాక్టర్లు, దళారులు, రాజకీయ నాయకులు వాటాలు వేసుకుంటారని ఆరోపించారు. వాస్తవానికి ఉపాధి నిధులతో పనులు గిరిజన పంచాయతీల్లో సర్పంచ్‌లే చేయాల్సి ఉందన్నారు. వీటీడీఏలు సైతం ఐటీడీఏ నిధులతో పనులు చేయాల్సి ఉందన్నారు. అయితే సర్పంచ్‌లను, వీటీడీఏలను డమ్మీలుగా మార్చి పనులు చేయిస్తున్నారన్నారు. నాణ్యత లేని పనులు చేస్తున్న వీటీడీఏ లపై కేసులు పెట్టలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉపాధి హామీలో జరి గిన అవినీతిపై చర్యలు లేకపోవడం దారుణమన్నారు. సాలూరు పరిధిలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందన్నారు. అందు వల్ల ఏసీబీ తో పాటు విజిలెన్స్, క్వాలిటీ కంట్రోలర్ పెద్దఎత్తున తనిఖీలు చేసి గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజన్నదొర

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన సదస్సు

చీపురుపల్లి: పట్టణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రకృతి వైపరీత్యాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే మాక్‌డ్రిల్ చేయించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డి.తాతారావు మాట్లాడుతూ, ప్రమాదంలో గాయపడిన వారికి ప్రథమ చికిత్స అవసరమని, చికిత్స అనంతరం మెరుగైన చికిత్స అందించి ప్రాణ నష్టాలు కాపాడాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాల సంభవించినప్పుడు ప్రజలను ఎలా రక్షించాలనేది తెలుసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఫీల్డ్ ఆఫీసర్ గౌరిశంకర్, ఎన్ఎస్ఎస్ పీవో ఉమా పాల్గొన్నారు.

పీఈటీకి సన్మానం

చీపురుపల్లి రూరల్: కర్లాం ఉన్నత పాఠశాలలో పీఈటీగా పని చేసి గరివిడి మండలం కాపుశంభాం గ్రామానికి బదిలీపై వెళ్లిన కాపరోతు మురళీధర్‌కు గ్రామస్థులు శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బాణాన రామకృష్ణం నాయుడు మాట్లాడుతూ, విద్యార్థుల్లో క్రమశిక్షణను పెంచేందుకు మురళీ మాస్టారు చేసిన కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఈసీఎస్ డైరెక్టర్ కెల్ల రామారావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బాణాన శ్రీనివాసరావు, పాఠశాల హెచ్ఎం జానకీరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పీఈటీ మురళీని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

సార్వత్రిక పరీక్షకు సిద్ధం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సమన్వయకర్త

మెరకముడిదాం: మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో ఆదివారం నిర్వహించనున్న జాతీయ సార్వత్రిక పరీక్షకు సర్వం సిద్ధం చేయాలని సాక్షర్‌భారత్ మండల సమన్వయకర్త సీహెచ్ శివన్నారాయణ కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సాక్షరభారత్ గ్రామ సమన్వయకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరీక్షలు అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్వహించగా, సుమారు 467 మంది అభ్యాసకులు హాజరుకావాల్సి ఉందన్నారు. పరీక్షల నిర్వహణకు మిగిలిన ఏర్పాట్లు పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రతి సమన్వయకర్తకు తప్పనిసరిగా మరుగుదొడ్డి సౌకర్యం కలిగి ఉండాలని, మరుగుదొడ్డి లేనివారు వెంటనే నిర్మించుకోవాలని సూచించారు. అలాగే వయోజన విద్యా కేంద్రాలు రికార్డులు సక్రమంగా ఉండాలన్నారు.

సమస్యల పరిష్కారానికే సదస్సులు

రేజేరు(బాడంగి): రైతు సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ జనార్దనరావు తెలిపారు. శుక్రవారం రేజేరులో రైతు సేవలో రెవెన్యూ శాఖ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు సంబంధించిన ప్రతి ఒక్క సమస్యను పరిష్కరిస్తామని, దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అనంతరం రైతుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సమావేశంలో ఆర్ఐ చంద్రశేఖర్, సర్వేయర్ చంద్రశేఖర్, వీఆర్వోలు చిట్టయ్య, రామకృష్ణ రైతులు పాల్గొన్నారు.

ఆధునిక విధానాలతో అధిక దిగుబడులు

భూసాయవలస(రామభద్రపురం): వేరుశనగ సాగులో ఆధునిక విధానాలు అవలంభించి, అధిక దిగుబడులు సాధించాలని ఏవో అనురాధ పండా రైతులకు సూచించారు. శుక్రవారం భూసాయవలసలో వేరుశనగ పంటపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నూతన విధానాలపై అవగాహన కల్పించారు. భూమిలో తేమ శాతం, ఎరువుల ఆవశ్యకత, చీడపీడలు, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మెలకువలు పాటిస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చన్నారు. వేరుశనగ పంటకు పూత దశలో జిప్సం వేస్తే ఊడలు దిగి, నాణ్యమైన గింజతో పాటు కాయబరువు పెరిగి, నూనె శాతం ఎక్కువగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు సురేష్, పుష్పలత, ఎంపీఈవోలు లత, గణపతి పాల్గొన్నారు.

పశు బీమా పరిహారం అందజేత

రామభద్రపురం: పశు బీమా పథకంలో చేరిన విశాఖ డెయిరీకి చెందిన పాడి రైతులకు శుక్రవారం రామభద్రపురం కార్యాలయంలో బీమా పరిహారం కింద సుమారు రూ.14.50 లక్షలు మేనేజర్ వరప్రసాద్ అందజేశారు.

గ్రామాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే కిమిడి మృణాళిని

గరివిడి: గ్రామాలు పట్టణాలను తలపించే విధంగా అభివృద్ధి పరచడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కిమడి మృణాళిని తెలిపారు. కోడూరు గ్రామంలో సుమారు రూ.13 లక్షల నిధులతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని, రూ.3 లక్షలతో నిర్మించిన డ్వాక్రా భవనాన్ని, రూ.5 లక్షలతో నిర్మించిన పాఠశాల మరుగుదొడ్లను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మృణాళిని మాట్లాడుతూ, దాదాపుగా అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మాణం పూర్తి చేసినట్టు తెలిపారు. కోడూరు పంచాయతీ పరిధిలో గరివిడి డిగ్రీ కళాశాల ఎదురుగా మూడు ఎకరాలు ప్రభుత్వ స్థలం ఉందని, ఈ స్థలంలో పేదలకు పట్టాలు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ప్రభుత్వం పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో వంటలు, అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును పర్యవేక్షించాలని గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు సూచించారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న ముఖ్యమంత్రికి ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. ప్రతి ఒక ఎకరాకు సాగునీరు అందేలా ప్రాజెక్టులు పూర్తి చేస్తున్నట్టు తెలిపారు. వ్యవసాయాన్ని లాభాసాటిగా మార్చేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. పారిశుధ్యం మెరుగుకు కృషి చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ బలగం కృష్ణమూర్తి, ఎంపీపీ పైల సింహాచలం, వైస్ ఎంపీపీ పైల బలరాం, గ్రామ సర్పంచ్ అడపా జానకీరమణమ్మ, ఎంపీటీసీ వెంకునాయుడు, గరివిడి ఎంపీటీసీ కింతాడ రవికుమార్, టీడీపీ నాయకులు బలగం శ్రీనివాస్, ఎస్.సురేష్‌కుమార్, మహంతి రమణమూర్తి, ఎంపీడీవో అన్నపూర్ణదేవి, ఎంఈవో పి.రామారావు తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మృణాళిని, పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం

చీపురుపల్లి: పట్టణ పరిధి జి.అగ్రహారంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను శుక్రవారం జమ్ము మహలక్ష్మ నాయుడు తనిఖీ చేశారు. ప్రార్థన సమయంలో పాఠశాలకు వెళ్లి, విద్యార్థుల క్రమశిక్షణపై ఆరా తీశారు. అనంతరం రికార్డులు పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన వంటలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవో ఉపాధ్యాయులతో మాట్లాడుతూ, విద్యార్థులకు క్రమశిక్షణ అవసరమని, మధ్యాహ్న భోజన సక్రమంగా అమలు చేయాలని కోరారు. భోజనంలో లోపాలు ఉంటే తెలియజేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం చిరంజీవిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో నాయుడు

● పాఠశాలకు టైలు, బెల్టులు వితరణ

ఆంజనేయపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పీఆర్టీయూ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగుపల్లి సత్యన్నారాయణ సమకూర్చిన టైలు, బెల్టులు ఎంఈవో నాయుడు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ, ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులకు సహాయ, సహకారాలు అందించడానికి కోరారు. అనంతరం పోలీస్ లైన్ పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన జీవీ రమణను సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం భూపతి, ఉపాధ్యాయులు గంగుపల్లి సత్యన్నారాయణ, చిరంజీవిరావు, నగేష్ కుమార్, వాసుదేవరావు, కళ్యాణి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తెర్లాం: ఎంఆర్ అగ్రహారం గ్యాస్ ఏజెన్సీ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఇదే గ్రామానికి చెందిన గాలి వెంటరావు (48) గురువారం రాత్రి ఆర్ఆర్ రోడ్డుపై నడిచి వెళ్తుండగా, అదే గ్రామానికి చెందిన బొడ్డాన రవి వెనుక నుంచి ఆటోతో ఢీకొన్నాడు. దీంతో వెంకటరావుకు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం స్థానికులు రాజాం కేర్ ఆపుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్టు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఎస్ఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

7వ పీఆర్సీ అమలు చేయాలి

● ఏఐజీడీఎస్ యూనియన్ సబ్ సర్కిల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సన్యాసిరావు

చీపురుపల్లి: పోస్టల్ శాఖలో పనిచేస్తున్న గ్రామీణ తపాలా ఉద్యోగులకు చెల్లించవలసిన 7వ పీఆర్సీని తక్షణమే అమలుచేయాలని ఏఐజీడీఎస్ యూనియన్ చీపురుపల్లి సబ్ సర్కిల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి జె.సన్యాసిరావు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలంటూ శుక్రవారం చీపురుపల్లి కార్యాలయ ఆవరణలో సబ్ డివిజనల్ పరిధిలో ఉన్నటువంటి గ్రామీణ తపాలా ఉద్యోగులు విధులు బహిష్కరించి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సన్యాసిరావు మాట్లాడుతూ, సమ్మెకు సంబంధించి ఈనెల 16న నోటీసులు ఇచ్చామని, ప్రభుత్వం స్పందించకపోవడంతో విధులు బహిష్కరించి, ఆందోళన బాట పడతామని హెచ్చరించారు. ఎస్ఎస్ మహదేవన్ కమిటీ 7వ పీఆర్సీ అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించిందని, కానీ ఇంతవరకు అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 10 ఏళ్లకు ఒకసారి పెంచే పీఆర్సీ అమలు చేయకపోవడం దారుణమని అన్నారు. దీనివల్ల జీతాలు కూడా పెరగడం లేదని, కుటుంబ పోషణ కష్టమవుతుందని వాపోయారు. దేశ స్థాయిలో నాయకులు పోరాటాలు చేస్తున్నారని, సమస్యలు పరిష్కరించే వరకు విధులకు వెళ్లేది లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు కె.నీలకంఠేశ్వరరావు, పి.కృష్ణారావు, కె.రామాంజనేయులు తదతరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

లింగాకర్షక బుట్టలు ఏర్పాటు

జీఎస్‌పురం(బొబ్బిలి రూరల్): చంద్రన్న రైతు క్షేత్రంలో భాగంగా శుక్రవారం జీఎస్ పురంలో ఏవో ఎం.శ్యాం సుందరరావు ఆధ్వర్యంలో లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేశారు. బట్టులు రైతులకు ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందని, ఎకరానికి ఆరు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వీటి వలన వరి పంటకు హానిచేసే కాండం తొలుచే పురుగు, ముడత పురుగులు, రెక్క పురుగుల నివారణకు వీలుంటుందని తెలిపారు.

సమాచారం

● నేడు విద్యుత్ సరఫరా బంద్

చీపురుపల్లి: చీపురుపల్లి గ్రామీణ విద్యుత్ సహకార సంఘం పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు సంస్థ ఏడీఈ జగన్నాథరావు తెలిపారు. గరివిడి ఏపీ ట్రాన్స్‌కో సబ్ స్టేషన్‌లో 220 కేవీ మెయింటనెన్స్ పనులు చేస్తున్నామని, దీంతో ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

● 22న మెగా వైద్య శిబిరం

చీపురుపల్లి: మానవీయత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 22న చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత ప్రత్యేక మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సంస్థ అధ్యక్షుడు బీవీ గోవింద రాజులు తెలిపారు. శిబిరానికి నెల్లిమర్ల మిమ్స్ వైద్యులు హాజరై, వైద్యసేవలు అందిస్తారని అన్నారు. చిన్న పిల్లల, గర్భిణులకు తనిఖీలు, మదుమేహం, సామాన్య, దీర్ఘకాలిక వ్యాధులు, కీళ్లు, మోకాళ్లు నొప్పులు తదితర వ్యాధులతో బాధ పడుతున్న రోగులు హాజరుకావాలని కోరారు.

చీపురుపల్లిలో సినిమాలు

అనురాగ్	- జయ జానకీ నాయక
అమోగ్	- నేనే రాజు నేనే మంత్రి
వంశీ	- ఆనందో బ్రహ్మ
విష్ణు	- ఫిదా
నటరాజ్	- ప్రతి క్షణం



వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

విజయనగరం టౌన్: పట్టణంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుని విగ్రహాన్ని ప్రధాన రోడ్లపై ఊరేగించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈఉత్సవాలను ఇందూ జ్ఞానవేదిక, ప్రభోద సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఇసుక ధర పైపైకి!



● ట్రాక్టరు లోడు రూ.3వేలు పైనే ● తప్పనిసరి పరిస్థితుల్లో ఇసుక కొనుగోలు ●'అందరికీ ఇళ్లు' నిర్మాణాల్లో జాప్యం ● ఆదేశాలు బేఖాతర్

విజయనగరం టౌన్: ఇసుక ఉచితం.. లోడింగ్, రవాణా చార్జీలతో కలిపి ఇసుకను విక్రయించాలి... ఇంతకంటే ఎక్కువ అమ్మితే, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.. దీనిపై నిత్యం అధికారులు పర్యవేక్షణ చేయాలి. క్షేత్రస్థాయిలో వున్న ప్రజలకు ఈ విషయానికి తెలియజేయండి.. సాక్షాత్తు రాష్ట్ర గనుల శాఖ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు కలెక్టరేట్ సాక్షిగా అన్న మాటలివి.. వాస్తవ పరిస్థితిని పరిశీలిస్తే ఇందుకు భిన్నంగా ఉంది. విజయనగరం పట్టణంలో ప్రస్తుతం అందరికీ ఇళ్ల పథకం కింద గృహనిర్మాణాలు జరుగుతున్నాయి. ఇదే ఇసుక వ్యాపారులకు కాసులు కురిపిస్తోంది. మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెలల వరకూ మీడియం ఇసుక ట్రాక్టర్ లోడు రూ.1,500 నుంచి రూ.1,700 ఉండేది.. జూలై నుంచి ఇసుకకు డిమాండ్ పెరిగింది. దొంగచాటుగా ఇసుక తరలిపోతున్నదని గుర్తించిన జిల్లా అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు ప్రారంభించింది. దీంతో ఇసుక కొరత ఏర్పడింది. ఇదే ఇసుక వ్యాపారులకు కాసుల వర్షానికి ప్రధాన కారణమైంది.. విజయనగరం పట్టణంలోని అందరికీ ఇళ్ల పథకం ద్వారా నిర్మిస్తున్న దాదాపు 3వేల ఇళ్లు వివిధ దశల్లో వున్నాయి. ప్రతి ఒక్కరికి మీడియం ఇసుక, శ్లాబ్ అనంతరం మెత్తటి ఇసుక అవసరం. తాత్కాలికంగా ఇసుక కొరతతో ఇబ్బంది పడుతున్న ఇంటి యాజమానులు ఎంతైనా ధర ఇచ్చి కొనుగోలు చేసేందుకు సిద్ధపడుతున్నారు. దీనినే అవకాశంగా తీసుకున్న కొంతమంది ఇసుక వ్యాపారులు యథేచ్ఛగా అమ్ముతున్నారు. విజయనగరం పట్టణంలోకి నెల్లిమర్ల, గుర్ల, డెంకాడ మండలాల పరిధిలోని పలు గ్రామాల నుంచి ఇసుక వస్తున్నది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నెల్లిమర్ల, గుర్లలోని వివిధ గ్రామాలకు సంబంధించి అక్కడ లోడింగ్ చార్జీ, అక్కడి నుంచి రవాణా చార్జీ కలుపుకొని ట్రాక్టర్ లోడు రూ.1,300గా నిర్ణయించారు. జిల్లా అధికార యంత్రాంగం కూడా దీనిపై ప్రకటన కూడా చేసింది. అయితే వాస్తవానికి ఆ రెండు ప్రాంతాల నుంచి వచ్చే ఇసుక ట్రాక్టర్ ధర రూ.3వేల నుంచి 3,500కి విక్రయిస్తున్నారు. విజయనగరం మున్సిపాలిటీకి సంబంధించి అభివృద్ధి పనుల నిమిత్తం ఇసుక అవసరం వున్న నేపథ్యంలో కొంతమంది ట్రాక్టర్ యాజమానులకు కూపన్లు ఇచ్చారు. ఈ కూపన్ల ద్వారా మున్సిపాలిటీ పనులకు ఇసుక వేయాలి. కొంతమంది మున్సిపల్ పనులకు కాకుండా ఇంటి యాజమానులకు ఇసుకను విక్రయిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు విక్రయిస్తున్నారా అంటే అదీ లేదు. ఇప్పటికే జిల్లా అధికార యంత్రాంగం ఇసుక విక్రయాలపై దృష్టి సారించి అందరికీ ఇళ్ల పథకం కింద ఇళ్లు నిర్మించుకునే వారికి ఇసుక లభ్యమయ్యేలా చూడాల్సివుంది.

సినిమా గైడ్

విజయనగరం

ఆదిత్య	: నేనే రాజు నేనే మంత్రి
శ్రీకృష్ణ	: జయజానకి నాయక
న్యూపూర్ణ	: నేనే రాజు నేనే మంత్రి
రంజని	: ఫిదా
శివరంజని	: ఆనందో బ్రహ్మ
హిమగిరి	: గౌతమ్‌నంద
సప్తగిరి	: లై
లీలామహల్	: జయజానకి నాయక
ఎన్‌సీఎస్	: నక్షత్రం

ఎన్‌సీఎస్ ఐనాక్స్

స్క్రీన్-1, స్క్రీన్-2, స్క్రీన్-3

ఆనందో బ్రహ్మ, నేనే రాజు నేనే మంత్రి, జయ జానకి నాయక, లై, అనబెల్

సమాచారం

గ్యాస్ ఏజెన్సీ ఫోన్ నంబర్లు

సాయి ఏజెన్సీ	: 08922-234523
ఎన్‌సీఎస్ఏజెన్సీ	: 08922- 224177, 233578
ఎన్‌వీఆర్ ఏజెన్సీ	: 08922-225810
శ్రీనివాసా ఏజెన్సీ	: 08922-224301, 285288

ఆర్టీసీ సమాచారం

విచారణ కేంద్రం	08922 225333
ఫిర్యాదుల విభాగం	7382923726
అడ్వాన్స్ బుకింగ్	08922 234911
టోల్‌ఫ్రీ నంబరు	1800 200 4599

ఎమర్జన్సీ సర్వీసెస్

పోలీస్	100
ఫైర్	101
ఆపద సమయాల్లో	108
బాలల సంరక్షణ కోసం	1098
కేంద్రాసుపత్రి అంబులెన్స్	08922 272124
మోహాసుపత్రి అంబులెన్స్	8008553401

రైతుబజారు ధరలు

కూరగాయలు	కిలో (రూ)
టమోటా (దేశవాళీ)	44-00
టమోటా(హైబ్రిడ్)	37-00
వంకాయలు	27-00
బీరకాయలు	18-00
బెండకాయలు	24-00
కాకర కాయలు	28-00
క్యాబేజీ	18-00
గోరు చిక్కుడు	22-00
దొండకాయలు	30-00
క్యారెట్	34-00
బీట్‌రూట్	25-00
ఉల్లిపాయలు	29-00
బంగాళదుంపలు	10-00
అల్లం	58-00
పచ్చిమిర్చి	45-00
క్యాప్సికమ్	55-00
కీర దోస	20-00

బంగారం ధరలు

24క్యారెట్లు (10 గ్రాములు)	30,150-00
22 క్యారెట్లు	27,740-00
వెండి కిలో	40,500-00

అంబేద్కర్ సాక్షిగా ఆదర్శ వివాహం

శృంగవరపుకోట: పట్టణంలోని దారగంగమ్మ ఆలయంలో శుక్రవారం దళిత విముక్తి సంఘం ఆధ్వర్యంలో ప్రేమవివాహం జరిపించారు. ఈసందర్భంగా దళిత విముక్తి కన్వీనర్ సుర్ల వెంకటరమణ, ప్రతినిధి కిలపర్తి జగదీష్‌లు మాట్లాడుతూ ఎస్.కోట మండలం ముషిడిపల్లి గ్రామానికి చెందిన ముత్యాల రోజా, వీరనారాయణం గ్రామానికి చెందిన యర్రవరపు సన్యాసిరావులు వేర్వేరు సామాజిక కులాలకు చెందిన వారని, వీరిప్రేమను పెద్దలు ఒప్పుకోకపోవడంతో దళితవిముక్తి సంఘాన్ని ఆశ్రయించారన్నారు. సంఘ ప్రతినిధులు వీరి తల్లిదండ్రులను ఒప్పించి వీరికి పెళ్లిచేశారు. అనంతరం దేవిబొమ్మకూడలి వద్ద వున్న అంబేద్కర్ విగ్రహం వద్ద వధూవరులు దండలు మార్చుకున్నారు. కార్యక్రమంలో వధూవరుల తల్లిదండ్రులతో పాటు జనజాగృతి కన్వీనర్ శీరాపు శ్రీనువాసరావు, బాలభాస్కర్, కృష్ణారావు, యర్రవరపు గోవింద్, పొట్నూరు మహేష్‌లు పాల్గొన్నారు.



దండలు మార్చుకుంటున్న వధూవరులు

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడిగా 'కేసలి'



దాసన్నపేట: రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడిగా జిల్లా బాలల సంక్షేమ సమితి ఛైర్మన్ కేసలి అప్పారావును నియమిస్తూ రాష్ట్ర మహిళా శిశుసంక్షేమ శాఖ కార్యదర్శి కె.సునీత ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ 17 ఏళ్లుగా బాలల హక్కుల పరిరక్షణ కోసం పనిచేస్తున్నానని చెప్పారు. 2011 నుంచి బాలల సంక్షేమ సమితి ఛైర్మన్‌గా కొనసాగుతున్నానని తెలిపారు. గతంలో రైల్వే బోర్డు సభ్యుడిగా, జిల్లా విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుడిగా కూడా సేవలు అందించానని తెలిపారు. జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణ, బాల కార్మిక నిర్మూలనకు కృషి చేస్తున్నామని చెప్పారు. బాలల హక్కులకు భంగం కలిగితే వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతన్నామని చెప్పారు. తన సేవలను గుర్తించి రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యుడిగా బాధ్యతలు అప్పగించారని, ఈ పదవి మూడేళ్ల పాటు ఉంటుందని తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని చెప్పారు.

21న రాజారావు విగ్రహావిష్కరణ

దాసన్నపేట: దళిత హక్కుల కోసం కృషి చేసిన పాకా రాజారావు విగ్రహావిష్కరణకు దళితులు తరలిరావాలని విగ్రహ కమిటీ ఛైర్మన్ లోగిశ రామకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం కొత్తపేటలోని పాకారాజారావు స్వగృహంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో దళితుల సమస్యలపై పాకా రాజారావు ఉద్యమాలు చేశారన్నారు. ఈనెల 21న రాజారావు విగ్రహాన్ని రింగురోడ్డులోని వెంకటేశ్వర కోవెల జంక్షన్ వద్ద ఆవిష్కరిస్తామని చెప్పారు. కమిటీ సభ్యుడు అచ్చిరెడ్డి మాట్లాడుతూ రాజారావు దళితుల సంక్షేమంతో పాటు బీజేపీ బలోపేతానికి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున నాయకులు హాజరుకావాలని కోరారు. అనంతరం ఆవిష్కరణకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో కమిటీ సభ్యులు ఎం.గీతారెడ్డి, టి.హరి, నీలాపుదేవి, శంకరరావు, షకీల్, పి.సంతోష్‌కుమార్, ఎస్‌కె చాంద్, వి.సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

78 మద్యం సీసాల స్వాధీనం

విజయనగరం క్రైం: జిల్లాలోని నెల్లిమర్ల, గరివిడి చీపురుపల్లి మండలాల్లో శుక్రవారం ఎక్సైజ్ ఈఎస్‌టీఎఫ్ ఇన్‌చార్జ్ సిఐ పి.రాజగోపాలరావు, సిబ్బంది బెల్టుషాపు నిర్వాహకులపై దాడి చేసి 78 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ నెల్లిమర్ల మొయిద జంక్షన్‌లో బెల్టుషాపు నిర్వాహకుడు అంజిబాబు బార్ నుంచి 47 మద్యం సీసాలు కొనుగోలు చేసి విక్రయిస్తున్నాడన్నారు. అలాగే గరివిడి మండలం దుమ్మెద గ్రామానికి చెందిన అప్పలకొండ బెల్టుషాపు నిర్వహిస్తూ 16మద్యం సీసాలతో పట్టుబడిందన్నారు. చీపురుపల్లిలో రామారావు అనే బెల్టుషాపు నిర్వాహకుడు 15మద్యం సీసాలతో పట్టుబడినట్టు తెలిపారు. వీరిని తదుపరి చర్యలు నిమిత్తం నెల్లిమర్ల, చీపురుపల్లి ఎక్సైజ్ ప్రోహిబిషన్ స్టేషన్‌కు అప్పగించామన్నారు. ఎక్కడైనా మద్యం బెల్టుషాపులు నిర్వహిస్తే సమాచారం అందించాలని, వారిపేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. బెల్టుషాపులకు మద్యం సరఫరా చేస్తున్న లైసెన్సుడ్ షాపులపై కూడా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ దాడుల్లో ఈఎస్‌టిఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గోమాతను రక్షించండి

దాసన్నపేట: హిందువుల ఆరాధ్యదైవమైన గోమాతను రక్షించాలని గోవులు, జంతువులు సంరక్షణ సంఘ జిల్లా ప్రతినిధులు తెరుపల్లి శ్రీనివాసరావు, మద్దిల సోంబాబులు కోరారు. శ్రావణ శుక్రవారం సంద ర్భంగా గోమాతను కోట జంక్షన్ నుంచి ఊరేగిస్తూ పైడితల్లమ్మ కోవెల, కన్యకపరమేశ్వరి, శివాలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ కబేళాలను మూసివేయాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా గోవులను వధిస్తే తమ సంఘం ఆధ్వర్యంలో ప్రతిఘటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు సూర్యారావు, బంగారురాజు, పృథ్వీ, ఇప్పలి రామారావు, గండికోట శాంతి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎంఆర్ టీకా తప్పనిసరి

జామి: మీజిల్స్, తట్టు రుబెల్లా టీకా తప్పనిసరిగా 9 నెలల వయస్సు నుంచి 15సంవత్సరాల లోపు చిన్నారులు వేసుకోవాలని డాక్టర్ ఎల్.వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం జామి గ్రామంలో గల ఎల్లమాంబ హాప్‌ఉడ్ ప్రైవేటు పాఠశాలలో జరుగుతున్న ఎంఆర్ టీకాల శిబిరాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తట్టు వ్యాధి కారణంగా న్యూమోనియా, విరోచనాలు, మెదడువాపు వంటి వ్యాధులకు చిన్నారులు గురవుతారని అన్నారు. గర్భంతో ఉన్న మహిళలకు రుబెల్లా సోకితే ఇది పుట్టబోయే బిడ్డపై ప్రభావం చూపుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఈ టీకా వేయించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి ధనుంజయ నాయుడు, హెల్త్ ఎడ్యుకేటర్, ఎన్.అనిల్‌ప్రేమ్‌కుమార్, సిబ్బంది ముత్యాలమ్మ, జయ, భూలక్ష్మి, ఈశ్వరమ్మ, లక్ష్మి, ఆశ పాల్గొన్నారు.


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అప్పలనరసయ్య

అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ

గంట్యాడ: చంద్రంపేటలో అంబేద్కర్ విగ్రహాన్ని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయుల విగ్రహాలు మారుమూల గ్రామాల్లో ఏర్పాటు చేయడంపై అభినందించారు. అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సిరిపురం ఎంపీటీసీ సభ్యుడు జైహింద్ కుమార్, వైసీపీ నేతలు వర్రి నర్సింహమూర్తి, చలుమూరి వాసుదేవరావు, లచ్చిరెడ్డి కృష్ణ, కోళ్ల కొండలరావు పాల్గొన్నారు.

ఖరీఫ్‌పై చిగురిస్తున్న ఆశలు

● అనుకూలిస్తున్న వర్షాలు
● సబ్ డివిజన్ పరిధి మండలాల్లో ఉభాలకు సమాయత్తం


మరుపల్లిలో వరినాట్లు వేస్తున్న దృశ్యం

గజపతినగరం రూరల్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతన్నల్లో ఆశలు చిగురిస్తున్నాయి. నిన్నటి వరకు వర్షాలు అనుకూలించక పోవడంతో సబ్ డివిజన్ పరిధిలో అక్కడక్క మాత్రమే ఉభాలు జరిగాయి. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో రైతులు, దమ్ములు, వరినాట్లకు సిద్ధమవుతున్నారు. చెరువుల్లో నీరు చేరడంతో ఆనందం వ్యక్తంచేస్తున్నారు. సబ్ డివిజన్ పరిధిలోని గజపతినగరం, దత్తిరాజేరు, మెంటాడ, బొండపల్లి మండలాలకు సంబందించి 13వేల 917 హెక్టార్లలో ఖరీఫ్ వరిసాగాల్సి ఉన్నది. కానీ, ఇంతవరకు 1542 హెక్టార్లలో మాత్రమే ఉబాలు జరిగినట్లు అధికారులు అంటున్నారు. కొన్నిచోట్ల ఇప్పటికే వరి నారు ముదిరిపోయింది. దీంతో రైతులకు అవసరమైతే నారు పోసేందుకు 1010 రకం విత్తనాలను అందుబాటులో అధికారులు ఉంచుతున్నారు. ఆగస్టు నెలాఖరు నాటికి 167.30 మి,మీ వర్షపాతం నమోదు కావల్సి ఉన్నప్పటికీ ఇంతవరకు 130.70మి.మీ. మాత్రమే పడింది. ఈరెండు రోజుల్లో 80శాతం వరకు ఉభాలు పూర్తయ్యే అవకాలున్న అధికారులు అంచనావేస్తున్నారు. రైతులు వరి సాగుకు బదులు ప్రత్యామ్నాయ పంటలు వేస్తే అందుకు 50 టన్నుల మొక్కజొన్న విత్తనాలను సిద్ధం చేశారు. శతశాతం రాయితీపై జింక్ అందంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. 52 టన్నులు జింక్ ఇప్పటికే సరఫరా చేశారు. ఇంకా మరో 30 టన్నుల వరకు పంపిణీకి సిద్ధం చేశారు. బొరాన్ 75 కేజీలు అందుబాటులో ఉంచారు. ఇందులో 35 కేజీలు రైతులకు సరఫరా చే శారు. జిప్సమ్ 33 టన్నులకు గానూ 18.2 టన్ను లు ఇంతవరకు పంపిణీ చేశారు. యూరియా 460 టన్నులు, డీఏపీ 200 టన్నులు, పొటాష్ 135 ట న్నులతో పాటు కాంప్లెక్స్ ఎరువులు 270 టన్నుల వరకు రైతులకు అందుబాటులో ఉంచారు. జూలై నెలాఖరువరకు 300టన్నుల యూరియా, 100 టన్నులు, డీఏపీ 100 టన్నులు, ఎంవోపీ 80 ట న్నులు, సూపర్ ఫాస్పేట్ 200 టన్నులు కాంప్లెక్స్ ఎరువులు పంపిణీ చేశారు.

అధికారులు సూచనలు తప్పనిసరి

వర్షాభావ పరిస్థితుల నెలకొనడం వల్ల ఈ ఏడాది ఉభాలు ఆలస్యంగా జరుగుతున్నాయి. వరినారు కొన్ని ముదిరిపోయే పరిస్థితి ఉంది. అందువల్ల వ్యవసాయశాఖ అధికారుల సూచనలు, సలహాలు తప్పనిసరిగా తీసుకోవాలి. రైతులకు అ వసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయి. **- అన్నపూర్ణ, ఏడీఏ**

రికార్డులు సక్రమంగా నిర్వహించండి


ఉపాధి రికార్డులను పరిశీలిస్తున్న అధికారి నాగేశ్వరరావు

గజపతినగరం రూరల్: ఉపాధి పనుల రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఈబీటీ జిల్లా ప్రత్యేక అధికారి ఇ. నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఉపాధి ఫథకం కార్యాయలయంలో రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21నుంచి 26లోగా కేంద్ర కమిటీ జిల్లాకు రానుందని చెప్పారు. ఇంతవరకు ఉపాధి హామీ కూలీలు ఎంతమందికి జాబ్ కార్డులు అందజేశారు. వంద రోజుల పనులు ఎంతమందికి కల్పించారన్న విషయాలను రికార్డుల పరిశీలించి తెలుసుకున్నారు. వేతనాలు ఎంత మేర చెల్లింపులు జరిగాయో పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఏపీడీ చక్రవర్తి, ఏపీవో కృష్ణవేణి తదితరులుపాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధుల సహకారం అవసరం


మాట్లాడుతున్న ఎంపీడీవో

గజపతినగరం రూరల్: మూడో విడత ఓడీఎఫ్ గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణాల లక్ష్యాలు నెరవేరాలంటే ప్రజాప్రతినిధుల సహకారం ఎంతో అవసరమని ఎంపీడీవో కృష్ణవేణి అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలోని గుర్తించిన ఓడీఎఫ్ గ్రామాల్లో మూడో విడతకు సంబంధించి 3040 మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉందన్నారు. ఈనెలాఖరు నాటికి లక్ష్యాలను పూర్తి చేయాలని తెలిపారు. లబ్ధిదారులు ముందుకు వచ్చే విధంగా వారికి అవగాహన కల్పించాలన్నారు. అక్టోబర్ 2 నాటికి శత శాతం నిర్మాణాలు పూర్తిచేయాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఈవో పీఆర్డీ జనార్దనరావు, ఆర్. డబ్ల్యూఎస్ జేఈ భవానీ పాల్గొన్నారు.

వాగును కప్పి రోడ్డు వేయడం అన్యాయం

● మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య


రోడ్డును పరిశీలిస్తున్న బొత్స అప్పలనరసయ్య

గంట్యాడ: అధికార టీడీపీ నాయకులు నీరు పారే వా గును కప్పివేసి రోడ్డు వేయడం అన్యాయమని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య ఆరోపించారు. సిరిపురంలోని చెరువులోకి నీరు ప్రవహించే వాగుపై నిర్మించిన రోడ్డును ఆయన పరిశీలించారు. అనంతరం విలేఖర్లతో మాట్లాడుతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టి భూగర్భ జలాలును పెం చాలని చెబుతున్నారని, మరో వైపు ఆ నాయకులు వాగులు మూసివేస్తున్నారని విమర్శించారు. దీని వల్ల రైతులు నష్టపోతారన్నారు. అధికారులు విచారణ చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీటీసీ సభ్యులు జైహింద్ కుమార్ మాట్లాడుతూ వాగును కప్పివేయడం కాకుండా రికార్డులు మార్పు చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు వర్రి నర్సిహమూర్తి , చలుమూరి వాసుదేవరావు, కోళ్ల కొండలరావు ఉన్నారు.

జోరుగా వరినాట్లు.. బీడువారిన పొలాలు


సిరిపురంలో ఎండిపోతున్న నారు

గంట్యాడ: మండలంలో తాటిపూడి రిజర్వాయర్ ఆయకట్టు గ్రామాల్లో జోరుగా నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మరోవైపు వర్షధార గ్రామాల్లో చెరువుల్లో చుక్కనీరు లేక వరి నారును కాపాడుకోవడానికి అన్నదాతలు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. శుక్రవారం కురిసిన వర్షంతో రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.మండలంలో మొత్తం 5,800 హెక్టార్లలో సాగు విస్తీర్ణం కాగా, ఇప్పటి వరకూ తాటిపూడి పరిధిలో 3,034 హెక్టార్లకుగానూ 1575 హెక్టార్లలో నాట్లు వేసుకున్నారు. వర్షాధార గ్రా మాల్లో 50 హెక్టార్లలో ఎద, డ్రమ్ముసీడర్ పద్ధతిలో సాగుచేపడుతున్నారు. ఇప్పుడు కురుస్తున్న వర్షాలు మరింత అనుకూలిస్తే వర్షాధార భూముల్లో ఉభాలు పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.


తాటిపూడి ఆయకట్టు కింద ఉభాలు


ఆధునిక సాగుపై పూర్తిస్థాయిలో అవగాహన

వ్యవసాయ శాఖ డీడీ శ్రీనివాసరావు


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

గజపతినగరం రూరల్: వ్యవసాయగులో సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని వ్యవశాయశాఖ డీడీ ఎన్.శ్రీనివాసరావు సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఎంపీఈవోలకు మూడు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఈ కార్యక్రమానికిముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. రైతులకు భూసార పరీక్షల కార్డులను అందజేశామని, అయితే, వాటికి అనుగుణంగా ఎంతమంది రైతులు సాగు చేపడుతున్నారో తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కొంత మంది రైతులు ఇంకా పాతపద్ధతిలోనే సాగు చేస్తున్నారని, వారికి ఆధునిక సాగుపై అవగాహన కల్పించాలని సూచించారు. సిబ్బంది కొరత లేదన్నారు. ప్రతి వెయ్యి హెక్టార్లకు ఒక ఏఈవోను నియమించినట్లు వివరించారు. ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పించాలని కోరారు. ఏటా రైతులు సాగు చేస్తున్న పంటల్లో లాభనష్టాలను రికార్డుల రూపంలో నివేదికను అందజేయాలన్నారు. వర్షాభావం తక్కువగా ఉన్న ప్రదేశాల్లో స్వల్పకాలిక రకాలను సాగును ప్రోత్సహించాలని సూచించారు. కలుపు మొక్కల నివారణకు సూచనలందించాలని కోరారు. కలుపు మొక్కలతో 40శాతం పంటను నష్టపోతున్నారన్నారు. రైతులకు శతశాతం రాయితీపై జిప్సమ్‌ను అందజేస్తున్నట్లు వివరించారు. ఈకార్యక్రమంలో డాట్ సెంటర్ కో ఆర్డినేటర్ కె.లక్ష్మణరావు, ఏడీఏ అన్నపూర్ణ పాల్గొన్నారు.

ధైర్యలక్ష్మిగా రాజరాజేశ్వరి


అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు

బొండపల్లి: దేవుపల్లిలో వెలసిన శ్రీరాజరాజేశ్వరీ అమ్మవారు శ్రావణమాసం పురస్కరించుకుని రోజుకో అవతారంగా అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ప్రధాన అర్చకులు దూసి శ్రీధర్ శర్మ శుక్రవారం అమ్మవారిని ధైర్యలక్ష్మిగా అలంకరించి భక్తులకు దివ్యదర్శనం కల్పించారు. సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. పరిసర భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఆదుర్తి రామకృష్ణ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

గ్రామాల్లోనే రెవెన్యూ సమస్యలు పరిష్కారం

ఎం. వెంకటాపురం (గజపతినగరంరూరల్): రెవెన్యూ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బి. శేషగిరిరావు కోరారు. శుక్రవారం ఎం. వెంకటాపురంలో రైతుసేవలో రెవెన్యూ శాఖ గ్రామ సభను నిర్వహించారు. భూ సమస్యలపై 17దరఖాస్తులు వచ్చాయి. రైతుల సమస్యలను గ్రామాల్లోనే పరిష్కరిస్తామన్నారు. గ్రామంలో 10 మందికి పట్టాదార్ పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.వి.వి గోపాలరాజు,సర్వేయర్ రాజు, ఆర్ఐ సంజీవరావు ఉన్నారు.


పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న తహసీల్దార్

ట్రిపుల్ ఐటీకి ఇద్దరి ఎంపిక

వేపాడ : వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు హెచ్ఎం ఎంజే వర్మ తెలిపారు. దుడ్డు శ్రీనివాసగుప్తకు నూజివీడులో, గుమ్మాల శ్యామ్యూల్‌రాజుకు శ్రీకాకుళంలో సీట్లు సాధించారన్నారు. వీరిని ఉపాధ్యాయ సిబ్బంది, తల్లిదండ్రులు అభినందించారు.




ట్రిపుల్ ఐటీకి ఎంపికైన శ్యామ్యూల్, శ్రీనివాసగుప్త



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉద్యోగ మేళాకు 45 మంది హాజరు

కొత్తవలస: నరపాంలోని కోస్టల్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఉద్యోగ మేళాకు 45 మంది హాజరయ్యారని ప్లేస్‌మెంట్ అధికారి అడపా శ్రీనివాస్ తెలిపారు. సీఎంఎస్, ఐటీ సర్వీసుల్లో ఉద్యోగాలకు 2015 నుంచి 2017వరకు కళాశాలలో కోర్సులు పూర్తి చేసిన వారికి ఈ మేళా నిర్వహించామని చెప్పారు. జేఏఎం, హెచ్ఆర్ విభాగాలలో ఇంటర్వ్యూలు పూర్తయ్యాయని, టెక్నికల్ విభాగంలో రెండు రోజుల్లో పూర్తవుతాయన్నారు. ఎంపికైన వారి వివరాలు తర్వాత వెలువరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీఆర్‌కే నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

మొరాయించిన కంప్యూటర్లు.. సా..గిన రిజిస్ట్రేషన్లు

కొత్తవలస : కొత్తవలస సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం రిజిస్ట్రేషన్లకు ఆటంకం కలిగింది. కార్యాలయంలోని ఐదు కంప్యూటర్లలో మూడు మొరాయించడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ నెమ్మదిగా సాగింది. 2010లో అప్‌డేట్ చేసిన సాఫ్ట్‌వేర్ వెర్షన్ కాల పరిమితి ముగియడంతో కంప్యూటర్లు మొరాయించినట్టు సిబ్బంది తెలిపారు. పని చేసిన రెండు కంప్యూటర్లతోనే రిజిస్ట్రేషన్ పనులు చేశారు.



సన్మాన సభలో మాట్లాడుతున్న ఎంఈవో

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

శృంగవరపుకోట రూరల్ : బొడ్డవర పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఎంఈవో అప్పారావు ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానం నిర్వహించారు. ఈసందర్భంగా వారి సేవలను కొనియాడారు. బదిలీపై వెళ్లిన కె.బంగారునాయుడు, విజయలక్ష్మి, రత్నకుమారిని సర్పంచ్ తిరుమలరాజు పద్మావతి సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నమ్మపేరంటాలు గుడి పునఃప్రారంభం

లక్కవరపుకోట : ఎల్.కోట సంగంవీధిలో శుక్రవారం చిన్నమ్మ పేరంటాలు గుడిని పునఃప్రారంభించారు. విశ్వనాథ కుటుంబం ఇలవేల్పుగా ఈ తల్లి పూజలను అందుకుంటోంది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం భారీ అన్న సమారాధనను నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వనాథ జగన్నాథరావు పాల్గొన్నారు.



చిన్నమ్మపేరంటాలు ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా శ్రావణ శుక్రవారం పూజలు



వెంకటేశ్వరుడికి పూజలు చేస్తున్న వేద పండితులు

వేపాడ : వేపాడ మండల ప్రజలు మూడో శుక్రవారం పూజలను వైభవంగా జరిపారు. కల్యాణ వేంకటేశ్వరుడికి ఆలయ ధర్మకర్త రాపర్తి చిరంజీవి ప్రసాద సారథ్యంలో వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా కొత్తవలస మండలానికి చెందిన భక్తుడు శ్రీను సమకూర్చిన 108 లీటర్ల పాలు, 108 లీటర్ల పెరుగుతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఈ పూజలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో పంచముఖ గాయత్రి బ్రాహ్మణ సంక్షేమ సంఘం సారథ్యంలో లక్ష్మీదేవికి కుంకు మార్చన చేపట్టారు. కార్యక్రమంలో వేపాడ, వల్లంపూడి, దబ్బిరాజుపేట, సీతంపేట, వీలుపర్తి తదితర గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మహాదుర్గ అలంకారం

శృంగవరపుకోట/రూరల్ : శ్రావణ శుక్రవారం పూజలను మహిళలు భక్తి, శ్రద్ధలతో చేశారు. తమ ఇళ్లతో పాటు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలను జరిపారు. ఎస్.కోట దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని మహాదుర్గా అవతారంలో నిమ్మకాయల దండలతో అలంకరించారు. ఆలయ పురోహితులు హేజేబు రవిశర్మ, శేషగిరిశర్మ, నాగేశ్వరరావుశర్మ ఈ పూజలను నిర్వహించారు. ఎస్.కోట అలంకార్ థియేటర్ వద్ద ఉన్న సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ధర్మవరం వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో పురోహితుడు గోవిందశర్మ ఆధ్వర్యంలో ఆర్య వైశ్య మహిళలు పూజలు జరిపారు.



మహాదుర్గా అలంకారంలో దుర్గాదేవి

ఎంతోమందికి పని కల్పిస్తున్న ఉపాధి పథకం

కొత్తవలస : ఉపాధి హామీ పథకం గ్రామాల్లో ఎంతో మందికి ఉపాధి కల్పిస్తోందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. శుక్రవారం ఆమె ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి మేట్లకు టెంట్లు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కరువు పరిస్థితుల్లో రైతులను ఉపాధి పనులే ఆదుకుంటున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పి.రాజన్న, జడ్పీటీసీ సభ్యులు కోళ్ల రమణమ్మ, కరెడ్ల ఈశ్వ రరావు, ఎంపీడీవో పి.నారాయణరావు, ఉపాధి హామీ ఏపీఎం రత్నమాల, టీడీపీ మండల అధ్యక్షుడు కోళ్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



మేట్‌కు టెంటు అందిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

ఎస్‌బీఐ సేవా కేంద్రం ప్రారంభం



ఎస్‌బీఐ వినియోగదారుల సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎఫ్ఐసీ మేనేజర్

శృంగవరపుకోట : ఎస్.కోట తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా శుక్రవారం ఎస్‌బీఐ వినియోగదారుల సేవా కేంద్రాన్ని ఎఫ్ఐసీ మేనేజర్ ఎస్‌వీఎల్ఎన్ మోహనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కేంద్రాలతో గ్రామీణులు బ్యాంకింగ్ సేవలను చక్కగా ఉపయోగించుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్.కోట ఎస్‌బీఐ ప్రధాన బ్రాంచ్ మేనేజర్ ఎన్.రాజశేఖరరావు, ఏడీబీ మేనేజర్ రవి, సీఎస్‌సీఈ గవర్నన్స్ మేనేజర్ ఎల్.శేషు, కె.చంద్రశేఖర్‌బాబు, మీ సేవా నిర్వాహకుడు సీహెచ్ సంతోష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ, కొత్తవలసకు కరువు నిధులు విడుదల

●ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

లక్కవరపుకోట : వేపాడ, కొత్తవలస మండలాలకు రూ.1,49,94,330 కరువు నిధులు మంజూరైనట్టు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. శుక్రవారం ఆమె ఎల్.కోటలోని తన నివాసంలో విలేఖరులతో మాట్లాడారు. వేపాడ మండలంలో 995 మంది రైతులకు రూ.72,13,230, కొత్తవలస మండలంలో 1772 మంది రైతులకు రూ.77,81,100 మంజూరైనట్టు చెప్పారు. ఈ నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రికి తామంతా రుణపడి ఉంటామని తెలిపారు. ఆమె వెంట టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త కేబీసీ రాంప్రసాద్, ఎంపీపీ కొల్లి వెంకటరమణమూర్తి, జడ్పీటీసీ సభ్యుడు కరెడ్ల ఈశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు మల్లునాయుడు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

బ్రాహ్మణ పింఛన్ పథకానికి దరఖాస్తు చేసుకోండి

శృంగవరపుకోట : బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా ప్రవేశపెట్టిన కశ్యప పథకంలో పింఛన్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్.కోట బ్రాహ్మణసమాఖ్య నియోజకవర్గ కన్వీనర్ అక్కినపల్లి సూర్యప్రకాశరావు కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు ఆన్‌లైన్‌లో ఫొటో, రేషన్, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా జత పరిచి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 945 2448850ను సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే

శృంగవరపుకోట రూరల్ : విద్యుత్ నిర్వహణ పనుల నిమిత్తం శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ సురేష్‌కుమార్ తెలిపారు. ధర్మవరం, పోతనాపల్లి, సంతగైరమ్మపేట, సీతారాంపురం, రేవళ్లపాలెం, కృష్ణాపురం, వెంకటరమణపేట, ఎస్.కోట టౌన్, మామిడిపల్లి, చామలాపల్లి, మదుపాడ, వినాయకపల్లి, తలారి, ఉసిరి, తిమిడి, వసి, వెంకటరమణపేట, సీతంపేట గ్రామాలకు కరెంట్ ఉండదని పేర్కొన్నారు.

70 మంది ఎంపిక

పార్వతీపురం టౌన్: గాయత్రి కళాశాలలో రెడ్డీస్ ల్యాబ్ నిర్వహించిన జాబ్ మేళాలో 70మంది విద్యార్థులను ఎంపిక చేసినట్టు ల్యాబ్ హెచ్ఆర్ మేనేజర్ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఈ మేళాకు సుమారు 220 మంది హాజరైనట్టు చెప్పారు.

సినిమాలు

శృంగవరపుకోట

శ్రీశ్రీనివాస------నేనేరాజు..నేనే మంత్రి
శ్రీవెంకటేశ్వర ------జయజానకినాయక

కొత్తవలస

శ్రీజయ--------నేనే రాజు..నేనే మంత్రి
శ్రీరాజా--------------------------లై
శ్రీలక్ష్మీనరసింహ---జయజానకినాయక

జామి

జ్యోతి--------------జయజానకినాయక

వృద్ధులకు నగదు వితరణ

దాసన్నపేట: నిర్లక్ష్యానికి గురైన వృద్ధులను అక్కున చేర్చుకుంటున్న వృద్ధాశ్రమాలకు చేయూతనందించడం సామాజిక బాధ్యతని విజయనగరానికి చెందిన విశ్రాంత రైల్వే ఉద్యోగి కొండారాజు అన్నారు. పట్టణంలోని కంటోన్మెంట్‌లో ఉన్న ఎస్వీఎస్ వృద్ధాశ్రమాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. రూ.5వేలు నగదును నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులకు సేవ చేసేందుకు ముందుకురావాలని కోరారు. ఈ నగదుతో వృద్ధులకు భోజనం, వసతి కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకుడు ఆంజనేయులు, విశ్రాంత ఉద్యోగి మార్ల రఘుకుమార్, వృద్ధాశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు బేజార్లు!

● సదుపాయాల కల్పనలో ప్రభుత్వం విఫలం ● శిథిలావస్థలో షెడ్లు ● నిధులున్నా నోచుకోని అభివృద్ధి ● అవస్థలకు గురవుతున్న కొనుగోలు, విక్రయదారులు ● చోద్యం చూస్తున్న అధికారులు



రైతుబజార్‌లో వరండాపై విక్రయాలు

విజయనగరం టౌన్: రైతులు దళారీల బారిన పడకుండా నేరుగా కూరగాయలు విక్రయించేందుకు ప్రభుత్వం రైతుబజార్లను ఏర్పాటు చేసింది. ఇక్కడ కనీస సదుపాయాలు కల్పించకపోవడంతో కొనుగోలుదారులతో పాటు విక్రయదారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. విజయనగరం పట్టణంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు, దాసన్నపేట రింగురోడ్డు, తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతుబజార్లను ఏర్పాటు చేశారు. షెడ్డులు, స్టోర్ రూమ్‌లు లేకపోవడంతో కూరగాయలను దాచుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు.

మాన్సాస్ స్థలంలో నిర్వహణ

తహసీల్దారు కార్యాలయం రోడ్డులో వున్న రైతు బజారుకు సొంత స్థలం లేకుండా పోయింది. మాన్సాస్ స్థలంలో ఉంది. ఈ రైతుబజారు అభివృద్ధికి నిధులున్నా చేసేందుకు వీలు పడని పరిస్థితి. ఇక్కడ ఉన్న షాపులు ఎప్పుడూ ఖాళీగానే ఉంటాయి. కొనుగోలు దారులు ఎక్కువగా వస్తున్నా తాజా కూరగాయలు దొరకడం లేదు. ఈ రైతుబజారును రైల్వేస్టేషన్ రోడ్డుకు తరలించి అధునాతన సౌకర్యాలతో ఏర్పాటు చేస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదు.

ఆవరణలోనే షాపులు...

దాసన్నపేట రింగురోడ్డులోని ఉన్న రైతుబజారు నిత్యం కొనుగోలుదారులతో కిటకిటలాడుతుంటుంది.



ఆర్‌అండ్‌బీ రైతుబజారు ముఖద్వారం

రోడ్ల విస్తరణ కారణంగా కొంత స్థలం పోవడంతో షాపుల సంఖ్య తగ్గిపోయాయి. దీంతో బజారు ఆవరణలో రైతులు షాపులు ఏర్పాటు చేసుకుని కూరగాయలు విక్రయిస్తుంటారు. వర్షం పడితే బురదగా మారుతోంది. ఇక్కడ షాపులు నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉంది.

ఆర్‌అండ్‌బీ రైతు బజారుకు స్థల సమస్య

విజయనగరం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ రైతుబజారుకి స్థల సమస్య ఉంది. పట్టణ నడిబొడ్డున ఉండడంతో ఈ బజారు నిత్యం రద్దీగా ఉంది. ఎక్కువ మంది కొనుగోలు దారులు రావడం స్థలం తక్కువతో ఇబ్బందులు ఎదురౌతున్నాయి. ఇక్కడ షాపులకు కూడా మంచి డిమాండ్ వుంది. షాపులు ఖాళీగా లేకపోవడంతో కిందనే వుండి కూరగాయలు విక్రయించుకుంటున్నారు. కూరగాయలు నిల్వ చేసుకునే గదులు లేవు. రేకుల షెడ్డుల్లోనే కూరగాయలను రైతులు విక్రయిస్తున్నారు. రేకులకు రంధ్రాలు పడడంతో వర్షం పడితే కూరగాయలు తడిసి పోతున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి రైతుబజార్లలో సదుపాయాల కల్పనపై దృష్టిసారించాల్సివుంది.



నిర్మాణంలో జనతాబజార్

జనతా బజార్ సిద్ధం

● రైతుబజారు తరహాలో షాపులు ● రోడ్ల విస్తరణలో షాపులు కోల్పోయిన వారికి ప్రాధాన్యం

విజయనగరం టౌన్: జిల్లా కేంద్రంలో జనతాబజారు నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధమైంది. ఏడాది కిందట భవన నిర్మాణం ప్రారంభమైంది. తొలివిడతగా 72మందికి ఇక్కడ షాపులు కేటాయించే అవకాశం ఉంది. రోడ్ల విస్త రణలో భాగంగా షాపులు కోల్పోయేవారికి, మున్సిపల్ కార్యా లయం ఎదుట వున్న ట్రాఫిక్ ఐలాండ్ నుంచి గణేష్ ఆల యానికి వెళ్లే దారిలో వున్న ఫుట్‌పాత్‌పై వ్యాపారం చేసే కాయగూరల వ్యాపారులతో పాటు మరికొంతమందికి ఇక్కడ షాపులు కేటాయించే అవకాశాలు ఉన్నాయి. విజయనగరం పట్టణానికి కాయగూరల మార్కెట్‌గా ఇది మారే అవకాశం ఉంది. ఇక్కడ షాపులు కేటాయించే వారిలో ఎక్కువ మంది కూరగాయల వ్యాపారులే. ఇక్కడ రైతుబజారు తరహాలో షాపులను మున్సిపాలిటీ ఏర్పాటు చేసింది. సెప్టెంబరు నెల తొలివారంలో జనతాబజార్ ప్రారంభమయ్యే అవకాశం ఉంది

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



నోట్‌పుస్తకాలు అందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

దాసన్నపేట: చదువుకి పేదరికం అడ్డం కాకూడదని చైతన్య కళాశాల ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసులునాయుడు అన్నారు. శుక్రవారం కోటజంక్షన్ సమీపంలోని సంస్కృత పాఠశాలలో 400మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్ అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు సాధించవచ్చన్నారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలు చేపడుతుండడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో శ్రీచైతన్య కళాశాల జోనల్ ఏవో పి.నర్సినాయుడు, సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ ఉదయ్‌భాస్కర్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

లొట్లపల్లిలో ప్రభుత్వ భూమి స్వాధీనం

జామి: మండలంలోని లొట్లపల్లి గ్రామంలో 91సెంట్లు ప్రభుత్వ భూమిని శుక్రవారం తహసీల్దార్ కె ఆనందరావు తన సిబ్బందితో కలిసి స్వాధీనం పర్చుకున్నారు. లొట్లపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 68/5లో ప్రభుత్వం పొన్నకాయల అప్పలస్వామికి 91సెంట్లు ప్రభుత్వ భూమిని డీపట్టాగా మంజూరు చేసింది. ఈ భూమిని 1983లో అప్పలస్వామి విక్రయించేశాడు. ఈ భూమి ముగ్గురి చేతులు మారి ప్రస్తుతం జన్నెల సాదమ్మ ఆధీనంలో ఉంది. డీ పట్టా భూములు విక్రయించిన అప్పలస్వామికి, కొనుగోలు చేసిన సాదమ్మకు తహసీల్దార్ నోటీసులు జారీ చేశారు. వారి నుంచి స్పందన లేకపోవడంతో శుక్రవారం తహశీల్దార్ ఈ భూమి ప్రభుత్వానికి చెందినదని బోర్డులు పాతారు. ఈభూమిని ప్రభుత్వ అవసరాలకు వినియోగిస్తామని తహశీల్దార్ చెప్పారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ పూజలు

● కిటకిటలాడిన ఆలయాలు
● అమ్మవారికి ప్రత్యేకలంకరణ

విజయనగరం రూరల్: శ్రావణ శుక్రవారం సందర్భంగా విజయనగరం పట్టణంలోని ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో శ్రావణ పూజలు నిర్వహించారు. చదురుగుడిలో పైడితల్లి అమ్మవారిని కూరగాయలు, వివిధ పండ్లతో అలంకరించారు. వనంగుడిలో ఆలయ ప్రధాన అర్చకుడు సాయికిరణ్‌శర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమ పూజలు చేశారు. పూజకు అవసరమైన సామాగ్రిని పట్టణానికి చెందిన వేణు దంపతులు భక్తులకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రాజేశ్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

ఐశ్వర్య లక్ష్మికి ప్రత్యేకాలంకరణ

దాసన్నపేట: శ్రావణమాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని మన్నార్ రాజగోపాలస్వామి ఆలయంలో ఐశ్వర్యలక్ష్మికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని వివిధ రకాల పూలతో అలంకరించారు. ప్రధాన అర్చకుడు ఫణిహారం మణిబాబు, శ్రీధర్‌లు పూజలుచేసి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అవనాపు శివప్రసాద్, నిర్వహణ కమిటీ కార్యదర్శి కంది మురళీనాయుడు, ప్రతినిధులు ఎం. రామలింగస్వామి, మాటూరి సతీష్‌లు ఏర్పాట్లు చేశారు.

రామనారాయణంలో...

ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామనారాయణంలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని లక్ష్మీదేవికి గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి విశేష కుంకుమార్చన, విశేష హారతీ, ప్రత్యేక పూజలను ప్రధాన అర్చకుడు నాగవర్ధన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు.



వనంగుడిలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

శ్రీక్షేత్రంలో అలరించిన నృత్య ప్రదర్శన

భారతీయ తత్వ దర్శన కేంద్ర శ్రీక్షేత్రమ్‌లోని అష్టలక్ష్మి సమేత ఐశ్వర్య వేంకటేశ్వరస్వామిఆలయంలో శుక్రవారం చిన్నారుల నృత్య ప్రదర్శన అలరించింది. శ్రీసాయి లలితా నృత్య కళానికేతన్ ఆధ్వర్యంలో పలు పాటలకు ఎం మానసజ్యోతి, కెవిఎస్ మౌనిక, పి.తేజస్విని, ఎం.రేణుకా, చక్కటి నృత్యాన్ని ప్రదర్శించారు.





పైడితల్లి అమ్మవారి ఆలయ ఆవరణలో గోవుకు పూజలు, మన్నార్ రాజగోపాలస్వామి ఆలయంలో పూజిస్తున్న భక్తులు

సమాచారం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రింగురోడ్డు: పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏడీఈ త్రినాధరావు ఒక ప్రకటనలో తెలిపారు. పీడబ్ల్యూ మార్కెట్, ట్యాంకుబండ్, దాసన్నపేట, బాలాజీనగర్, ఆర్టీసీ కాంప్లెక్స్, ప్రదీప్‌నగర్, కేఎల్‌పురం, దుప్పాడ, కోరుకొండ, రాకోడు, కొత్తపేట, లంకాపట్నం, బాబామెట్ట, వీటీ అగ్రహారం, పూల్‌బాగ్, వేణుగోపాలపురం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

దాసన్నపేట: ఎలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్-105 ఆధ్వర్యంలో తోటపాలెం గాయత్రి స్కూల్‌లో శనివారం ఉదయం పదిగంటలకు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం నిర్వహించనున్నామని క్లబ్ వైస్ గవర్నర్ సముద్రాల గురుప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ రంగంలో సేవలందించిన వారికి సత్కరించనున్నామన్నారు.

నేడు కేంద్రమంత్రి అశోక్ రాక

కలెక్టరేట్: కేంద్రమంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు శనివారం సాయంత్రం 6.30గంటలకు జిల్లాకు రానున్నారు. 21వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు ఇక్కడి నుంచి ఢిల్లీ వెళ్తారు.